www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 22-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 203

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి రా.8.17 తదుపరి విదియ, నక్షత్రం: స్వాతి రా.1.52 తదుపరి విశాఖ, వర్జ్యం: శేషం ఉ. 7.02 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.36 - 12.22, అమృతఘడియలు: సా.4.00 - 5.48, రాహుకాలం: ఉ.12.00 - 1.30, సూర్యోదయం: 6.13, సూర్యాస్తమయం: 5.45

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బంగాళాఖాతంలో అల్పపీడనం

25 వరకు భారీ వర్ష సూచన



హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆగ్నేయ బంగాళాఖాతంలో మంగళవారం ఉదయం అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది మరింత బలపడి రానున్న 24 గంటల్లో వాయుగుండంగా మారుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో ఈనెల 23 నుంచి 25 వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం రాష్ట్రంలోని ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని హెచ్చరించింది. ఈ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

మావోయిస్టులు లొంగిపోవాలి

జనజీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- రాష్ట్రంలో నక్సల్స్ ప్రభావం తగ్గిపోయింది
- పోలీసుల అజేయ స్ఫూర్తికిది నిదర్శనం
- పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం.. 300 గజాల ఇంటి స్థలం
- ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- పోలీస్ అమరవీరులకు సీఎం నివాళి
- ప్రజలతోనే ఫ్రెండ్లీ పోలీసింగ్.. నేరస్థులతో కాదు: డీజీపీ శివధర్‌రెడ్డి



పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోవాలన్నారు. ఇటీవల అనేక మంది అగ్రనేతలు లొంగిపోయిన విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రం గతంలో మావోయిస్టులు, తీవ్రవాద కార్యకలాపాలతో బాధపడిందని చెప్పారు. ఇటీవలి కాలంలో ఉగ్రవాదం, నక్సల్స్ ప్రభావం వేగంగా తగ్గుముఖం పట్టాయన్నారు. రాష్ట్ర పోలీసుల అజేయ స్ఫూర్తికి ఇది నిదర్శనమని తెలిపారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గోషామహల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని, అమరులకు నివాళులు అర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నక్సల్స్ ముప్పును రూపుమాపడంలో తెలంగాణ పోలీసులు చేసిన కృషిని అభినందించారు. మావోయిస్టులు లొంగిపోయి, సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడాలని.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఎంతోమంది పోలీసులు దేశం కోసం ప్రాణత్యాగాలు చేశారని చెప్పారు. పోలీసులంటే సమాజానికి

మిగతా 13వ పేజీలో...

వంద జిల్లాల్లో స్వేచ్ఛావాయువులు!

- మావోయిస్టు ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తున్నాం
- పదేళ్ల కిందట 125 జిల్లాల్లో.. ప్రస్తుతం 11 జిల్లాలకే పరిమితం: ప్రధాని మోదీ 2

మల్లోజుల, ఆశన్నలకు వై క్యాటగిరీ భద్రత?

కొత్త 'అభయ్'.. తిప్పిరి తిరుపతి?

ఆపరేషన్ కగార్ యుద్ధాన్ని నిరసిస్తూ 24న దేశవ్యాప్త బంద్.. మావోయిస్టు పార్టీ పిలుపు 10



రియాజ్ ఎన్‌కౌంటర్


- కానిస్టేబుల్ ప్రమోద్ హత్యకేసు నిందితుడు పోలీసు కాల్పుల్లో హతం
- ఆస్పత్రిలో కానిస్టేబుల్ వద్ద తుపాకీ లాక్కొని ట్రిగ్గర్ నొక్కేందుకు ప్రయత్నించిన రియాజ్
- ఆత్మరక్షణ కోసం పోలీసుల కాల్పులు.. రియాజ్ మృతి.. నిజామాబాద్ సీపీ వెల్లడి
- రియాజ్‌ను పట్టుకునే క్రమంలో కత్తిపోట్లకు గురైన ఆసిఫ్‌ను పరామర్శించిన డీజీపీ
- ఆయన చికిత్సకయ్యే ఖర్చునంతా ప్రభుత్వమే భరిస్తుందని హామీ

నిజామాబాద్/హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌పై కత్తితో దాడికి పాల్పడి హత్య చేసిన రియాజ్(24) పోలీసుల కాల్పుల్లో హతమయ్యాడు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రియాజ్.. అక్కడ డ్యూటీలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ వద్ద తుపాకీ లాక్కొని తప్పించుకునే ప్రయత్నం చేశాడని, దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడని నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను శుక్రవారం హత్య చేసి పరారైన రియాజ్ ఆదివారం మధ్యాహ్నం నగర శివారులోని

మిగతా 14వ పేజీలో...

అమెరికా వెళ్లే విద్యార్థులకు ఉపశమనం

ఎఫ్-1 నుంచి హెచ్-1బీకి మారితే లక్ష డాలర్లు కట్టనక్కర్లేదు



- తాజా మార్గదర్శకాల్లో స్పష్టత ఇచ్చిన అమెరికా ఇమిగ్రేషన్ విభాగం
- జే-1, ఎల్-1 వారికీ మినహాయింపు
- ఇప్పటికే హెచ్-1బీ వీసా ఉండి కంపెనీ మారే వారికీ వర్తించదు
- ఇప్పటికే అక్కడ ఉన్నవారికే సౌలభ్యం
- కొత్తగా వెళ్లేవారికి, పాత వీసాల గడువు.. ముగిసినవారికి మాత్రమే లక్ష డాలర్ల ఫీజు
- ఉల్లంఘనలు ఉంటే లక్ష డాలర్లు కట్టక తప్పదని హెచ్చరిస్తున్న నిపుణులు

వాషింగ్టన్, అక్టోబరు 21: అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరుతో అమెరికా ఉద్యోగ కలలు కల్లలవుతున్నాయన్న నిరాశలో కూరుకుపోయిన భారత విద్యార్థులకు భారీ ఉపశమనం లభించింది. అమెరికాలో చదువుకునే విద్యార్థులు, ఇప్పటికే వివిధ ఉద్యోగాలు చేస్తున్నవారు హెచ్-1బీ వీసా కోసం లక్ష డాలర్లు కట్టాల్సిన అవసరం లేదని ఆ దేశ పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) స్పష్టం చేసింది. ఇప్పటికే ఎఫ్-1, జే-1, ఎల్-1 తదితర వీసాలతో అమెరికాలో ఉంటున్న విదేశీయులు హెచ్-1బీకి మారాలనుకుంటే ఫీజు నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపింది. ఈ మేరకు తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. అమెరికా వెలుపల ఉండి కొత్తగా దరఖాస్తు చేసినా, కాన్సులర్ ప్రాసెసింగ్ కోరినా ఫీజు చెల్లింపు నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. ప్రస్తుత హెచ్-1బీ వీసాదారులు అమెరికాకు రాకపోకలు సాగించడానికి ఎలాంటి అడ్డంకులూ ఉండబోవని వివరణ ఇచ్చింది.

యూఎస్‌సీఐఎస్ మార్గదర్శకాలు ఇవీ..

- ఎఫ్-1 వీసాపై ఇప్పటికే అమెరికాలో చదువుకుంటున్నవారు, చదువు పూర్తయి ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)పై ఉన్నవారు హెచ్-1బీ వీసా కోసం లక్ష డాలర్లు కట్టాల్సిన అవసరం లేదు.
- హెచ్-1బీపై ఉద్యోగం చేస్తూ.. వీసా రెన్యువల్, సవరణ (కంపెనీ మార్పు) కోసం దరఖాస్తు చేసుకొనే వారికి ఫీజు మినహాయింపు ఉంటుంది.
- ఎల్-1 (సంస్థల్లో అంతర్గత బదిలీలు), జే-1 (వైద్యులు, పరిశోధకులు, అధ్యాపకులు, ఇతర నిపుణులు) వీసాలపై ఉండే వారికి హెచ్-1బీకి మారితే ఫీజు వర్తించదు. కానీ వాళ్లు రెండేళ్లపాటు స్వదేశానికి వెళ్లిరావాలనే (హోమ్ రెసిడెన్సీ) నిబంధన ఉంది. ఇందులో వైద్యులకు మాత్రం హోం రెసిడెన్సీ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు.
- 2025 సెప్టెంబరు 21వ తేదీకి ముందే దాఖలైన, ఆమోదం పొందిన హెచ్-1బీ దరఖాస్తుదారులు

మిగతా 2వ పేజీలో...

అమెరికా చదువుపై అనాసక్తే!

హెచ్-1బీ నిబంధనల సమస్య తేలినా భారతీయ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తగ్గని ఆందోళన.. కన్సల్టెన్సీల వెల్లడి 2




రైతులకు రబీ షాక్!

- చైనా ఎగుమతుల నిలిపివేతతో పెరుగనున్న ఎరువుల ధరలు 2
- యూరియా, డీఏపీ ఎరువుల్లో 95 శాతం చైనా నుంచే..

'ఇద్దరు పిల్లల' నిబంధన ఎత్తివేతకు ఆర్డినెన్స్

- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం..
- ఆర్డినెన్స్ బిల్లుపై మంత్రి సీతక్క సంతకం 13
- క్యాబినెట్ ఆమోదం తర్వాత గవర్నర్ వద్దకు..
- త్వరలో స్థానిక ఎన్నికల్ని నిర్వహించాల్సిన నేపథ్యంలో ఆర్డినెన్స్‌ను ఎంచుకున్న సర్కారు



పత్తి రైతులను ఆదుకుంటాం

13

- తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదు
- పాలేరు సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నేతలంతా అక్కడే!

జూబ్లీహిల్స్‌లో ప్రధాన పార్టీల మోహరింపు

- రంగంలోకి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్ షో!
- పార్టీ తరపున ప్రచారంలో కేసీఆర్ పాల్గొనే చాన్స్
- బీజేపీ అభ్యర్థికి మద్దతుగా కేంద్ర మంత్రులు, యూపీ, రాజస్థాన్ సీఎంలు వచ్చే అవకాశం
- రసవత్తరంగా మారనున్న ఉప ఎన్నిక ప్రచారం



నామినేషనకు చివరి రోజు అయిన మంగళవారం జూబ్లీహిల్స్ ఎన్నికల కార్యాలయం షేక్‌పేట ఎమ్మార్వో ఆఫీసు వద్ద నెలకొన్న సందడి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం రసవత్తరంగా మారుతోంది. ఈ ఎన్నిక ఫలితం ప్రభావం వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికలపై ఉంటుందన్న అంచనాతో ఆయా పార్టీలు దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షానికి చెక్ పెట్టేందుకు అధికార కాంగ్రెస్, ఈ రెండు పార్టీలకు దీటుగా నిలిచామన్న సంకేతాన్నిచ్చేందుకు బీజేపీ.. ప్రచార వ్యూహ, ప్రతివ్యూహాలకు రంగం సిద్ధం చేసుకున్నాయి. మూడు పార్టీలు.. అగ్ర నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,

మిగతా 12వ పేజీలో...

భారీగా నామినేషన్లు

- చివరిరోజు 160కి పైగా దాఖలు
- అర్ధరాత్రి దాకా కొనసాగిన స్వీకరణ
- మొత్తం నామినేషన్లు 250 దాటే అవకాశం 12
- ట్రిపుల్ ఆర్, ఫార్మాసిటీ బాధిత రైతులు, విశ్రాంత ఉద్యోగుల నామినేషన్లు

కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ

- ఓటరు జాబితాపై ఇద్దరు నేతల ఘర్షణ
- రహమత్‌నగర్ డివిజన్‌లో ఘటన



జల విద్యుత్తుతో జెన్‌కోకు 2 వేల కోట్లు!

- రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి
- ఇప్పటికే 5 వేల మిలియన్ యూనిట్లు
- సీజన్ ముగిసేనాటికి సరికొత్త రికార్డు ఖాయం!

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల విద్యుత్తు ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరుగుతోంది. ఈ సీజన్‌లో రిజర్వాయర్లకు భారీ వరద వచ్చింది. ఆ జలాలను ఒడిసి పట్టుకొని విద్యుత్తును ఉత్పత్తి చేయడంతో ఇప్పటిదాకా తెలంగాణ జెన్‌కో రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయాన్ని ఆర్జించింది. కరెంటు యూనిట్ రూ.4 చొప్పున డిస్కమ్‌లకు విక్రయిస్తోంది. తెలంగాణ జెన్‌కో ఈ నెల 19న

మిగతా 14వ పేజీలో...

బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్‌లకు బుద్ధి చెప్పాలి

ఆ మూడు పార్టీలూ ఒక్కటే : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కాంగ్రెస్‌కు అసదుద్దీన్ మద్దతు.. ఆయన తమ్ముడు బీఆర్ఎస్‌కు.. : సంజయ్
- రాష్ట్రాన్ని మార్పు వైపు తీసుకెళ్లే ఈ ఎన్నిక చాలా కీలకం : రాంచందర్ రావు
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి నామినేషన్ దాఖలు
- బీజేపీ స్టార్ క్యాంపెయినర్ జాబితాలో 40 మంది 12

దానం.. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినరా?

- ఏ పార్టీలో ఉన్నాడో చెప్పలేని ఆయనకు ఆ బాధ్యతా?
- కాంగ్రెస్ దిక్కుమాలిన రాజకీయాలకు ఇది నిదర్శనం 14
- దమ్ముంటే రాజీనామా చేసి.. ఉప ఎన్నికల్లో గెలవాలి: కేటీఆర్
- పేదల ఇళ్ల కూల్చివేత ఆగాలంటే కాంగ్రెస్‌ను ఓడించాలి: హరీశ్‌రావు

ఏ సమస్య ఉన్నా నేరుగా నాకే చెప్పాలి

- కొండా దంపతులకు సీఎం రేవంత్ సూచన
- దీపావళి రోజున ముఖ్యమంత్రితో వారి భేటీ
- సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- తమ కూతురు సుస్మిత వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేసిన కొండా దంపతులు
- సున్నితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలి: మహేశ్‌గౌడ్

హైదరాబాద్/వరంగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో దీపావళికి ముందు చిటపటలాడిన మంత్రి కొండా సురేఖ వివాదం.. దీపావళి రోజున చల్లారింది. సీఎం రేవంత్ రెడ్డితో కొండా దంపతుల భేటీతో ఈ వివాదం సమసిపోయింది. కొండా సురేఖ మాజీ ఓఎస్డీని అరెస్టు చేసేందుకు ఆమె నివాసానికి

మిగతా 13వ పేజీలో...

జపాన్ తొలి మహిళా ప్రధానిగా తకైచి



టోక్యో, అక్టోబరు 21: జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా అధికార పార్టీ ఎల్‌డీపీ నేత సనే తకైచి ఎన్నికయ్యారు. మంగళవారం పార్లమెంట్ దిగువసభలో జరిగిన ఓటింగ్‌లో ఆమె చారిత్రక విజయం సాధించారు. 465 మంది సభ్యులు గల సభలో తకైచి మెజార్టీ మార్కును దాటి 237 ఓట్లు సాధించారు. తకైచి ఎన్నికను ఎగువసభ కూడా ఆమోదించనుంది. తర్వాత జపాన్ రాజుతో సమావేశమైన అనంతరం.. ఆమె దేశ 104వ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవలి వరకు ప్రధానిగా కొనసాగిన షిగెరు ఇషిబా పలు ఎన్నికల్లో భారీ ఓటముల నేపథ్యంలో గతనెల తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో తదుపరి ప్రధాని ఎన్నిక అనివార్యమైంది. రాజకీయాల్లో మహిళా ప్రాతినిధ్యంలో అట్టడుగు స్థానంలో ఉన్న దేశానికి 64 ఏళ్ల సానే తకైచి మొట్టమొదటి మహిళా ప్రధానిగా ఎన్నిక కావడం ఒక చారిత్రక విజయంగా చెప్పవచ్చు. తకైచి దేశ తొలి ఆర్థిక మహిళా మంత్రిగా సత్సుకి కటమయాను నియమించుకొనే అవకాశం ఉందని స్థానిక మీడియా పేర్కొంది. తకైచి జపాన్‌లో బౌద్ధమతం విరాజిల్లిన పురాతన నగరమైన నరాలో 1961 మార్చి 3న జన్మించారు. ఆమె తండ్రి ఒక కంపెనీలో సేల్స్‌మ్యాన్‌గా, తల్లి నరా పోలీస్ విభాగంలో పనిచేశారు.

కర్ణాటక సీఎంతో కిరణ్ మజుందార్ భేటీ

» బెంగళూరు అభివృద్ధికి సహకరిస్తామని హామీ



బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో గుంతల రహదారులు, చెత్త సమస్యపై 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు చేసిన బయోకాన్ కంపెనీ సీఎండీ కిరణ్ మజుందార్ షా.. మంగళవారం కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లతో భేటీ అయ్యారు. సీఎం అధికారిక నివాసం కావేరికి వెళ్లిన ఆమె సిద్దరామయ్యకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. నగర సమస్యలపై చర్చించారు. అనంతరం ఆమె సదాశివనగర్‌లోని డీసీఎం డీకే శివకుమార్ నివాసానికి వెళ్లి, ఆయనతో భేటీ అయ్యారు. బెంగళూరు అభివృద్ధికి సహకరిస్తామని ఆమె హామీ ఇచ్చారని డీకే శివకుమార్ విలేకరులకు చెప్పారు. బెంగళూరు ప్రగతి, ఆధునికీకరణ, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ఆమెతో చర్చలు జరిగాయన్నారు. నగర సమస్యలపైనా ఆమె ఒక స్పష్టమైన నిర్ణయంతో ఉన్నారని, వాటిపైనే అభిప్రాయాలు తెలిపారని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, కిరణ్ మజుందార్ గుజరాత్‌కు చెందినవారని, అందుకే బెంగళూరుపై విమర్శలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఆమె స్పందించారు. 'నేను ఈ గడ్డపై పుట్టిన ఆడ బిడ్డను. బెంగళూరులోనే పుట్టాను. నా నగరంలో ఉండటం నాకు గర్వకారణం' అని ట్వీట్ చేశారు.

బిహార్‌లో మహాకూటమిలో చీలిక!

పట్నా, అక్టోబరు 21: బిహార్ మహాకూటమిలో విభేదాలు నెలకొన్నట్లు కనిపిస్తోంది. పలు నియోజకవర్గాల్లో ఆ కూటమిలోని రెండేసి పార్టీలు అభ్యర్థులను నెలబట్టడమే ఈ అభిప్రాయానికి కారణం. ఆర్జేడీ, కాంగ్రెస్ ఆరు సీట్లలో ముఖాముఖి తలపడుతుండగా.. సీపీఐ, కాంగ్రెస్ నాలుగు సీట్లలో పోటీ పడుతున్నాయి. ముకేశ్ సహానీ వికాస్ శీల్ ఇన్సాన్ పార్టీ, ఆర్జేడీ రెండు సీట్లలో తలపడుతున్నాయి. సోమవారం ఆర్జేడీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాతో(143 సీట్లకు) ఈ విషయం స్పష్టమైంది. ఈ జాబితాలో కాంగ్రెస్ పోటీ చేస్తోన్న ఆరు సీట్లకు కూడా అభ్యర్థులను ప్రకటించారు. ఈ స్నేహపూర్వక పోటీల వల్ల ప్రతిపక్షాల ఓట్లు చీలిపోయి ఎన్డీయే లబ్ధి పొందుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కాగా బిహార్‌లో రెండో దశ పోలింగ్‌కు కూడా సోమవారంతో నామినేషన్ల గడువు ముగిసింది. నవంబరు 6న ఎన్నికలు నిర్వహించనున్న మొదటి దశలో 121 స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా.. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 1,314 మంది పోటీలో ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా బిహార్ ఎన్నికల్లో ఆరు సీట్లలో తమ అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటించిన జార్ఖండ్ ముక్తి మోర్చా తాజాగా ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. తమ మిత్రపక్షాలైన ఆర్జేడీ, కాంగ్రెస్ రాజకీయ కుట్ర కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. జార్ఖండ్‌లో తమ మూడు పార్టీల కూటమిపై సమీక్షిస్తామని, ఆ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని పేర్కొంది.

త్వరగా పెళ్లి చేసుకుని స్వీట్లకు ఆర్డర్ ఇవ్వండి..

» రాహుల్ గాంధీకి స్వీట్ షాప్ యజమాని సూచన



న్యూఢిల్లీ, అక్టోబరు 21: "రాహుల్ జీ మీరు దేశంలోనే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్. త్వరగా పెళ్లి చేసుకోండి.. మీ వివాహానికి కావాల్సిన స్వీట్ల ఆర్డర్ల కోసం మేం ఎంతగానో ఎదురు చూస్తున్నాం". ఇది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పాత ఢిల్లీలో ఎదురైన ఓ ఆసక్తికర అనుభవం. దీపావళి సందర్భంగా సుప్రసిద్ధ ఘంటేవాలా మిఠాయి దుకాణంలో సందడి చేసిన రాహుల్‌కు, ఆ షాపు యజమాని సుశాంత్ జైన్ నుంచి ఈ సరదా విజ్ఞప్తి ఎదురైంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ అభ్యర్థనకు రాహుల్ గాంధీ చిరునవ్వుతో స్పందించడం వీడియోలో కనిపించింది. పండగ సందర్భంగా స్వీట్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన రాహుల్‌ను, సుశాంత్ జైన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మిఠాయిలు తయారు చేయడంలో స్వయంగా చేతులు కలిపారు. తన తండ్రి రాజీవ్ గాంధీకి ఇష్టమైన 'ఇమర్తి'తో పాటు తనకు ఎంతో ఇష్టమైన 'బేసన్ లడ్డూ'లను తయారు చేసి వాటి రుచిని ఆస్వాదించారు.

చెట్లకు బంగారం కాస్తోంది

» ఫిన్లాండ్‌లోని స్ప్రూస్ చెట్లకు పుత్తడి కాత

» ఆకుల కొసల్లో బంగారు రేణువులు



న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఇంట్లో పిల్లలో.. పెద్దలో అలవికాని కోరికల చిట్టా విప్పితే 'డబ్బు ఏమైనా చెట్లకు కాస్తుందనుకుంటున్నారా?' అని ఇంటిపెద్దగా రుసరుసలాడుతుంటాం! మరి.. ఈ నానుడి నిజమైతే ఎలా ఉంటుంది? ఔను.. చెట్లకు డబ్బులు కాసేరోజులొచ్చేశాయి. తళతళలాడే కరెన్సీ నోట్ల రూపంలో కాదు గానీ ధగధగ మెరిసే అచ్చమైన బంగారం రూపంలో! బంగారం కాసే ఆ చెట్టు పేరు 'నార్వే స్ప్రూస్'! ఈ చెట్లకు దాదాపు బంగారు రంగులో మిలమిల మెరిసే వదునైన సూదుల్లాంటి ఆకులుంటాయి. వీటి కొసకొసల్లో బంగారు రేణువులు ఉత్పత్తవుతున్నాయి. వీటిని బయటకు తీసి ప్రత్యేక పద్ధతిలో ప్రాసెసింగ్ చేస్తే నిగనిగలాడే బంగారం ఉత్పత్తి అవుతుంది. ఫిన్లాండ్‌లోని అడవుల్లో ఈ చెట్లున్నాయి. ఉత్తర ఫిన్లాండ్‌లోని కిట్టిలా గోల్డ్‌మైన్ సమీపంలో ఉన్న 23 స్ప్రూస్ చెట్లపై జియాలజికల్ సర్వే ఆఫ్ ఫిన్లాండ్, ఔలు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. 138 రకాల ఆకుల శాంపిళ్లు సేకరించి మైక్రోస్కోప్ ద్వారా పరిశీలించారు. నేల లోపల ఉండే బంగారం.. వేర్లు పీల్చుకునే నీటి ద్వారా చెట్ల ఆకుల్లోకి వస్తోందని.. అక్కడ ఘనరూపంలో అత్యంత సూక్ష్మకణాలుగా మారుతోందని శాస్త్రవేత్తలు తేల్చారు. ఈ ఆకుల్లోని బ్యాక్టీరియా బయోఫిల్మ్ మధ్య నానో సైజ్ గోల్డ్ పార్టికల్స్ ఉన్నట్లు గుర్తించారు. నేలలోంచి బంగారం చెట్ల వేర్ల ద్వారా ఆకుల్లోకి చేరే క్రమంలో ఎండోఫైట్స్ అనే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు ప్రధానపాత్ర పోషిస్తున్నట్లు కనుగొన్నారు. అన్నట్టు.. మెరిసేదంతా బంగారం కాదు అన్నట్లుగానే అన్ని స్ప్రూస్ చెట్లకు ఈ బంగారు లక్షణాలు లేవు. నీటి ప్రవాహమార్గాలు, సూక్ష్మజీవులు, నేల స్వభావం అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లోని స్ప్రూస్ చెట్లకే ఈ బంగారం కాస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కల ఆధారిత బంగారం అన్వేషణకు ఈ అధ్యయనం బాగా ఉపకరిస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పరిశోధనలు ఇంకా సాగుతున్నాయి. ఈ స్ప్రూస్ చెట్లు ప్రపంచమంతా విస్తరిస్తే విశ్వమంతా పసిడిమయమే అవుతుంది కదూ!

లోకం తీరు



వంద జిల్లాల్లో స్వేచ్ఛావాయువులు

మావోయిస్టు ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తున్నాం.. ప్రస్తుతం 11 జిల్లాలకే అది పరిమితం

» 'ఆపరేషన్ సిందూర్'తో పాటు ఇదీ గొప్ప విజయమే

» మన భద్రతా బలగాలకు సెల్యూట్

» ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జవాన్లతో కలిసి దీపావళి వేడుకలు



దీపావళిని పురస్కరించుకొని ఐఎన్ఎస్ విక్రాంత్‌లో సైనికులకు స్వీట్లు తినిపిస్తున్న ప్రధాని మోదీ

పణజీ, అక్టోబరు 21: దేశంలో నక్సల్-మావోయిస్టు ఉగ్రవాదం నిర్మూలనలో తుది అంకంలో ఉన్నామని ప్రధాని మోదీ అన్నారు. భద్రతాదళాలు 90 శాతం వరకు విజయం సాధించాయని.. వందకుపైగా జిల్లాలకు దీని నుంచి విముక్తి కల్పించాయని చెప్పారు. ఆయా జిల్లాల ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తూ దీపావళి జరుపుకొంటున్నారని అన్నారు. సదరు ఉగ్రవాదం ప్రస్తుతం 11 జిల్లాలకే పరిమితమైందని తెలిపారు. దీపావళిని పురస్కరించుకుని ఆయన గోవా తీరంలో విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జవాన్లతో కలిసి పండుగ జరుపుకొన్నారు. భద్రతాదళాల ధైర్యసాహసాలను కొనియాడారు. మావోయిస్టుల ఉగ్రవాదంపై కీలక విజయాలు సాధించాయన్నారు. '2014కి ముందు దాదాపు 125 జిల్లాలు మావోయిస్టుల గుప్పిట్లో ఉండేవి. గత దశాబ్ద కాలంగా కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో 11 జిల్లాలకు తగ్గిపోయింది. వీటిలో కూడా మూడు జిల్లాల్లోనే మావోయిస్టుల ప్రాబల్యం ఉంది. వారి నుంచి విముక్తి పొందిన వందకుపైగా జిల్లాలు తొలిసారి స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నాయి. 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' కారణంగా ఈ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు ఈ జిల్లాల్లో భారత రాజ్యాంగం పేరెత్తితేనే అణచివేసేవారు. ఇప్పుడక్కడ స్వదేశీ మంత్రం ప్రతిధ్వనిస్తోంది' అని చెప్పారు. దేశంలో అంతర్గతంగా యుద్ధం చేయాలంటే ఎంతో సహనం అవసరమని, అమాయకులెవరూ చనిపోకుండా చూసుకోవలసి ఉంటుందని గుర్తుచేశారు. తమ ప్రాబల్య ప్రాంతాల్లో స్కూళ్లు, రోడ్లు, ఆస్పత్రులను నిర్మించడానికి నక్సల్స్ అనుమతించలేదని.. వాటిని పేల్చేసి డాక్టర్లను కాల్చిచంపారని తెలిపారు. ఇప్పుడవే ప్రాంతాల్లో హైవేలు నిర్మిస్తున్నామని.. స్కూళ్లు, ఆస్పత్రులు పిల్లలకు నూతన భవిష్యత్‌ను ఇస్తున్నాయని చెప్పారు. భద్రతాదళాల త్యాగాలు, ధైర్యసాహసాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ పోరులో అవయవాలు కోల్పోయి వీల్‌చైర్లకే పరిమితమైనా పోలీసు జవాన్లు పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినం సందర్భంగానూ.. ప్రాణత్యాగాలు చేసిన పోలీసులకు మోదీ నివాళులు అర్పించారు.

'ఆత్మనిర్భర భారత్'కు విక్రాంత్ నిదర్శనం

స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్.. 'ఆత్మనిర్భర భారత్'కు తిరుగులేని నిదర్శనమని ప్రధాని తెలిపారు. దీనిని కదులుతున్న నగరంగా అభివర్ణించారు. 'త్రివిధ దళాల మధ్య అద్భుత సమన్వయం.. మన నౌకాదళం చొప్పించిన భయం.. వైమానిక దళ అసాధారణ నైపుణ్యం, సైన్యం సాహసం.. కలగలిపి 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి తీసుకొచ్చాయన్నారు. కొన్నేళ్లుగా భారత దళాలు స్వావలంబనతో అత్యాధునికత సంతరించుకున్నాయి. బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులు తమ సామర్థ్యాలను ఆపరేషన్ సిందూర్‌లో నిరూపించుకున్నాయి. పలు దేశాలు ఇప్పుడీ క్షిపణుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నాయి. గత 11 ఏళ్లలో మన రక్షణ ఉత్పత్తులు మూడు రెట్లు పెరిగాయి. గత ఏడాది ఈ ఉత్పత్తులపై వ్యయం రూ.లక్షన్నర కోట్లకు చేరుకుంది. 2014 నుంచి వివిధ భారత షిప్‌యార్డులు నౌకాదళానికి 40 స్వదేశీ యుద్ధనౌకలు, జలాంతర్గాములను నిర్మించి ఇచ్చాయి. అంటే సగటున ప్రతి 40 రోజులకు ఓ యుద్ధనౌక, జలాంతర్గామి నిర్మించాయన్న మాట. ప్రపంచ అగ్ర రక్షణ ఉత్పత్తిదారుల్లో ఒకరిగా నిలవాలన్నది భారత లక్ష్యం' అని స్పష్టంచేశారు. ప్రధాని ఆదివారం సాయంత్రం ఐఎన్ఎస్ విక్రాంత్‌పైకి వచ్చారు. సోమవారమంతా అక్కడే ఉన్నారు. ఉదయం యోగా సెషన్‌లో పాల్గొన్నారు. యుద్ధనౌకలు, యుద్ధవిమానాల విన్యాసాలను పరిశీలించారు.

ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

» అన్యాయంపై పగ తీర్చుకున్నాం : మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరామచంద్రుడే స్ఫూర్తి అని మోదీ తెలిపారు. దేశ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన బహిరంగ లేఖ రాశారు. ఆపరేషన్ సిందూర్, నక్సలిజం, జీఎస్టీ సంస్కరణలు తదితర అంశాలను ప్రస్తావించారు. భారత్ తన ధర్మానికి కట్టుబడి ఉండే, అన్యాయంపై ప్రతీకారం తీర్చుకుందని చెప్పారు. ధర్మాన్ని నిలబెట్టాలని శ్రీరాముడు బోధించాడు. అన్యాయంపై పోరాడేందుకు ధైర్యాన్ని ఇచ్చాడు. దీనికి సజీవ ఉదాహరణను మనం కొన్నాళ్ల కిందట చూశాం. ఆపరేషన్ సిందూర్ ద్వారా ధర్మాన్ని నిలబెట్టడమే గాక అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్నాం' అని పేర్కొన్నారు. నక్సల్స్ హింసను వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చి భారత రాజ్యాంగాన్ని స్వీకరించడం అతి పెద్ద విజయమన్నారు.

రెడ్ కారిడార్లు.. వృద్ధి కారిడార్లుగా!

» పోలీసు అమరవీరులకు రాజ్‌నాథ్ నివాళి

న్యూఢిల్లీ, అక్టోబరు 21: మావోయిస్టుల ప్రాబల్యంతో 'రెడ్ కారిడార్లు'గా ముద్రపడిన ప్రాంతాలు ఇప్పుడు 'అభివృద్ధి కారిడార్లు'గా మారాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. పోలీసు బలగాల అవిశ్రాంత కృషి కారణంగా 'నక్సల్స్ హబ్స్'.. రహదారులు, పాఠశాలలు, కాలేజీలు, ఆస్పత్రులతో 'ఎడ్యుకేషన్ హబ్స్'గా మారాయని చెప్పారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారకం వద్ద నివాళులు అర్పించి ప్రసంగించారు. పోలీసులు, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ సహా అన్ని పారామిలిటరీ బలగాలు, స్థానిక యంత్రాంగాల కృషి కారణంగానే మావోయిస్టు ఉగ్రవాదాన్ని 90% నిర్మూలించగలిగామన్నారు.

పెరగనున్న ఎరువుల ధరలు

» చైనా ఎగుమతి నిలిపివేతతో ఇబ్బందులు

న్యూఢిల్లీ, అక్టోబరు 21: ఇటీవల యూరియా దొరకక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మరో షాక్ తగలనుంది. రబీ సీజన్ ప్రారంభానికి ముందే దేశంలో ఎరువుల ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. యూరియాతో పాటు కొన్ని రకాల ఎరువుల ఎగుమతులను ఈ నెల 15 నుంచే చైనా నిలిపివేసింది. ఈ నిర్ణయం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నిలిపివేత 5 నుంచి 6 నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మనం ఉపయోగించే టెక్నికల్ మోనోఅమ్మోనియం ఫాస్ఫేట్ (టీఎమ్ఏపీ), అడ్‌బ్లూతో పాటు యూరియా, డీఏపీ వంటి ఎరువులను దాదాపు 95 శాతం చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు చైనా ఆంక్షలతో వీటి ధరలు మరో 10-15 శాతం పెరిగే అవకాశం ఉంది. భారత్ ప్రతి సంవత్సరం 2.5 లక్షల టన్నుల ప్రత్యేక ఎరువులను వినియోగిస్తోంది. వీటిలో సుమారు 60-65 శాతం రబీ (అక్టోబరు నుంచి మార్చి) సీజన్‌లోనే వాడుతున్నారు. ఈ సమయంలో ధరలు పెరిగితే రైతులపై మరింత భారం పడుతుంది. అయితే వ్యాపారులు ఇప్పటికే కొంత మేర ఎరువులను నిల్వచేయడంతో రబీ అవసరాలు తీరుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

అరుదైన ఖనిజాల కోసం ట్రంప్ పర్లాట!

అరుదైన ఖనిజాల అన్వేషణ, లోహాల ప్రాసెసింగ్‌పై దృష్టి



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న అల్బనీస్, ట్రంప్

» ఆ దిశగా ఆస్ట్రేలియాతో ఒప్పందం.. పాక్ నుంచీ సమకూర్చుకునే యత్నాలు

(సెంట్రల్ డెస్క్)

జానపద కథల్లో మాంత్రికుడి ప్రాణం చిలకలో ఉన్నట్టు.. ప్రస్తుతం అమెరికా సహా కీలక దేశాల టెక్నాలజీ అవసరాలన్నీ చైనా చేతిలో చిక్కుకుపోయాయి. మొబైల్ ఫోన్ల నుంచి ఎలక్ట్రిక్ వాహనాల వరకు, శాటిలైట్ల నుంచి క్షిపణులు, ఇతర రక్షణ రంగ ఉత్పత్తుల వరకు ఎంతో కీలకమైన 'అరుదైన మూలకాల'పై చైనా ఆధిపత్యమే దీనికి కారణం. రష్యా నుంచి చమురు కొంటోందంటూ భారత్‌పై అడ్డగోలు టారిఫ్‌లు వేసిన ట్రంప్.. మనకన్నా ఎక్కువ చమురు కొంటున్న చైనా జోలికి మాత్రం వెళ్లలేకపోతున్నారు. టారిఫ్‌లు వేస్తామని ట్రంప్ బెదిరించగానే.. అరుదైన లోహాల సరఫరాపై చైనా నియంత్రణలు పెట్టింది. దీనితో చైనాపై 155శాతం టారిఫ్‌లు వేస్తానని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. త్వరలో దక్షిణ కొరియాలో జరిగే సదస్సులో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకుంటానని కూడా సంకేతాలు ఇచ్చారు. కానీ చైనా ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. దీనితో ట్రంప్ మెత్తబడ్డారు. సోమవారం శ్వేతసౌధంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జిన్‌పింగ్‌తో జరగనున్న భేటీలో అద్భుతమైన ఒప్పందం కుదుర్చుకుంటామని, ఇరు దేశాలతోపాటు ప్రపంచ దేశాలన్నింటికీ ప్రయోజనం ఉంటుందని ప్రకటించడం గమనార్హం. అయితే 'అరుదైన లోహాల'పై చైనా ఆధిపత్యాన్ని భగ్నం చేసే దిశగానే ఆస్ట్రేలియా ప్రధానితో ట్రంప్ భేటీకావడం గమనార్హం. అరుదైన లోహాల మైనింగ్ కోసం ఇటీవల పాకిస్థాన్‌తో కూడా అమెరికా సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

గాలియం, లీథియం లోహాల కోసం..

ప్రపంచవ్యాప్తంగా ఆస్ట్రేలియా సహా పలు దేశాల్లో అరుదైన ఖనిజాల నిల్వలు ఉన్నాయి. కానీ వాటిని వెలికితీయడం, శుద్ధి చేసి, లోహాలను రూపొందించే ప్రక్రియ చాలా వ్యయం, శ్రమతో కూడుకున్నది. పైగా తీవ్రమైన పర్యావరణ కాలుష్యం సమస్య కూడా. కొన్ని దేశాలు ఈ అరుదైన ఖనిజాలను వెలికితీస్తున్నా.. ప్రాసెసింగ్ కోసం చైనాకు పంపించాల్సిందే. ఈ రంగంలో చైనా ఆధిపత్యానికి గండి కొట్టడానికే ట్రంప్ ఆస్ట్రేలియాతో రూ.75 వేల కోట్ల (8.5 బిలియన్ డాలర్లు) ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనితో ఆస్ట్రేలియాలో అరుదైన ఖనిజాలను తవ్వి, ప్రాసెస్ చేసేందుకు అమెరికాకు వీలుకలుగుతుంది. ఈ ఒప్పందం మేరకు పశ్చిమ ఆస్ట్రేలియాలో వార్షికంగా 100 మెట్రిక్ టన్నుల గాలియం లోహాన్ని ఉత్పత్తి చేయగల రిఫైనరీని నెలకొల్పనున్నారు. ఇక ఇప్పటికే ఆస్ట్రేలియా చేపడుతున్న లీథియం ఉత్పత్తిని మరింత పెంచి, అమెరికాకు సరఫరా చేయనున్నారు.

అమెరికా చదువుపై అనాసక్తే!

» హెచ్-1బీ నిబంధనల సమస్య తేలినా.. భారతీయుల్లో తగ్గని ఆందోళన

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అమెరికా హెచ్-1బీ వీసా కొత్త నిబంధనలపై స్పష్టత వచ్చినా, అక్కడే చదువుకుని, ఉద్యోగంలో చేరేవారికి లక్ష డాలర్ల ఫీజు వర్తించదని తేలినా.. భారత విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మునుపటి ఉత్సాహం కనిపించడం లేదు. తాజా నిబంధనలు భారతీయులకు మేలు కలిగించేలా ఉన్నా కూడా అమెరికా చదువులపై తెలుగువారు అనాసక్తి చూపుతున్నారని హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కన్సల్టెన్సీలు పేర్కొంటున్నాయి. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం విదేశీయులకు సంబంధించి ఎన్నో వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా హెచ్-1బీ వీసా కోసం లక్ష డాలర్ల ఫీజు విధించడం భారతీయులే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయమనే భావన ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో అత్యధికులు అమెరికానే ఎంచుకునేవారు. కానీ ఇటీవలి పరిణామాల నేపథ్యంలో వారి దృక్పథంలో మార్పు వచ్చిందని హైదరాబాద్‌లోని వీజేసీ ఓవర్సీస్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రతినిధి హేమంత్ తెలిపారు. విద్యార్థి వీసాల (ఎఫ్-1)పై వెళ్లినవారు తాత్కాలిక ఉద్యోగాలేవీ చేయకుండా నిబంధనలు కఠినతరం, ఉద్యోగ వీసాలకు సంబంధించి పూటకో ప్రకటన చేయడం, ఇటీవల ఏకంగా లక్ష డాలర్ల ఫీజు విధించడం వంటివి విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన రేపాయని పేర్కొన్నారు. ఎఫ్-1 వీసా నుంచి హెచ్-1బీ వీసాకు మారేందుకు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని తాజాగా విడుదల మార్గదర్శకాలు చెబుతున్నా మునుపటి ఉత్సాహం కనిపించడమే లేదని తెలిపారు. అమెరికాలో మారిన పరిస్థితుల నేపథ్యంలో అనేకమంది ఆ దేశం వెళ్లాలనే ఆలోచనలను విరమించుకుంటున్నారని హిమాయత్‌నగర్‌లోని ఇంపీరియల్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ ప్రతినిధి నయీమ్ తెలిపారు. "బీటెక్ తర్వాత మాస్టర్స్, ఇతర పీజీ కోర్సుల కోసం 70శాతం మంది అమెరికాను ఎంచుకునేవారు. ఇప్పుడు మా వద్దకు వస్తున్నవారిలో అత్యధికులు కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, యూకేకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు" అని వెల్లడించారు.

మల్లోజుల, ఆశన్నలకు వై కేటగిరి భద్రత!?

హైదరాబాద్, అక్టోబరు 21: ఇటీవల ప్రభుత్వం ఎదుట ఆయుధాలతో లొంగిపోయిన మావోయిస్టు అగ్రనాయకులు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్నలకు వై కేటగిరి భద్రత కల్పించాలని కేంద్ర సర్కారు నిర్ణయించినట్లు సమాచారం. సాయుధ పోరాటాన్ని విరమిస్తూ మల్లోజుల, ఆశన్నలు తీసుకున్న నిర్ణయాన్ని పార్టీలోని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ అగ్రనేతలకు ప్రజాకోర్టుల్లో శిక్ష తప్పదంటూ తీవ్ర హెచ్చరికలు వస్తున్నాయి. దీంతో వారికి పూర్తిస్థాయి భద్రత కల్పించడం కోసం కేంద్ర వై కేటగిరి భద్రత ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

అమెరికా వెళ్లే విద్యార్థులకు ఉపశమనం



(మొదటి పేజీ తరువాయి)

లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదు. వారికి గతంలో ఉన్న నిబంధనలే అమలు చేస్తారు.

- అమెరికా వెలుపలి నుంచి కొత్తగా హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసినా, కాన్సులర్ ప్రాసెసింగ్ కోరినా ఫీజు చెల్లింపు నిబంధన వర్తిస్తుంది.
- ఇప్పటికే ఉన్నవారంతా దరఖాస్తు చేసుకోగానే.. ఫీజు మినహాయింపు ఉండదు. వీసా మార్పు (స్టేటస్), నివాస, ఉద్యోగ అర్హత గడువు పొడిగింపునకు సంబంధించిన దరఖాస్తుదారులు అందుకు అనర్హులని యూఎస్‌సీఐఎస్ నిర్ధారిస్తే.. వారు హెచ్-1బీ వీసా కోసం లక్ష డాలర్లు ఫీజు చెల్లించాల్సిందే.
- హెచ్-1బీ కోసం దరఖాస్తు చేసుకునే ముందే లక్ష డాలర్లను అమెరికా ట్రెజరీ పోర్టల్‌లో జమ చేసి, ఆ ఆధారాలను దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. లేదా మినహాయింపు కేటగిరీలో ఉంటే సంబంధిత ఆధారాలను జత చేయాలి. లేకపోతే దరఖాస్తు ఆటోమేటిగ్గా తిరస్కరణకు గురవుతుంది. లక్ష డాలర్లు చెల్లించినవారి దరఖాస్తు తిరస్కరణకు గురైతే.. సొమ్ము మొత్తం రీఫండ్ చేస్తారు.
- అమెరికా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, సదరు ఉద్యోగానికి తగిన అర్హత కలిగిన అమెరికన్ ఉద్యోగి అందుబాటులో లేరని కంపెనీ యాజమాన్యం నిరూపించినప్పుడు, అసాధారణ పరిస్థితుల్లో ఫీజు మినహాయించేందుకు అవకాశం ఉంటుంది.

భారతీయ విద్యార్థులకు ప్రోత్సాహం

'ఓపెన్ డోర్స్' తాజా గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరానికి గాను 3.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు అమెరికాలోని విద్యాసంస్థల్లో చేరారు. వీరిలో 97,556 మంది ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)లో నమోదయ్యారు. ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు తమ చదువుకు సంబంధించిన రంగాల్లో 12నెలల వరకూ పని చేయడానికి ఓపీటీ ప్రోగ్రామ్ అనుమతిస్తుంది. స్టెమ్ (ఎస్‌టీఈఎం) గ్రాడ్యుయేట్లు ఈ వ్యవధిని అదనంగా మరో 24 నెలలు పొడిగించుకోవడం ద్వారా మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండి పని అనుభవం పొందే అవకాశం ఉంది. అమెరికాలో ఉండే అనేక సంస్థల యజమానులు ఇటువంటి విద్యార్థులకు హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేస్తుంటారు. ఇప్పుడు వీరందరికీ ఫీజు మినహాయింపు లభించనుంది.

చిన్న ఉల్లంఘన ఉన్నా లక్ష డాలర్లు కట్టాల్సిందే

(ఎఫ్-1 వీసాలపై చదివే విద్యార్థులు ఏవైనా ఉల్లంఘనలకు పాల్పడితే వారి వీసా మార్పు తిరస్కరణకు గురవుతుంది. ఉదాహరణకు చదువుకునే సమయంలో అనధికారికంగా ఎక్కడైనా ఉద్యోగం చేసినా ప్రభావం పడుతుంది. సదరు విద్యార్థికి హెచ్-1బీ వీసా వచ్చి ఉద్యోగం చేరిన తర్వాత అయినా సరే.. ఎఫ్-1 వీసా సమయంలో నిబంధనలు ఉల్లంఘించినట్టు రుజువైతే లక్ష డాలర్లు కట్టాల్సి ఉంటుందని ఇమిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు హెచ్-1బీ వీసా కేటాయింపుల్లో వేతనాల స్థాయిని ప్రామాణికంగా తీసుకోవాలనే ప్రతిపాదననుగానీ అమల్లోకి తెస్తే ఇబ్బందులు తప్పకపోవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

శ్వేతసౌధంలో ట్రంప్ కలల సౌధం!

ఈస్ట్ వింగ్‌లో 'బాల్ రూమ్' పనులు ప్రారంభం.. వెల్లడించిన ట్రంప్

వాషింగ్టన్, అక్టోబరు 21: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన కలల ప్రాజెక్టుగా చెబుతున్న బాల్‌రూమ్ నిర్మాణానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. బాల్‌రూమ్ నిర్మాణం కోసం శ్వేతసౌధంలోని తూర్పు విభాగంలో సోమవారం కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. 'వైట్‌హౌస్ మైదానంలోని తూర్పు విభాగం (ఈస్ట్ వింగ్)లో కొత్తగా అతిపెద్ద, అందమైన బాల్‌రూమ్ నిర్మాణానికి పనులు మొదలయ్యాయని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను' అని ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. అమెరికా ప్రజలపై భారం పడకుండా దాతలు ఇచ్చే సొమ్ముతో ఈ బాల్‌రూమ్‌ను నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. 'గత 150 సంవత్సరాలకుపైగా.. ప్రతి అమెరికా అధ్యక్షుడూ వైట్‌హౌస్‌లో గ్రాండ్ పార్టీలు, అతిథుల కోసం ఒక బాల్‌రూమ్ ఉండాలని కలలు కన్నారు. ఎట్టకేలకు ఈ ప్రాజెక్టు ప్రారంభమైంది' అన్నారు. వైట్‌హౌస్‌లో బాల్‌రూమ్ (నృత్యశాల)ను నిర్మించాలనేది డొనాల్డ్ ట్రంప్ చిరకాల స్వప్నం. వైట్‌హౌస్ ఈస్ట్‌వింగ్‌లో దీని నిర్మాణం చేపడతామని ఈ ఏడాది జూలైలో ట్రంప్ ప్రకటించారు. సుమారు రూ.2,200 కోట్ల (25 కోట్ల డాలర్లు) వ్యయంతో 90వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 999 మంది కూర్చునేలా ఈ బాల్‌రూమ్‌ను నిర్మించనున్నారు.

అప్పీల్ వ్యవస్థ అపహాస్యం!

- ఆన్‌లైన్‌లో లేదు.. దరఖాస్తులు తీసుకోరు
- భూ భారతి నిబంధనలు పట్టించుకోవడం లేదంటూ రెవెన్యూ అధికారులపై విమర్శలు
- కోర్టులను ఆశ్రయిస్తున్న దరఖాస్తుదారులు

హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టంతో 'అప్పీల్' చేసుకునే వెసులుబాటు కల్పించినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. తహసీల్దార్ నిర్ణయాలపై ఆర్డీవోకు, ఆర్డీవో నిర్ణయాలపై కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునేలా చట్టంలో పొందుపరిచారు. కలెక్టర్ నిర్ణయంపైనా అభ్యంతరం ఉంటే ల్యాండ్ ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశం ఉంది. అయితే భూ భారతి పోర్టల్‌లో అప్పీల్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్ పూర్తికాలేదు. దీంతో దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం లేకుండాపోయింది. కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులు ఇవ్వాలనుకుంటే అధికారులు స్వీకరించడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నల్గొండ జిల్లాలో ఓ మహిళ అప్పీల్ కోసం వెళ్లగా 'మీ సమస్య గడువు ముగిసిపోయింది.. అప్పీల్‌కు అవకాశం లేద'ని రెవెన్యూ అధికారులు ఆమె గోడు వినకుండా పంపించేశారు. రంగారెడ్డి జిల్లాలో ఓ బాధితుడు ఆన్‌లైన్‌లో అప్పీల్‌కు అవకాశం లేకపోవడంతో వెళ్లి అధికారులను ప్రాధేయపడ్డాడు. కానీ.. భౌతికంగా దరఖాస్తు తీసుకోవడానికి వీల్లేదని, ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలని అధికారులు కరాఖండీగా చెప్పారు. దీంతో అతను కోర్టును ఆశ్రయించడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కొంతమంది అధికారులు తమకు అవసరమైన పనులను చట్టంతో పనిలేకుండా ముగిస్తుండగా.. ప్రజల విషయంలో మాత్రం నిబంధనలంటూ సాకులు చెబుతున్నారన్న ప్రచారం ఉంది. ప్రస్తుతం భూ భారతి చట్టం సెక్షన్ 5 ప్రకారం రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా తప్పులు, అభ్యంతరాలు ఉంటే అప్పీల్ చేసుకునేందుకు అవకాశం లేకుండాపోయిందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక సెక్షన్ 6 ప్రకారం సాదాబైనామా దరఖాస్తుల విషయంలో కూడా ఇదే పరిస్థితి ఎదురవుతోందని ఆందోళన చెందుతున్నారు. సెక్షన్ 7 మ్యుటేషన్ల వ్యవహారంలోనూ అభ్యంతరాలను ఆర్డీవోల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఇవ్వడం లేదని, ఫిర్యాదులు స్వీకరించడం లేదని చెబుతున్నారు. అప్పీల్ వ్యవస్థ అందుబాటులోకి రాకపోవడంతో దొడ్డిదారిలో డిలీషన్ అనే పద్ధతిని ఎంచుకుంటున్నారు. ఇదో మోసపూరిత చర్యగా రెవెన్యూ వర్గాల్లో ప్రచారం ఉంది. పేరు తప్పు పడినా, విస్తీర్ణంలో పొరపాట్లు ఉన్నా తహసీల్దార్లే డిలీషన్ మాడ్యుల్‌లో పెట్టించి.. వారికి తోచినట్లు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒక పేరు డిలీట్ చేసే సమయంలో పొరపాటున మరోపేరు డిలీట్ చేస్తే ఆ రైతులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. 'ప్రభుత్వం భూ భారతి చట్టం చేసి నిబంధనలు తెచ్చింది. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. అన్ని స్థాయిల్లో సమస్యలను చిన్నవిగా చూపుతున్నారు. భవిష్యత్తులో న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతాయి. కలెక్టర్లు, సీసీఎల్ఏ, రెవెన్యూ ఉన్నతాధికారులు ఎవరికి వారు చేతులు దులుపుకునే తరహాలో పనిచేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఏదైనా ఆర్డర్ ఇస్తే అందులో సెక్షన్లు కోట్ చేయడం లేద'ని భూచట్టాల నిపుణుడు భూమి సునీల్ పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలులో మిల్లర్‌తో కుమ్మక్కు


- విధుల నుంచి ఇద్దరు వీవోఏల తొలగింపు
- క్లస్టర్ సీసీలకు షోకాజ్ నోటీసులు.. ఏపీఎంకు మెమో జారీ

శాయంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో మండల కేంద్రమైన శాయంపేటతోపాటు కాట్రపల్లి గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయి. ఇందుకు కారకులైన ఇద్దరు వీవోఏలు బలబద్ర హైమావతి, అల్లె అనితలను పూర్తిగా విధుల నుంచి తొలగించడంతోపాటు వారి వద్ద పుస్తకాలను స్వాధీనం చేసుకోవాలని సంబంధిత అధికారులను డీఆర్‌డీవో అధికారి మేన శ్రీను మంగళవారం ఆదేశించారు. ఈ ఘటనకు బాధ్యులుగా సంబంధిత క్లస్టర్ సీసీలు విజయ్ కుమార్, హేమలతలను షోకాజ్ నోటీసులు, అప్పటి ఏపీఎం శ్రీధర్‌రెడ్డికి మెమో జారీ చేసి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. 2024-25 వేసంగి సీజన్‌లో సెంటర్ ఇన్‌చార్జీలుగా శాయంపేటలోని వసుంధర గ్రామైక్య సంఘం వీవోఏ బలబద్ర హైమావతి, కాట్రపల్లిలో జ్యోతి గ్రామైక్య సంఘం వీవోఏ అల్లె అనితలు.. ఒక మిల్లర్‌తో కలిసి రూ. కోట్లలో అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాల అధికారుల విచారణలో తేలింది. దీంతో 21 మందిపై శాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆయా సెంటర్ల ఇన్‌చార్జీలుగా ఉన్న హైమావతి, అనితలను ఇటీవల అరెస్టు చేసి, రిమాండ్‌పై జైలుకు తరలించారు.

దేవాదాయం.. దైవాధీనం!

శాఖపై కొరవడిన పర్యవేక్షణ.. పలువురు ఈవోలపై అవినీతి ఆరోపణలు

- ఓ ఈవో అక్రమ ఆదాయం రూ.కోట్లలో
- సస్పెన్షన్‌కు గత కమిషనర్ సిఫారసు
- ఆయన బదిలీ తర్వాత ఫైలు మాయం
- కీలక ఆలయానికి మూడేళ్లు బడ్జెట్ లేదు
- నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగులు
- డిగ్రీ లేకున్నా జూనియర్ అసిస్టెంట్ పోస్టు
- ఆలయాల్లోని పారిశుధ్య సిబ్బంది.. అధికారులకు డ్రైవర్లుగా చలామణీ



హైదరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ నిర్వహణ పూర్తిగా దైవాధీనంగా మారింది. మంత్రి, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో కొందరు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది. దేవాదాయ శాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే స్వీపర్ నుంచి ప్రధాన కార్యాలయంలో కీలక విభాగాల్లో విధులు నిర్వహించే అధికారుల వరకు ఎవరి పరిచయాలు, పలుకుబడి మేరకు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. హిందూ ధర్మం, భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న దేవాదాయ శాఖలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యంత కీలకమైన ఆలయాన్ని ఏకంగా మూడేళ్ల పాటు బడ్జెట్ మంజూరు లేకుండానే నిర్వహించారు. అయినా ప్రధాన కార్యాలయ అధికారులు, సొంత శాఖలోని నిఘా విభాగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. మరోవైపు ఈవోలు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నకిలీ బిల్లులు, ప్రసాదాల తయారీ, విక్రయాలు, అర్జిత సేవల్లో చేతివాటం.. సర్వసాధారణ అంశంగా మారింది. ఓ ఈవో అక్రమ ఆదాయం కోట్లల్లో ఉందనే విషయం దేవాదాయ శాఖ మంత్రి కార్యాలయంలోనే చర్చకు వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఓ ఈవో అవినీతి, అక్రమాలపై గత దేవాదాయ శాఖ కమిషనర్ విచారణ జరిపించి ఏకంగా సస్పెన్షన్‌కు ఫైల్ సిద్ధం చేశారు. ఇంతలో కమిషనర్ బదిలీ కావడంతో దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ ఫైల్ మాయం చేశారని సొంత శాఖలోని వారే చర్చించుకుంటున్నారు. ఆలయాల్లో పారిశుధ్య కార్మికులుగా ఉండాల్సిన కొందరు అక్కడ పనిచేయడం ఇష్టం లేక అధికారులను ప్రసన్నం చేసుకుని వారి వద్ద డ్రైవర్లుగా చేరిపోయారు. జీతం ఆలయం నుంచి తీసుకుంటూ పని మాత్రం నచ్చినచోట చేస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేయాలంటే డిగ్రీ విద్యార్హత తప్పనిసరి. కానీ కొందరు తమకు ఉన్న పరిచయాలతో విద్యార్హత లేకపోయినా... జూనియర్ అసిస్టెంట్లుగా కొనసాగుతున్నారు. అనర్హులకు అందలంతో అన్ని అర్హులు పోస్టింగ్, పదోన్నతుల్లో వెనుకబడిపోతున్నారు. కొందరు అధికారులు అయినవారిని అందలం ఎక్కించేందుకు అడ్‌హక్ పదోన్నతులు, పోస్టుల అప్‌గ్రేడేషన్‌ను కొనసాగిస్తూ వస్తున్నారు. సొంత శాఖలో పదోన్నతులు, పోస్టింగులకు అర్హులు ఉన్నా... ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి ఏళ్ల తరబడి కీలక పోస్టింగ్‌లో కొనసాగించడంపైనా విమర్శలు వస్తున్నాయి. దేవాదాయ శాఖలో బదిలీలు, పోస్టింగుల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం ఏ జోన్‌లో ఉన్న వారిని ఆ జోన్‌లోనే బదిలీ చేయాలి. కానీ దీనికి విరుద్ధంగా బదిలీలు చేశారు. ఈ తప్పిదాన్ని తీరిగ్గా గుర్తించిన అధికారులు సరిదిద్దుకునే చర్యలు చేపట్టారు.

బాణాసంచా సరదా.. అజాగ్రత్తతో కళ్లకు గాయాలు

- సరోజినీదేవి ఆస్పత్రికి బాధితుల క్యూ
- 16 మంది చిన్నారులు సహా 54 మందికి చికిత్స
- వారిలో నలుగురికి శస్త్రచికిత్స

హైదరాబాద్ సిటీ, కార్వాన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా కాల్చిన టపాసులు కొందరికి విషాదాన్ని మిగిల్చాయి. బాణాసంచా అజాగ్రత్తగా కాలుస్తుండగా కొందరికి, మరెవరో కాల్చిన టపాసులు తగిలి మరికొందరికి కంటి గాయాలయ్యాయి. ఇలా తగిలిన కంటి గాయాలతో హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు 54 మంది వచ్చారు. బాధితుల్లో 14 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలు 16 మంది ఉండి గమనార్హం. మొత్తం 54 మందిలో ఇద్దరు చిన్నారులు సహా నలుగురి కళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో రంగారెడ్డి జిల్లా పొద్దుటూరు ప్రాంతానికి చెందిన అంజయ్య, బాన్సువాడ ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్‌కు శస్త్రచికిత్సలు చేశారు. మూడు నెలల పాటు చికిత్స అందించిన తర్వాతే వారి కంటి చూపుపై స్పష్టత వస్తుందని వైద్యులు తెలిపారు. నలుగురిలో మిగిలిన ఇద్దరు చిన్నారులకు చికిత్స చేయాల్సి ఉంది. మిగిలిన 50 మందికి చికిత్స అందించి పంపించారు.

టపాసు కన్నుకు తగిలి రక్తస్రావం

బాన్సువాడకు చెందిన దుర్గాప్రసాద్ లైన్‌మెన్‌గా పని చేస్తుంటాడు. విధి నిర్వహణ కోసం సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎవరో కాల్చిన ఓ టపాసుకు చెందిన చిన్న రాయి అతని కుడి కంటికి తగిలింది. దీంతో కన్ను నుంచి రక్తస్రావం అవ్వగా.. దుర్గాప్రసాద్ మంగళవారం సరోజినీ ఆస్పత్రిలో చేరారు. అలాగే, బాన్సువాడకు చెందిన ఓ బాలుడు ఇంటి వద్ద టపాసులు కాలుస్తుండగా నిప్పురవ్వలు కంటిలో పడి రక్తస్రావమైంది. స్థానికంగా ప్రథమ చికిత్స అనంతరం ఆ బాలుడు సరోజినీ దేవీ ఆస్పత్రిలో చేరాడు. ఇక, హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన మహేష్ ఇంటి బయట కూర్చొని ఉండగా ఎవరో కాల్చిన టపాసు తగిలి కంటికి తీవ్ర గాయమైంది.

ఐపీఎస్ నకిలీ ప్రొఫైల్‌తో టోకరా

నిజామాబాద్ వాసి నుంచి 50 వేలు స్వాహా చేసిన 17 ఏళ్ల కుర్రాడి అరెస్టు

- నిందితుడు రాజస్థాన్‌లోని రాంసిన్ వాసి



హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని రాంసిన్ గ్రామం అంటే ఇతర రాష్ట్రాల పోలీసులకు హడల్. స్థానిక పోలీసుల అనుమతి లేకుండా ఆ ఊరికెళ్లిన ఇతర రాష్ట్రాల పోలీసులపై దాడులు చేసిన ఘటనలు అనేకం. ఈ గ్రామస్తుల్లో అత్యధికులు సైబర్ నేరాలకు పాల్పడుతుండటమే దీనికి కారణం. పక్కా ఆధారాలు చూపితే గానీ.. తమ గ్రామ వాసిని పోలీసులు తీసుకెళ్లడానికి రాంసిన్ వాసులు అనుమతించరు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పేరిట నకిలీ ప్రొఫైళ్లు తయారు చేసి ఫేస్‌బుక్‌లో ఖాతాలు తెరిచి.. అమాయకులను బురిడీ కొట్టించడం రాంసిన్ వాసుల స్పెషాలిటీ. డీఐజీ సునీల్ కుమార్ (ఐపీఎస్) పేరుతో వచ్చిన ఫ్రెండ్ రిక్వెస్టును నిజామాబాద్ జిల్లాలోని రిటైర్డు టీచర్ ఆమోదించడంతోపాటు హాయ్ అని ఫేస్‌బుక్ మెసేంజర్‌లో మెసేజ్ పెట్టారు. ఐపీఎస్ అధికారిగా చెప్పుకుంటున్న వ్యక్తితో సదరు టీచర్ కొన్నాళ్లు చాటింగ్ సాగించారు. తర్వాత కొంత కాలానికి తన వద్ద పని చేసే సంతోష్ కుమార్ అనే సీఆర్‌పీఎఫ్ అధికారికి బదిలీ అయిందని, తన ఇంట్లో విలువైన ఫర్నీచర్‌ను తక్కువ ధరకు ఇవ్వనున్నారని, కావాలంటే కాంటాక్టు చేయొచ్చునని టీచర్‌ను సంతోష్ కుమార్‌దంటూ ఒక ఫోన్ నంబరు పంపాడు. సంతోష్‌కుమార్‌తో వాట్సాప్ చాటింగ్ ప్రారంభమయ్యాక.. ఆయన యూనిఫామ్ ఫొటోలు చూసి బాధితుడు నమ్మాడని తెలిపాడు. తాను అంత ఎక్కువ మొత్తం చెల్లించలేనని రూ.80 వేలకు బేరం కుదుర్చుకుని రూ.50 వేలు అడ్వాన్సు రూపంలో పంపినా ఫర్నిచర్ రాలేదు. బాధితుడు తన ఫోన్‌కు వచ్చిన నంబర్‌కు ఫోన్ చేస్తే అది పని చేయడం లేదని సందేశం రావడంతో నిజామాబాద్ సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు.. బాధితుడి ఫేస్‌బుక్, వాట్సాప్ చాటింగ్ ఆధారంగా చేపట్టిన దర్యాప్తులో రాజస్థాన్‌లోని రాంసిన్ గ్రామానికి చెందిన 17 ఏళ్ల కుర్రాడు ఈ నేరానికి పాల్పడినట్లు నిర్ధారించారు. సదరు జువైనల్ నేరగాడ్ని అరెస్టు చేసినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయల్ మంగళవారం తెలిపారు. రాంసిన్ గ్రామంలోని సైబర్ నేరగాళ్ల ముఠాతో ఇటీవల చేతులు కలిపిన సదరు 17 ఏళ్ల యువకుడు.. వారి సూచన మేరకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నకిలీ ఫేస్‌బుక్ ప్రొఫైళ్లు తయారు చేసి.. ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతాడు. అలా, బాధితులను ముగ్గులోకి లాగాక వారి వద్దనుంచి డబ్బు కొట్టేస్తాడని తమ దర్యాప్తులో వెల్లడైందని శిఖా గోయల్ వెల్లడించారు.

మరో మోసాల నాయక్!

- అధిక వడ్డీ అంటూ కోట్లు కొట్టేసిన మధు నాయక్
- బాలాజీ నాయక్‌కు స్వయానా బంధువే
- భారీగా ఆస్తుల కొనుగోలు.. జల్సా జీవితం
- మధు నాయక్ సహా తొమ్మిది మంది అరెస్టు

నల్లగొండ క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీల ఆశచూపి కోట్లు కొల్లగొట్టిన నల్లగొండ జిల్లాకు చెందిన బాలాజీ నాయక్ కేసు విచారణలో మరో మోసాల నాయక్ బండారం బయటపడింది. బాలాజీకి సోదరుడి వరుసయ్యే రమావత్ మధునాయక్ అచ్చంగా అతడి తరహాలోనే ఎక్కువ వడ్డీలు ఇస్తామని నమ్మించి ప్రజల నుంచి వందల కోట్లు కొల్లగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. పెద్దఅడిశర్లపల్లి మండలం వద్దిపట్ల గ్రామపంచాయతీ పలుగుతండాకు చెందిన మధునాయక్ ఎరువుల దుకాణాల్లో పనిచేసేవాడు. కొన్నాళ్లకు బాలాజీ నాయక్ వద్ద ఏజెంట్‌గా చేరాడు. తర్వాత.. వడ్డీల పేరుతో ప్రజల నుంచి భారీగా డబ్బు పోగేసి.. బాలాజీ తరహాలో ఎదగాలనే ఉద్దేశంతో బావ పాల్య భరత్ కుమార్‌తోపాటు నగారా బాబు, సభావత్ రమేశ్‌తో జట్టు కట్టాడు. జనాన్ని నమ్మించేందుకు వీరంతా హైదరాబాద్‌లో గోకుల్‌నందన్ ఇన్‌ఫ్రా పేరుతో కంపెనీని ఏర్పాటు చేశారు. జహీరాబాద్ దగ్గర భారీ వెంచర్లు, హైదరాబాద్‌లో పబ్బులు, స్పా సెంటర్లు, కర్నూలు వద్ద సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయంటూ ఫేక్ డాక్యుమెంట్లను చూపిస్తూ.. జనం నుంచి అధిక వడ్డీలకు డబ్బు సేకరించారు. బాలాజీ ఇస్తున్న దానికన్నా ఎక్కువ వడ్డీ ఇస్తామని.. రూ.100కు రూ.16 నుంచి రూ.24 దాకా చెల్లిస్తామని ఆశపెట్టి డబ్బు వసూలు హామీగా చేసి ప్రామిసరీ నోట్లు రాసిచ్చాడు. ప్రజలు నమ్మి భారీ మొత్తంలో మధునాయక్ ముఠాకు అప్పులిచ్చారు. ఇలా సేకరించిన డబ్బుతో భారీగా ఆస్తులు కూడబెట్టాడు. గత జనవరిలో హైదరాబాద్‌లోని గోకులనందన ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ కంపెనీ పేరుతో రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని ప్రారంభించాడు. ఫార్చునర్ కారు కొన్నాడు. ఊర్లో విలాసవంతమైన ఇల్లుకడుతున్నాడు. బంధువుల పేరుతో ఇళ్లు, ఖరీదైన కార్లు, బైకులు కొని జల్సాలు చేస్తున్నాడు. అయితే వచ్చిన డబ్బుల్లో రూ.2.5 కోట్లు ఓ పబ్ అండ్ బార్ అండ్ స్పా సెంటర్‌లో ఖర్చు పెట్టాడు. స్టాక్‌మార్కెట్‌లో రూ.60 లక్షలు పోగొట్టుకున్నాడు. కొత్తగా అప్పులిచ్చేవాళ్లు లేకపోవడంతో.. పాత అప్పులోళ్లకు 6నెలలుగా వడ్డీలివ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో అప్పులోళ్ల నుంచి ఫోన్లువస్తే ఎత్తడం మానేశాడు. ఇటీవలే బాలాజీనాయక్ ఉదంతంపై పోలీసులు విచారణ చేపట్టడంతో మధునాయక్ బాధితులూ ఫిర్యాదుకు ముందుకొచ్చారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. మధు నాయక్, భరత్, బాబు, రమేశ్ సహా మరో ఐదుగురు ఏజెంట్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రతి 46 గంటలకు ఒక పోలీసు మృతి

- పోలీసు అమరుల సంస్మరణోత్సవంలో ఐబీ చీఫ్ తపన్ దేక వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 21: గతేడాది ప్రతి 46 గంటలకు ఒక పోలీసు మృతి చెందారని ఐబీ(ఇంటెలిజెన్స్ బ్యూరో) చీఫ్ తపన్ దేక చెప్పారు. మంగళవారం ఢిల్లీలో పోలీసు అమరులకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతేడాది దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 36,684 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. '1959లో ఇదే రోజు(అక్టోబరు 21)న ఐబీ డీసీఐవో కరం సింగ్ నేతృత్వంలో 10 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది భారత్-చైనా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తూ చైనా దాడిలో ప్రాణాలు కోల్పోయారు. అప్పటి నుంచి ఈరోజును మనం పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవంగా నిర్వహిస్తున్నాం' అని వివరించారు.

ట్రిపుల్ ఆర్‌లో భూమి పోతుందన్న ఆవేదన.. గుండెపోటుతో వృద్ధురాలి మృతి



అంజమ్మ(ఫైల్)

నవాబుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌లో సాగు భూమి పోతుందని బెంగ పెట్టుకున్న వృద్ధురాలు అంజమ్మ గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందింది. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం చించల్‌పేట గ్రామ వాసి అంజయ్యకు 132వ సర్వే నంబరులో గల రెండెకరాల సాగుభూమిని అధికారులు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌లో మార్కు చేశారు. నాటి నుంచి తమ భూమి పోతోందని నెల రోజులుగా అంజయ్య భార్య అంజమ్మ ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉంది. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌తో మానసిన ఆవేదనతో కుమిలి పోతున్న రైతులు.. అంజమ్మ దుర్మరణంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

ఏసీబీ అధికారులమంటూ మోసం

- వరంగల్ ఆర్టీఏ అధికారులకు ఫోన్ చేసి బెదిరింపులు
- రూ.10.20 లక్షలు స్వాహా చేసిన కేటుగాళ్లు

వరంగల్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏసీబీ అధికారులమని చెప్పి కొందరు వ్యక్తులు వరంగల్ ఆర్టీఏ అధికారులకు ఫోన్ చేసి రూ.10.20 లక్షలు స్వాహా చేశారు. అయితే ఈ ఫోన్ కాల్‌పై ఓ ఎంవీఐకి అనుమానం వచ్చి వరంగల్ ఏసీబీ అధికారులను సంప్రదించి, తాము నకిలీ ఏసీబీ అధికారుల చేతుల్లో మోసపోయామని గ్రహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల ఆర్టీఏ చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించి ఆర్టీఏ అధికారుల అవినీతిని గుర్తించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట వరంగల్ ఆర్టీఏ అధికారులకు గుర్తుతెలియని వ్యక్తులు 9886826656, 9880472272, 9591938585 నెంబర్ల నుంచి ఫోన్ చేశారు. ఆ ఆర్టీఏ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అంతా తెలుసని, అరెస్టు కాకుండా ఉండాలంటే డబ్బులు పంపించాలని ఎంవీఐలను బెదిరించగా దశల వారీగా రూ.10.20 లక్షలను గుర్తుతెలియని వ్యక్తుల ఖాతాల్లోకి జమ చేశారు. అయితే ఎంవీఐల్లో ఒకరికి ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తిపై అనుమానం వచ్చి వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను ఆశ్రయించి జరిగిన విషయాన్ని తెలియజేశారు. అలాంటి ఫోన్లు తాము చేయమని, గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో మిమ్మల్ని మోసం చేశారని ఆయన చెప్పారు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు. కాగా తాము మోసపోయిన విషయాన్ని గుట్టుగా ఉంచేందుకు ఆర్టీఏ అధికారులు యత్నించారు. ఈ విషయంలో స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, త్వరలోనే పూర్తి విషయాలు చెప్తామని దాటేశారు. అయితే మిల్స్‌కాలనీ పోలీసులు మాత్రం ఈ అంశంపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని అంటున్నారు. ఈ విషయంపై ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను వివరణ కోరగా.. ఇద్దరు ఎంవీఐలకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే డబ్బులు పంపించారని చెప్పారు. ఏసీబీ అధికారులు ప్రభుత్వ అధికారులకు ఫోన్ చేసి డబ్బులు అడగరని ఎన్నిసార్లు చెప్పినా ఇదేవిధంగా మోసపోతున్నారని, ఇలాంటి ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు వెంటనే స్థానిక పోలీసులతో పాటు ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అధికారంలోకి వస్తామన్న నమ్మకం లేకనే రాష్ట్రీయ జనతాదళ్ అధినేత తేజస్వీ యాదవ్ అంత భారీస్థాయి ప్రభుత్వ ఉద్యోగాలకు హామీ ఇచ్చారని బీజేపీ నాయకులు అంటున్నారు. యువత ఆశలూ, ఆందోళనలు ఎన్నికల ఫలితాలను కచ్చితంగా ప్రభావితం చేస్తాయి కనుక, ఉద్యోగం, ఉపాధి గురించి ఎన్నికల వేళల్లో నాయకులు బోలెడన్ని హామీలు గుప్పించడం సహజమే. అయితే, తేజస్వి ప్రకటన సాధారణమైనది కాదు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20రోజుల్లోనే, రాష్ట్రంలోని ప్రతీ ఇంటికీ ఒక ప్రభుత్వోద్యోగం ఇస్తానని ప్రకటించాడు. ఒక్క గవర్నమెంట్ ఉద్యోగి కూడా లేని కుటుంబాలకు మాత్రమే ఈ హామీ వర్తిస్తుందని ఆయన పేరుకు ఓ మెలికపెట్టినప్పటికీ, మరో ఇరవైనెలల్లో రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగి లేని కుటుంబం ఒక్కటంటే ఒక్కటి కూడా ఉండబోదని ఆయన ప్రకటించాడు. బిహార్‌లో 2022–23 సర్వే ప్రకారం 2.76 కోట్ల కుటుంబాలు ఉన్నాయి. కేంద్రప్రభుత్వ ఉద్యోగస్తులతో కలిపి, మొత్తంగా రాష్ట్రంలో 20.5 లక్షలమంది ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. వీరంతా వేర్వేరు కుటుంబాలవారని లెక్కవేసుకున్నా, రేపు తేజస్వి అధికారంలోకి రాగానే ఇంకా 2.55కోట్ల కుటుంబాలకు, అంటే ఇప్పుడున్న దానికి పదమూడురెట్లు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంటుంది. బిహార్ ప్రభుత్వం ఇప్పటికే తన ఉద్యోగుల వేతనాలకు ఏటా యాభైఒక్కవేల కోట్లు ఖర్చుచేస్తున్నది కనుక, తేజస్వి ప్రతీ కుటుంబానికీ ఓ సర్కారీ కొలువు ఇచ్చి, జీతాలకు ఇకపై ఏటా ఆరున్నరలక్షలకోట్ల పైచిలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంతా చేసి, బిహార్ బడ్జెట్ 3.16లక్షల కోట్లే. గత రెండేళ్ళలో రెండులక్షల ఉద్యోగాలు మాత్రమే ఇవ్వగలిగిన రాష్ట్రంలో తేజస్వి హామీ ఎంతమాత్రం ఆచరణ సాధ్యం కాదని నిరూపించడానికి ప్రయత్నిస్తున్నవారు ఇంకా ఏవేవో లెక్కలు విప్పుతున్నారు కానీ, బిహార్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇటువంటి వాగ్దానాలు, విన్యాసాలు ఇంకా ఎన్నెన్నో చూడవలసి ఉంటుంది.

బిహార్ చిత్రాలు...

రెండు విడతల్లో ఎన్నికలు జరగబోతున్న బిహార్‌లో మలిదశ నామినేషన్లు, పరిశీలనలు, తిరస్కారాలు మంగళవారం పూర్తయ్యాయి. దరఖాస్తుల ఉపసంహరణకు 48 గంటల గడువుమాత్రమే ఉన్నందున, తేలని తగవులు, పంచాయితీలతో అన్ని పార్టీలూ సతమతమవుతున్నాయి. కుటుంబపాలన, రాచరికపాలన అంటూ ప్రధాని నరేంద్రమోదీ సహా బీజేపీ పెద్దలంతా విపక్షాలను ఎగతాళి చేస్తుంటారు. విపక్షనేతలంతా ప్రజాస్వామ్య విలువల గురించి తెగ బాధపడిపోతూంటారు. కానీ, బిహార్‌లో వారూ వీరూ అని తేడాలేకుండా అన్ని పార్టీలూ పెద్దసంఖ్యలో కుటుంబీకులకే టిక్కెట్లు పంచాయి. ఈ విషయంలో కేంద్రమంత్రి, హిందుస్థానీ ఆవామీ మోర్చా అధినేత జితన్‌రామ్ మాంఝీ అగ్రస్థానంలో ఉన్నారట. సామాన్యుడిని అందలం ఎక్కిస్తానని, సాధారణ కార్యకర్తను మంత్రిని చేస్తానని ప్రతిజ్ఞలు చేసి, బిహార్ ఎన్నికల బరిలోకి దిగిన ప్రశాంత్ కిషోర్ సైతం రాజకీయకుటుంబాలనే నమ్ముకొని, వారసులకే టిక్కెట్లు పంచవలసి వచ్చిందట. పుత్రరత్నాలు, సతీమణులు, సన్నిహిత బంధువులతో బిహార్ ఎన్నికల క్షేత్రం కళకళలాడుతోంది.

బిహార్ ఎన్నికల్లో 'మహాగఢ్బంధన్'లో భాగంగా తనకు సీట్లు కేటాయించకుండా, ఆర్జేడీ, కాంగ్రెస్ కుట్రపన్నాయనీ, ప్రతీకారంగా ఆరు స్థానాల్లో తాను ఒంటరిగా పోటీచేస్తానని ప్రకటించిన జార్ఖండ్ ముక్తి మోర్చా చివరకు బరిలో నుంచే తప్పుకుంది. ఇది కూడా, ఫ్రెండ్లీవార్‌లో భాగమేనన్న విశ్లేషణలను అటుంచితే, విపక్ష ఇండియా కూటమిలో లుకలుకలు, సీట్ల పంపకాల్లో విభేదాలు క్షేత్రస్థాయిలో ఏ విధమైన ప్రభావం చూపుతాయో తెలియదు. కూటమి ఐక్యతను పక్కనబెట్టి, ఆర్జేడీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు స్నేహపూర్వక పోటీలకు సిద్ధపడుతున్నాయి. అభ్యర్థుల జాబితాలను విడుదల చేయకుండా నేరుగా వారితో నామినేషన్లు వేయించడం వంటి విన్యాసాలకు ఆర్జేడీ పాల్పడింది. 'ఇండియా' కూటమిలో వైరాలు ఎన్డీయేకు ఉపకరించవచ్చునన్న విశ్లేషణలతో పాటు, ప్రశాంత్ కిషోర్ జన్‌సురాజ్ పార్టీ అధిక స్థానాలు నెగ్గకపోయినా, ఎన్డీయేకు అధికంగా నష్టంచేయవచ్చునన్న వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ఉద్యోగ ఉపాధులు, మౌలిక సదుపాయాలు ఎన్నికల్లో ముఖ్యమే అయినప్పటికీ, కులం అంతకంటే ప్రధానంగా పనిచేయడం బిహార్ ప్రత్యేకత. కేవలం ఐదునెలల్లో సంక్షేమం పేరిట ముప్పైవేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి, మరిన్ని వేలకోట్ల రూపాయల పథకాలు, ప్రారంభోత్సవాలు జరిపిన ఎన్డీయే ఈ మారు ఏ మేరకు లబ్ధిపొందుతుందో చూడాలి.

వ్యూహాత్మక స్వతంత్రతే భారత్ బాట



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు పిచ్చెక్కినట్లుంది..' అని ప్రపంచ వ్యాప్తంగా సంఖ్యానేకులు అభిప్రాయపడుతున్నారు. 30 ట్రిలియన్ డాలర్ల వార్షిక జీడీపీ ఉన్న అతిపెద్ద ఆర్థిక శక్తి అమెరికా. అంతేకాదు, అది అతిపెద్ద మిలటరీ సూపర్ పవర్ కూడా. పెంటగాన్ (అమెరికా రక్షణ మంత్రిత్వశాఖ నెలవు) ఆయుధాగారంలో వేలాది అణ్వస్త్రాలు ఉన్నాయి; అమెరికా యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు, నిత్యం ప్రపంచ మహాసముద్రాలలో నలుమూలలా సంచరిస్తుంటాయి; 70 దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలున్నాయి. గత ఏడాది అమెరికా తన సైనిక శక్తిపై వేయి బిలియన్ డాలర్లు ఖర్చుపెట్టింది. ప్రపంచ పటం నుంచి ఏ దేశాన్ని అయినా తుడిచిపెట్టగలిగిన శక్తి అమెరికాకు ఉన్నది. ఇంత మహాశక్తికి సర్వాధినేత అయిన అధ్యక్షుడు ట్రంప్ ఎంత బాధ్యతగా ఉండాలి?

రెండోసారి అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ ట్రంప్ స్థిమితం లేనట్లు మాట్లాడుతున్నారు. ఎవరు మిత్రులో, ఎవరు శత్రువో తేల్చుకోలేకపోతున్నారు. భారత్‌పై కక్షసాధింపుగా అన్నట్లు హెచ్–1బి వీసా, టారిఫ్‌ల విషయమై రకరకాల ప్రకటనలు గుప్పిస్తున్నారు. భారత్–పాక్ సంఘర్షణలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడ సంఘర్షణ తలెత్తినా అమెరికా తలదూరుస్తోంది. ప్రతి దేశానికీ సార్వభౌమాధికారం ఉంటుందన్న మాట మరిచి ఆయా దేశాల పక్షాన ట్రంప్ తానే ప్రకటనలు చేస్తున్నారు! ఆపరేషన్ సింధూర్ గురించి రకరకాల ప్రకటనలు చేసిన ట్రంప్ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని భారత్‌ను హెచ్చరించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు మానేస్తానని మోదీ తనకు హామీ ఇచ్చినట్లు కూడా ట్రంప్ తాజాగా ప్రకటించారు. అలాంటి హామీ ఏదీ తామివ్వలేదని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. అయినా భారత్‌పై టారిఫ్‌లు భారీ ఎత్తున పెంచక తప్పదని ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మొదట్లో ట్రంప్ మాటలకు విశ్వసనీయత ఉన్నదని భావించిన వారు సైతం ఇప్పుడు ఆయన అబద్ధాలు చెబుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ట్రంప్ ప్రకటనలను భారత్ ఏమీ లెక్కచేయనక్కర్లేదని భావిస్తున్నారు. చివరకు అమెరికా ప్రజలు కూడా ట్రంప్ వాచాలతకు విసుగు చెందుతున్నట్లు స్పష్టమవుతోంది. అమెరికా టెక్నాలజీ సంస్థలు కూడా ట్రంప్ హెచ్చరికలతో నిమిత్తం లేకుండా భారత్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి. వైజాగ్‌లో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని గూగుల్ సంస్థ నిర్ణయించడమే అందుకొక ఉదాహరణ. భారత్‌లో తన విస్తరణను నిలిపివేసే ప్రసక్తి లేదని ఆపిల్ సంస్థ కూడా ప్రకటించింది. ఈ సంస్థ గత ఆరు నెలల్లో భారతదేశం నుంచి 10 బిలియన్ డాలర్ల విలువైన ఐ ఫోన్లను ఎగుమతి చేసింది. నేతల విశ్వసనీయత, పెట్టుబడులకు లభించే ఆదరణ, ఫలితాలను బట్టి పారిశ్రామిక సంస్థలు నిర్ణయాలు తీసుకుంటాయి కాని, ఉత్తుత్తి బెదిరింపులకు అవి లొంగే అవకాశాలు తక్కువ. మార్కెట్ చలన సూత్రాలు వేరుగా ఉంటాయని వేరే చెప్పనక్కర్లేదు. ఈ పండుగ రోజుల్లో భారతీయులు దాదాపు రూ. 6 లక్షల కోట్లకు పైగా సరుకులు, సేవలకోసం ఖర్చు పెట్టడమే భారతదేశంలో పెరుగుతున్న మార్కెట్ శక్తికి నిదర్శనం.

అయినా ట్రంప్ ప్రకటనలను తప్పనిసరైతే ఖండించడం తప్ప ఆయనపై వ్యక్తిగతంగా పరుష విమర్శలు చేయకూడదని భారత్ వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది. భారతదేశ వ్యతిరేక ప్రకటనలు ట్రంప్ ఎన్ని చేసినా ఆయన తనకు 'మంచి స్నేహితుడు' అని మోదీ అభివర్ణిస్తున్నారు. నిజానికి ట్రంప్ ప్రకటనల వల్ల భారతీయుల ఆత్మాభిమానం ఎక్కువగా దెబ్బతిన్నట్లు కనపడుతోంది. దానివల్ల మోదీకి ప్రయోజనమే కాని నష్టం వచ్చే అవకాశాలు తక్కువ. ట్రంప్‌ను నేరుగా మోదీ ఎందుకు ఢీకొనడం లేదు? 'ప్రస్తుతానికి మౌనం వహించడం మినహా మనకు వేరే గత్యంతరం లేదు. అదే సరైన దౌత్యనీతి..' అని మన విదేశాంగశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. 'యుద్ధం చేయకుండానే ప్రత్యర్థిని తగ్గేలా చేయడం ఒక అద్భుత కళ' అని చైనా సైనిక వ్యూహకర్త సు జు తన 'ద ఆర్ట్ ఆఫ్ వార్'లో సూచించారు. వ్యక్తులతో నిమిత్తం లేకుండా అమెరికా లాంటి మహాశక్తి భారతదేశం వైపు ఉండడం, దాన్ని శత్రువుగా మార్చుకోకపోవడం అనేది అవసరం అని మన నాయకులు గ్రహించినట్లున్నారు.

నిజానికి నరేంద్రమోదీ అమెరికాను భారత్‌కు సహజ మిత్రదేశంగా భావించారు. తాను తూర్పు తీరం నుంచి చూస్తే అమెరికా పశ్చిమ తీరం కనపడుతోందని, ఇరు దేశాలు ఒకే సువిశాలమైన ప్రాంతంలో భాగమని, తమ మధ్య స్నేహం ఇరు దేశాలకే కాక ప్రపంచ భవిష్యత్తుకు కూడా ఎంతో మంచిదని మోదీ 2014లోనే 'ఇండో–అమెరికా సీఈఓల ఫోరమ్'లో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంతకాలం అమెరికాను తన అభివృద్ధి అజెండాలో సహాయకారిగానే భావించింది. మోదీ అధికారంలోకి రాగానే అమెరికాను తన హిందూ వ్యూహాత్మక అజెండాలో భాగంగా భావించారు. ప్రపంచ అగ్రరాజ్యంగా ఎదిగేందుకు భారత్‌కు అమెరికా అండ దోహదం చేయగలదని ఆయన ఆలోచించారు. ట్రంప్ ఎలుగెత్తుతోన్న 'అమెరికా ఫస్ట్' సిద్ధాంతానికి తన 'భారత్ ఫస్ట్' నినాదం తోడవుతుందని మోదీ అనుకున్నారు. ట్రంప్‌ను రెండోసారి గెలిపించేందుకు పనిగట్టుకుని ప్రచారం చేశారు. అమెరికాలో ఉన్న ప్రవాస భారతీయులు పూర్తిగా ట్రంప్ వైపు మొగ్గేలా చేశారు. మోదీ ఇలా ట్రంప్‌ను పూర్తిగా విశ్వసించేందుకు ఎన్నో కారణాలున్నాయి.

ప్రధానంగా పాకిస్థాన్, చైనా విషయంలో భారత్ వైఖరితో ట్రంప్ తొలుత ఏకీభవించారు. తన ఎన్నికల ప్రచారంలో ఇస్లామిక్ తీవ్రవాదాన్ని, చైనా విస్తరణ వాదాన్ని ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. అంతకు ముందు న్యూఢిల్లీ ఎన్ని ఫిర్యాదులు చేసినా ఉగ్రవాద బృందాలకు ఇస్లామాబాద్ మద్దతు గురించి వాషింగ్టన్ పట్టించుకునేది కాదు. జియా ఉల్ హక్ పాక్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అమెరికా నుంచి లభించిన ఆర్థిక సహాయమే ఆ దేశంలో తీవ్రవాదాన్ని పెంచి పోషించింది. 1990 దశకం ప్రథమార్ధంలో ముంబైను అతలాకుతలం చేసిన దాడుల్లో లభ్యమైన బాంబులు పాక్‌లో తయారైనవని ఆధారాలు సమర్పించినా అమెరికా విస్మరించిందని అప్పటి హోంసెక్రటరీ పద్మనాభయ్య చెప్పారు. పాక్ అణుశాస్త్రవేత్తలు యురేనియంను స్మగుల్ చేసి అణుబాంబు తయారీ చేశారని తెలిసినా అమెరికా పట్టించుకోలేదని మాజీ విదేశాంగమంత్రి జస్వంత్‌సింగ్ తన 'A call to Honour'లో రాశారు. ఇస్లామిక్ తీవ్రవాదంపై పోరు విషయంలో భారత్, అమెరికా, ఇజ్రాయెల్ సహజ మిత్రులని జస్వంత్‌సింగ్ నాటి అమెరికా విదేశాంగశాఖ సహాయ మంత్రి స్ట్రోబ్ టాల్బోట్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని టాల్బోట్ తన పుస్తకం 'ఎంగేజింగ్ ఇండియా'లో వివరించారు. భారత్ అమెరికా స్నేహసంబంధాలు వాజపేయి హయాంలో గణనీయంగా మెరుగయ్యాయి. భారత్ అణు వాణిజ్యానికి చైనా అడ్డుపడకుండా చేసిన అమెరికా కార్గిల్ ఘర్షణను భారత్‌తో సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి చేసింది. అయితే 2001 సెప్టెంబర్ 11న న్యూయార్క్‌లో ఉగ్రవాద దాడుల తర్వాత అమెరికా వైఖరి క్రమంగా మారిపోయింది.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా విదేశాంగ విధానమే భారతదేశ విదేశాంగ విధానమా అన్నట్లు మోదీ వ్యవహరించారు. ఇరుగు పొరుగు దేశాల ప్రభుత్వాధినేతలను తొలుత తన ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించి స్నేహహస్తం చాచిన మోదీ ఆ తర్వాత ట్రంప్‌తో స్నేహం చేస్తే తనకు తిరుగుండదని భావించారు. మోదీ ప్రధాని అయిన కొత్తలో భారతదేశంలో పర్యటించిన బరాక్ ఒబామా మన దేశానికే మన రాజ్యాంగం గురించి గుర్తు చేశారు. అమెరికా రాజ్యాంగాన్నే పెద్దగా పట్టించుకోని ట్రంప్ మోదీ ప్రభుత్వ జాతీయవాద అజెండాను బలపరిచారు. భారత్ కూడా అనేక అంతర్జాతీయ వేదికలపై అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా, చైనాకు వ్యతిరేకంగా వ్యవహరించింది.

మొదటిసారి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు భారత్‌కు అనుకూలంగా ఉన్న ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఎందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనేది ట్రిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ మధ్య కాలంలో డెమొక్రాటిక్ పార్టీకి చెందిన జో బైడెన్ అధికారంలో ఉన్నప్పుడు ట్రంప్‌ను మోదీ విస్మరించారని, ఈ విషయంలో మన విదేశాంగ శాఖ ఆయనకు సరైన సలహాలనివ్వలేకపోయిందని తలపండిన దౌత్య దురంధరులు అభిప్రాయపడుతున్నారు. విచిత్రమేమంటే ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా విదేశాంగ విధానం పూర్తిగా అస్తవ్యస్తమైనట్లు కనపడుతోంది. పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదని తెలిసినా భారత్ వైఖరికి భిన్నంగా ఆ దేశాన్ని ప్రోత్సహించడం ఆశ్చర్యకరం. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్‌కు అమెరికా గానీ ఇజ్రాయిల్ గానీ మద్దతునివ్వలేదు. పైగా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదని ప్రపంచ దేశాలకు వివరించాల్సిన పరిస్థితి మనకు ఏర్పడింది. అంటే పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్లే అన్నట్లుగా మారింది. విడ్డూరమేమిటంటే అమెరికా ఒకవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దని భారత్‌ను హెచ్చరిస్తూనే మరోవైపు పుతిన్‌తో స్నేహం చేయమని ఉక్రెయిన్ అధ్యక్షుడిని బలవంతం చేస్తోంది. నిన్నమొన్నటి వరకూ చైనా విస్తరణ వాదాన్ని అడ్డుకున్న అమెరికా ఇప్పుడు జీ2 పేరిట చైనాకు స్నేహహస్తం అందిస్తోంది. యూరోపియన్, ఆసియన్ మిత్రపక్షాలకు చేసిన వాగ్దానాలను విస్మరిస్తోంది. అమెరికా తన ప్రయోజనాలనే ధ్యేయంగా పెట్టుకోవాలనే 1823 నాటి జేమ్స్ మన్రో (అమెరికా ఐదవ అధ్యక్షుడు) సిద్ధాంతాన్ని అనుసరించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. అదే జరిగితే భారత్‌తో పాటు అనేక దేశాలు తమ విదేశాంగ విధానాన్ని మార్చుకోవడం అనివార్యమవుతుంది. ఏ దేశంతోను పూర్తిగా అంటకాగకుండా వ్యూహాత్మక స్వతంత్రతను అవలంబించడమే భారత్‌కు ఎప్పటికైనా శ్రేయస్కరం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



"మొదటిసారి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు భారత్‌కు అనుకూలంగా ఉన్న ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తర్వాత ఎందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు? జో బైడెన్ అధికారంలో ఉన్నప్పుడు ట్రంప్‌ను మోదీ విస్మరించారని, ఈ విషయంలో మన విదేశాంగ శాఖ ఆయనకు సరైన సలహాలనివ్వలేకపోయిందని దౌత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అమెరికా ప్రయోజనాలనే ధ్యేయంగా పెట్టుకోవాలని ట్రంప్ నిర్ణయించుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. అదే జరిగితే భారత్‌తో పాటు అనేక దేశాలు తమ విదేశాంగ విధానాన్ని మార్చుకోవడం అనివార్యమవుతుంది.

ఆదివాసీ విప్లవ పోరాట జ్వాల

అడవితల్లి ముద్దుబిడ్డలైన ఆదివాసీలు బుక్కెడు బువ్వ కోసం, భూమి కోసం ఆరాటపడుతుంటే చలించిపోయి... వారి హక్కుల కోసం, జల్–జంగిల్–జమీన్ కోసం తెల్లదొరలపైనా, నల్లదొరలపైనా, నైజాం సర్కార్‌పైనా సమరశంఖం పూరించిన గోండ్ పోరాట యోధుడు కొమరం భీమ్. గిరిజనేతర అస్తిత్వం దోపిడీపైనా, గిరిజనేతర సామ్రాజ్యవాదంపైనా పోరాడి బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరజీవి అయ్యారు.

దేశంలో, రాష్ట్రంలో చరిత్ర పరిణామ క్రమంలో ఆధిపత్యం అణచివేతకూ వ్యతిరేకంగా సంప్రదాయకమైన ఆయుధాలు చేపట్టి... సాయుధ పోరాటాల ద్వారానే స్వయంపాలన వస్తుందని దృఢంగా నమ్మి, నాటి నుంచి నేటి వరకు ఆదివాసీలు చేస్తున్న పోరాటాల చరిత్ర ఘనమైనది. 1240–1749 మధ్య కాలంలో స్వేచ్ఛగా విలసిల్లిన గోండ్వానా రాజ్యాలు ఆంగ్లేయుల రాకతో విచ్ఛిన్నమయ్యాయి. ఆదివాసీల జీవన విధానం, అస్తిత్వం దెబ్బతిన్నది. 1836 నుంచి 1860 వరకు రాంజీ గోండ్ నాయకత్వంలో ఆదివాసీలు వీరోచితంగా పోరాడారు. ఆ పోరాట వారసత్వంగా ఆదిలాబాద్ అడవితల్లి ఒడి నుంచి ఆవిర్భవించిన ఆణిముత్యం, ఆదివాసీ విప్లవ పోరాట జ్వాల కొమరం భీమ్. 1900, అక్టోబరు 22న ఆదిలాబాద్ జిల్లాలో జన్మించారాయన. ఆంగ్లేయులు, నైజాం నవాబులు కొనసాగిస్తున్న దోపిడి, దుర్మార్గాలు, అరాచకాలు, అణచివేతకు వ్యతిరేకంగా ఆసిఫాబాద్ పరిసర 50 ఆదివాసీ గ్రామాలలో యువకులను కూడగట్టి గెరిల్లాసైన్యం ఏర్పాటు చేశారు. జోడేఘాట్ కేంద్రంగా నిజాం సైన్యంపై గెరిల్లా యుద్ధం చేశారు. 1940 సెప్టెంబర్ ఒకటిన రాత్రివేళ కొండలలో నిజాం సైన్యంతో వీరోచితంగా పోరాడారు. ఆ పోరాటంలో వెన్నుపోటు రాజకీయాల ద్వారా దొంగదెబ్బ తీసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కొమరం భీమ్‌ను నిజాం సైనికులు కాల్చి చంపారు. ఆయన వీర మరణం పొంది, నేడు ఆదివాసీ అస్తిత్వ ఆత్మగౌరవ ఉద్యమాలకు ఊపిరిగా నిలుస్తున్నారు. ఆయన వర్ధంతిని ఆదిలాబాదు నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న ఆదివాసీలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తారు. స్వయంపాలన ఉద్యమాల కోసం ఆదివాసీలను మేల్కొలిపి, సామాజిక న్యాయం కోసం సమర శంఖం పూరించి, ఆదివాసీ అస్తిత్వ ఉద్యమాలకు ప్రాణం పోసిన వ్యక్తి కొమరం భీమ్.



నీళ్లు, నియామకాలు, నిధులు, స్వయంపాలన, ఆత్మగౌరవంతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఆదివాసీలకు స్వయంపాలన కల్పించాలనే కొమరం భీమ్ ఆశయాన్ని నేటి పాలకులు పట్టించుకోవడం లేదు. 5వ షెడ్యూల్ ద్వారా రాజ్యాంగ విరుద్ధంగా ఆదివాసీ భూభాగాన్ని ఆంధ్ర, తెలంగాణగా విభజించటమే కాక; జిల్లాల పునర్విభజన పేరుతో ఆదివాసీ ప్రాంతాలనూ మైదాన ప్రాంతాలలో కలిపి ఆదివాసీల అస్తిత్వాన్ని పాలకులు దెబ్బతీసారు. హరితహారం పేరుతో ఆదివాసీల భూములను బలవంతంగా లాక్కొని, వాటిలో మొక్కలు నాటి, ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారు. తెలంగాణలో సాదాబైనామా కోసం జీవో 53 తీసుకువచ్చి, ఏజెన్సీలో 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసి, ఆదివాసుల భూములను గిరిజనేతరులకు దోచిపెట్టడానికి కుట్రలు పన్నుతున్నారు.

గిరిజనేతర సామ్రాజ్యవాదం నేడు దేశంలో, దండకారణ్యంలో, రాష్ట్రంలో, జిల్లాల్లో అడుగుబెట్టి ఆదివాసీ ప్రాంతాలలో ఉన్న సహజ వనరులు, ఖనిజ సంపదనూ దొడ్డిదారిలో దోచుకుంటున్నారు. దండకారణ్యంలో ఆదివాసీలపై నరమేధం కొనసాగుతోంది. ఆదివాసీ మహిళలపై అంతులేని అత్యాచారాలు కొనసాగుతున్నాయి. ఆదివాసీ ప్రజాప్రతినిధులు గిరిజనేతర రాజకీయ పార్టీలలో కీలు బొమ్మలుగా మారారు. ఏజెన్సీలో ఆదివాసీలను దోపిడీ చేస్తూ వారిపై పెత్తనం చెలాయిస్తున్న గిరిజనేతరులు... నేడు ఆదివాసీల రిజర్వేషన్స్ కబ్జా చేయాలని కుట్రలు పన్నుతున్నారు. మరోవైపు చెల్లప్ప కమిషన్ ద్వారా మరో మూడు కులాలను ఎస్టీ జాబితాలో కలిపి, ఆదివాసులను నిర్వీర్యం చేస్తున్నారు. దేశంలో ఏజెన్సీ ఏరియాలో ఉన్న గిరిజనేతరులు ఆదివాసీల రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తూ వారిపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. దీనికి రాజకీయ పార్టీలు కూడా మద్దతు తెలుపుతున్నాయి. ఆదివాసీల జీవన విధానం విధ్వంసమవుతున్నా ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాలు, మేధావులు నోరు మెదపటం లేదు.

ఏజెన్సీలో గిరిజనేతరుల ఓటు హక్కు రద్దు చేయాలి, వారి వలసలు అరికట్టాలి. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలనూ తొలగించాలి. ఐటీడీఏలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలి. ఇందులో అటెండరు నుంచి ఐఏఎస్ వరకు ఆదివాసీలనే నియమించాలి. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పీసా చట్టాన్ని, జీవో నెం.3ని పకడ్బందీగా అమలు చేయాలి. ఏజెన్సీలో పోలీస్ శాఖనూ ఐటీడీఏ నియంత్రణలోకి తీసుకురావాలి. ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి. ఏజెన్సీలో ఆదివాసీలు సాగుచేస్తున్న పోడుభూములకు పట్టాలు ఇవ్వాలి. అలాగే గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. పై డిమాండ్స్ సాధన కోసం కొమరం భీమ్ స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆయన కలలు కన్న ఆదివాసీల స్వయంపాలన సాధ్యమవుతుంది.

● వూకె రామకృష్ణ దొర

(నేడు కొమరం భీమ్ 125 జయంతి, ఖమ్మంలో విగ్రహావిష్కరణ)

పేదల పక్షపాతి

ప్రజలను పురుగుల్లా చూసే నాయకులు, అధికారులు ఉన్న ఈ రోజుల్లో ఎస్.ఆర్. శంకరన్ జీవితాన్ని గుర్తు చేసుకోవడం ఎంతయినా అవసరం. నిరుపేదల ఐఏఎస్‌గా పేరు తెచ్చుకొన్న ఆయన సేవలు అనితరసాధ్యమైనవి. బ్యూరోక్రాటిక్ అసాధ్యాలను సుసాధ్యం చేసిన ఆయన ప్రతిభ అద్వితీయమైనది. పేదల అభ్యున్నతి కొరకు 120 జీవోలను ఆయన రూపొందించి విడుదల చేశారు. తన కీలక నిర్ణయాలతో వ్యవస్థలో విశేషమైన మార్పులు తెచ్చారు. ప్రభుత్వ అధికార వ్యవస్థను ప్రజలకు చేరువ చేసిన ఆయన నిబద్ధత, కృషి అద్వితీయమైనవి. అందుకే ఆయన ఐఏఎస్ గాంధీగా ఖ్యాతికెక్కారు. కాలి నడకన సంచరిస్తూ, తన ఆత్మగౌరవాన్ని కాపాడుకొన్నారు. పద్మభూషణ్ పురస్కారాన్ని సున్నితంగా తిరస్కరించారు. వెట్టిచాకిరీ విధానం, సఫాయి కార్మిక వ్యవస్థల నిర్మూలనకు శంకరన్ విశేషంగా కృషి చేశారు.



తన జీవితం మొత్తం దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల సముద్ధరణకు పాటుపడ్డారు. వ్యక్తిగత జీవితం అంటూ లేకుండా పూర్తిగా సమాజానికే అంకితం అయ్యారు. విశ్రాంత జీవితంలో కూడా పేదలకు అండగా నిలబడ్డారు.

షార్ అంతరిక్ష కేంద్రాన్ని తమిళనాడులో నెలకొల్పడం కోసం తమిళ నాయకులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఒక తమిళుడైనా కూడా శంకరన్ ఆ కేంద్రాన్ని అప్పటి నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటకు తీసుకురావడానికి విశేషంగా కృషి చేశారు. నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నప్పుడే, ప్రభుత్వ మహిళా కళాశాలకు స్వంత భవనాలు లేనందువల్ల కలెక్టర్ బంగ్లా అంత పెద్దది తనకెందుకని దానిలో అధిక భాగాన్ని కళాశాలకు కేటాయించారు. అలాగే శంకరన్ తన జీతంలో అధిక భాగం పేద ప్రజలకు పంచిపెట్టేవారు. వారు తనకెక్కడ కృతజ్ఞతాభావం చూపెడతారోనని, అవి ప్రభుత్వ డబ్బులని వారికి చెప్పేవారు. 'మీలాంటి వారికివ్వమని ప్రభుత్వం నా వద్ద కొంత డబ్బు ఉంచిందని వారితో నమ్మబలికేవారు, అదీ ఆయన వ్యక్తిత్వం. త్రిపుర ప్రధాన కార్యదర్శిగా నియమితులైనప్పుడు ఒక చిన్న సూట్‌కేస్‌తో అగర్తలా వెళ్ళి, రిక్షా ఎక్కి తన అధికార నివాసానికి చేరుకొన్నారు. ఘన్‌శ్యామ్ షా వెలువరించిన సంకలనంలో 'అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ది పూర్' అనే అధ్యాయాన్ని శంకరన్ రచించారు. 2010 అక్టోబర్ 7న ఆయన మరణించారు. 2011లో హైదరాబాద్‌లో ప్రభుత్వ సంక్షేమశాఖ కార్యాలయం ముందు ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. శంకరన్ విగ్రహాన్ని ఈ నెల 7వ తేదీన బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో కూడా ఆవిష్కరించారు. ఆశ్రిత పక్షపాతానికి ఇసుమంతైనా ఆస్కారం ఇవ్వకుండా అందర్నీ ఒకే విధంగా చూసిన సమదర్శి శంకరన్. ఆయన మానవీయ విలువలను ఆదర్శంగా తీసుకోవాలి. శంకరన్‌లోని సేవాతత్పరత, వినయశీలం, చిత్తశుద్ధి అలవర్చుకునే యత్నాలు ప్రారంభం కావాలి.

– పి.సి. సాయిబాబు

(నేడు శంకరన్ జయంతి)

వెన్నెల సునాదమే బాలసరస్వతి గానం

బాలమురళీకృష్ణ అసలు పేరు అది కాదు. మురళీకృష్ణ మాత్రమే! అలాగే బాలసరస్వతి అసలు పేరు కూడా అది కాదు. సరస్వతి మాత్రమే! ఎనిమిదేళ్ల వయసులో మురళీకృష్ణ సంగీత కచేరి చేసినప్పుడు శ్రోతలు పొంగెత్తిన మురళీగాన రసవాహినిలో లీనమైపోయారట. అదే సభలో ఉన్న ప్రసిద్ధ హరికథా విద్వాంసులు ముసునూరి సత్యనారాయణ గారు ముగ్ధులై 'బాలమురళీ' అని ముద్దుగా పిలిచి మూర్ధం ఆఘ్రాణించి ఆశీర్వదించారు. అప్పటి నుంచి ఆయనకు ఆ పేరు స్థిరపడిపోయింది. అలాగే సరస్వతి కూడా! ఆమెకు ఆరేళ్ల వయస్సున్నప్పుడు కె.సుబ్రహ్మణ్యం (ప్రముఖ నర్తకి పద్మాసుబ్రహ్మణ్యం తండ్రి) నిర్మించిన భక్త కుచేల, భక్త యోగిని చిత్రాలలో నటించి, ఆ చిత్రాలలో దాదాపు అన్ని పాటలూ పాడారు. సుబ్రహ్మణ్యం ఆమెని 'బాలసరస్వతి' అని ప్రేమగా పిలిచేవారట. అప్పటి నుంచి అందరూ అలానే పిలవటం మొదలుపెట్టారు. అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ అదే పేరు ఆమెకు.

మాటల మధ్యలో బాలసరస్వతి చెప్పారు, "మద్రాసు, విజయవాడ రేడియో స్టేషన్లలో నాతోనే లలిత సంగీతం మొదలైంది. ఎన్ని పాటలు పాడానో! మొదట్లో సంగీత దర్శకులు చెప్పినట్టు పాడినా తర్వాత తర్వాత నేను పాడవలసిన పాటలను నేనే స్వరపరచుకుని తిన్నగా రేడియో స్టేషన్‌కు వెళ్లి పాడేదాన్ని. నాకు శాస్త్రీయ సంగీతం పట్ల ఆసక్తి లేదు, అసలు ఇష్టమే లేదు. కాకపోతే క్లాసికల్ బేస్ ఉండాలని అందరూ చెప్పబట్టి మద్రాసులో అలత్తూరు సుబ్బయ్య గారి దగ్గర మూడేళ్లపాటు శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. బొంబాయిలో సినీ సంగీత దర్శకుడు వసంతదేశాయి వద్ద హిందుస్థానీ సంగీతం నేర్చుకున్నాను. మద్రాసులో ఉన్నప్పుడే పియానో, వీణ రెండూ నేర్చుకున్నాను. నా పాట బాగుంటుందని అందరూ అంటారు. ఎంత బాగుంటుందో నాకు తెలియదుగానీ ఒక విషయం మాత్రం చెప్పగలను. ఆరుద్ర, రజనీ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వింజమూరి శివరామారావు, సి.నారాయణరెడ్డి, సన్యాసిరాజు (ఎస్. రాజేశ్వరరావు సోదరుడు) ఇలా ఒకరా, ఇద్దరా ఎందరెందరో రాసిన పాటలు పాడాను. వాళ్ల సాహిత్యంలోనే సగం సంగీతం ఉండేది. ఆ పాటల్లోని భావం చెడకుండా శ్రోతల మనసుకు హత్తుకునేలా పాడాలని తాపత్రయపడేదాన్ని. పాట పాడే వారికి కవి భావనను పట్టుకోగల శక్తీ, నేర్పూ ఉండాలి" అన్నారు. ఎంత చక్కటి మాట!

బాలసరస్వతి పాట పాడుతూంటే ఎక్కడో ఏ వంపులోనో ఒక గమకంలోనో మాధుర్యం తొణికిసలాడటం కాదు. పాట మొత్తం నెత్తావులు చిమ్ముతుంది. 'ఆహా! ఏమి పాట' అని మురిసిపోతాం. మా సంభాషణ సాగుతూ ఉండగా 'టీ' వచ్చింది. 'ఆ! అన్నట్లు మీరూ రేడియో మనిషే కదూ! మీకో సంగతి చెప్పాలి. రేడియోలోకి నా ప్రవేశం ఎలా జరిగిందో చెబుతా. ఇల్లాలు అనే సినిమాలో నేనూ ఎస్. రాజేశ్వరరావు కలిసి నటించాం. మద్రాసు జెమినీ స్టూడియోలో రికార్డింగ్. అప్పుడే రేడియో స్టేషన్ నుంచి జనమంచి రామకృష్ణ, ఆచంట జానకిరామ్, ఎస్.ఎస్.మూర్తి వచ్చారు. రాజేశ్వరరావు నన్ను వారికి పరిచయం చేశారు. వారు నా పాట విని మెచ్చుకున్నారు. ఎస్.ఎస్.మూర్తి– నన్నూ, రాజేశ్వరరావునూ, మా వాద్య బృందాన్నీ జెమినీ స్టూడియో నుంచి తిన్నగా రేడియో స్టేషన్‌కు తీసుకువెళ్లి, నా చేత కొన్ని పాటలు పాడించి, వాటిని ప్రత్యక్ష ప్రసారం చేసారు. అలా రేడియో ఆర్టిస్ట్ అయ్యాను. నేను రేడియోలో పాడిన 'ఈ ప్రేమ ఎలా కలిగెనో నాలో, నల్లనివాడ నే గొల్ల కన్నెనోయి, ఈ చల్లని రేయి తిరిగి రానేరాదు, బంగారు పాపాయి, హాయమ్మహాయి' మొదలైన పాటలన్నీ గ్రాంఫోన్ రికార్డుగా కూడా వచ్చాయి.

"మా రోజుల్లో సినిమాల్లో కానీ రేడియోలో కానీ ఇప్పటిలా కాదు. సంగీత దర్శకులు, గాయనీ గాయకులు, వాద్య కళాకారులు అందరం కలిసి కూర్చుని ఒక్కో పాట పది పదిహేను రోజులు ప్రాక్టీస్ చేసేవాళ్లం. అందుకే ఆ పాటలు నిలబడ్డాయి. ఇప్పుడు కూడా నా పాటలు రేడియోలో వింటూ ఉంటాను" అన్నారు.

చాలా ఏళ్ల క్రితం ప్రసిద్ధ స్త్రీ వాద రచయిత్రి రంగనాయకమ్మ రేడియో కోసం బాలసరస్వతి గారిని ఇంటర్వ్యూ చేసారు. 'సంగీతపు లోతులు, అంచులు చూసిన మనిషిగా మీరు ఎప్పుడో పాడిన పాటలను ఇప్పుడు వింటున్నప్పుడు... అయ్యయ్యో! ఈ పదం ఇలా పలకవలసింది, ఈ గమకం ఇలా అని ఉండవలసింది, ఇలా అని ఉంటే ఇంకా బాగుండేది' అనిపించిన సందర్భాలు ఉన్నాయా?... "చాలానే ఉన్నాయి".

'అవునూ, మీరు ఎప్పుడూ తక్కువ స్థాయిలోనే పాడతారు. ఎందుకనీ?'... "నాకు అలా పాడటమే ఇష్టం. అలవాటు కూడా! పై స్థాయిలో పాడితే స్వర లాలిత్యం పోతుందనుకునేదాన్ని. పైగా నేను ఎక్కువగా ప్రణయ గీతాలు – కృష్ణుడి మీద పాడాను. ప్రేమ సున్నితంగా నాజూకుగా ఉంటుంది. దాన్ని పొదివి పట్టుకోవాలని పిచ్చి కోరిక."

'1936లో మీరు సినీరంగ ప్రవేశం చేసారు. 1958 వరకూ మీరు నటించారు, పాడారు. తర్వాత అకస్మాత్తుగా తెర మరుగయ్యారు. కారణం ఏమిటి? ఆఫర్స్ రాకనా? ఆరోగ్యం సరిగా లేకనా?' అని రంగనాయకమ్మ అడిగితే, బాలసరస్వతి పేలవంగా నవ్వి "రెండూ కాదు. ఎంకరేజ్‌మెంట్ లేక. ఇంట్లో సందర్భాలు సరిగాలేక. ఎవరెంత గొప్ప కళాకారులైనా ఇంట్లో ప్రోత్సహించేవారుండాలి. సంగీతాన్ని ఆస్వాదిస్తూ, అనుభవిస్తూ, అభినందించేవారు ఉండాలి. అది లేకపోయింది నాకు. పైగా పాడరాదని నిర్బంధించారు. దానితో నేను మూగబోయాను" అన్నారు.

తర్వాత రంగనాయకమ్మ అడగవలసిన ప్రశ్నే అడిగారు. 'మీ వారిని ఎదిరించలేకపోయారా?'... "అప్పుడు నాకు అంత ధైర్యమూ, చొరవా, తెలివితేటలూ లేవు. బ్రతిమాలి భంగపడదలచుకోలేదు. మానేశాను" అన్నారు బాలసరస్వతి.

చివరిసారిగా ఆమె ఆకాశవాణి తునిలో, ఆహ్వానితుల సమక్షంలో ఏర్పాటు చేసిన సంగీత సభలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఆమె పాడలేదు. భర్త రాజా రావ్ ప్రద్యుమ్నకృష్ణ సూర్యారావు బహదూర్ మరణించాక ఆమె మళ్లీ మద్రాసు వెళ్లిపోయారు. 1974లో దర్శకులు రమేశ్‌నాయుడు, విజయనిర్మల పట్టుబట్టి 'సంఘం చెక్కిన శిల్పాలు' చిత్రంలో ఆమెతో ఒక పాట పాడించారు.

ఆమె పాట గురించి చెప్పాలంటే ఆమె కన్నా పై స్థాయి ఉండాలి. నాకు ఆ అర్హతలేదు. ఎప్పటికీ గుర్తుండిపోయే పాటలు పాడిన సంగీత రససరస్వతి 1928, ఆగస్టు 28న జన్మించారు. ఈ నెల 15న తొంభై ఏడేళ్ల వయసులో స్వర్గస్థులయ్యారు. వారికిదే అక్షర నీరాజనం.

■ ప్రయాగ రామకృష్ణ

'ఆరుద్ర, రజనీ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వింజమూరి శివరామారావు, సి.నారాయణరెడ్డి, సన్యాసిరాజు... ఇలా ఒకరా, ఇద్దరా ఎందరెందరో రాసిన పాటలు పాడాను. వాళ్ల సాహిత్యంలోనే సగం సంగీతం ఉండేది. ఆ పాటల్లోని భావం చెడకుండా శ్రోతల మనసుకు హత్తుకునేలా పాడాలని తాపత్రయపడేదాన్ని. పాట పాడే వారికి కవి భావనను పట్టుకోగల శక్తీ, నేర్పూ ఉండాలి'



వైభవంగా వెలుగుపూల వేడుక

- ఇంటింటా ఆనందోత్సాహాలతో దీపావళి పండుగ
- భక్తిశ్రద్ధలతో గౌరీ కేదారేశ్వర వ్రతాలు
- ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు

6


దీపాలతో ఎంపీ కావ్య


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కొండా దంపతులు

సీఎంను కలిసిన కొండా దంపతులు

- తమకు వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాలపై వివరణ
- ఏ సమస్య ఉన్నా నేరుగా తనకే చెప్పాలన్న రేవంత్
- వెంట వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి

వరంగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులు కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి కొండా దంపతులు సోమవారం సీఎం నివాసంలో ఆయన కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్‌డీ అరెస్ట్ వివాదం, ఆ తరువాత మంత్రి కుమార్తె కొండా సుష్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలపై చర్చించినట్లుగా సమాచారం. తమను కావాలని కొందరు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎన్నికల ముందు నుంచి మీతో కలిసి నడిచామని కొండా దంపతులు గుర్తు చేసినట్లుగా తెలిసింది. తెలంగాణలో మాజీ సీఎం వైఎస్‌ఆర్‌తో సమానంగా రేవంత్‌రెడ్డిని చూసుకుంటున్నామని, మిమ్ములను నమ్ముకుని ఉన్నా తమపై కొందరు ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు చేస్తున్న కుట్రలు ఇవీ.. అంటూ వివరించినట్లు సమాచారం. అంతేకాకుండా ఓఎస్‌డీని తొలగించినప్పటికీ ఒక్క మాట మాట్లాడలేదని, రాత్రిపూట ఇంటిపై పోలీసులు రావటంతో ఇబ్బంది పడాల్సి వచ్చిందని వివరించారు. అయితే సుష్మిత చేసిన వ్యాఖ్యలను పట్టించుకోవద్దని, ఆమెకు రాజకీయాల గురించి తెలియక చేసిన వ్యాఖ్యలుగా పరిగణించాలని కోరినట్లుగా తెలిసింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సురేఖక్క తనకు తోబుట్టువు లాంటిదని, మీకు ఏ ఇబ్బంది ఉన్నా.. సమస్య ఉన్నా నేరుగా తనతోనే చెప్పుకోవాలని సూచించినట్లుగా సమాచారం. పార్టీ బలోపేతం దృష్ట్యా ఎవరు కూడా మీడియాకు ఎక్కొద్దని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. కాంగ్రెస్‌కు విధేయులుగా ఉన్న కొండా దంపతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తాము ఉన్నామని భట్టి భరోసా ఇచ్చినట్లుగా తెలిసింది. మొత్తంగా నాలుగు రోజుల కిందట రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించిన కొండా ఎపిసోడ్‌కు సీఎంతో భేటీతో ఫుల్‌స్టాప్ పడిందనే వ్యాఖ్యలు వినిబడుతున్నాయి. హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కొండా సురేఖ ఎపిసోడ్ ముగిసిందని, ఇక ఎలాంటి వివాదం లేదని స్పష్టం చేశారు. మొత్తానికి టీకప్పులో తుపాన్‌లా వచ్చిన వివాదం సద్దుమణిగినట్లేనా అనే చర్చ జరుగుతోంది.

చిగురిస్తున్న ఆశలు


ఎట్టకేలకు దేవాదుల పథకం పూర్తికి సర్కారు కసరత్తు

దేవాదులపై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తుండటంతో చివరి ఆయకట్టు వరకు గోదావరి జలాలు అందుతాయనే ఆశ రైతాంగంలో కలుగుతోంది. ఓరుగల్లును సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దేవాదుల పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, దేవాదుల నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. అయితే మొదటి, రెండో దశ పనులు పూర్తయినప్పటికీ కీలకమైన మూడో దశ పనులకు భూ సేకరణ అడ్డంకిగా మారింది. పెండింగ్‌లో ఉన్న 2,869 ఎకరాల భూ సేకరణతో పాటు 767కి.మీ గ్రావిటీ కెనాల్ నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ప్రభుత్వం నీటిపారుదలశాఖ అధికారులపై ఒత్తిడి తెస్తోంది. అలాగే కొత్తగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా ఎస్సారెస్పీ-2 కింద దేవాదుల ద్వారా గోదావరి జలాలను అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

2003 జూన్ 16న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రూ.4,400 కోట్ల అంచనా వ్యయంతో దేవాదుల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అయితే ఈపీసీ విధానంలో పిలిచిన టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. దేవాదుల ప్రాజెక్టును రీడిజైన్ చేసింది. మూడు దశల్లో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకుని ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.4,400 కోట్ల నుంచి రూ.6,016 కోట్లకు పెంచి పనులు ప్రారంభించింది. ఆ తరువాత పనుల్లో జాప్యం జరగడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరలు సైతం భారీగా పెరగడంతో 2008లో మరోసారి అంచనా వ్యయాన్ని రూ.9,427.23కోట్లకు పెంచారు. ఆ తరువాత 2017లో అప్పటి సీఎం కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును రీ డిజైన్ చేయటంతో భారీగా ఖర్చు పెరిగింది. దీంతో రూ.13,445.44కోట్లకు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని మరోసారి పెంచారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో దేవాదులను చేర్చి, రైతాంగానికి సాగునీరు అందించేందుకు పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు ప్రయత్నాలు చేపట్టింది. అందులో భాగంగా అంచనా వ్యయాన్ని రూ.18,055 కోట్లకు పెంచింది. మొత్తంగా ఇప్పటివరకు దేవాదుల ప్రాజెక్టుపై రూ.14,269.63 కోట్ల వరకు ఖర్చు చేసింది. అయితే ప్రాజెక్టు పూర్తికావడానికి ఇంకా రూ.4,230 కోట్లు అవసరంగా ప్రభుత్వం గుర్తించింది. 2005-06 నుంచి 2025-06 ఆర్థిక సంవత్సరం వరకు అంటే.. పాతికేళ్లలో దేవాదుల అంచనా వ్యయం సుమారు రూ.12వేల కోట్లకు పైగా పెరిగింది. తొలుత 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 5,56,722 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలిదశ నుంచి మూడు రిజర్వాయర్లను, నాలుగు పంపుహౌస్‌ల ద్వారా 5.18టీఎంసీల నీటిని లిఫ్టు చేసి, 1,23,768 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. రెండో దశలో 9రిజర్వాయర్లు, ఏడు పంపుహౌస్‌ల ద్వారా 7.25టీఎంసీల నీటిని ఎత్తిపోసి 1,93,164 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఇక కీలకమైన మూడో దశ పనులు పూర్తి అయితే 10 పంపుహౌస్‌ల ద్వారా 25.75 టీఎంసీల నీటిని లిఫ్టుచేసి 2,39,790 ఎకరాలకు సాగునీరు అందనుంది. మొత్తం దేవాదుల ప్రాజెక్టు ద్వారా 170 రోజుల్లో 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 5,56,722 ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీటితోపాటు భూగర్భ జలాలతో సాగులో ఉన్నా 58,028 ఎకరాలను కలుపుకుంటే మొత్తంగా దేవాదుల ద్వారా 6.14 లక్షల ఎకరకాలకు సాగునీరు అందించటట్టు అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.


దేవాదుల వద్ద ఇన్‌టెక్‌వెల్ (ఫైల్)

ఎస్సారెస్పీ-2కు దేవాదుల నీళ్లే..

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు రెండు దశల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ-1 కింద 3,64,078 ఎకరాల్లో, ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టు ఉందని అంచనా. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఈ ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా గత ప్రభుత్వం పేర్కొంది. అయితే సమ్మక్క సాగర్ నిర్మాణంతో దేవాదుల ఎత్తిపోతల కింద కొత్త ఆయకట్టును ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీంతో ఎస్సారెస్పీ-2 కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి డీపీఆర్‌లో చూపించింది. రెండు ప్రాజెక్టుల కింద ఎస్సారెస్పీ ఆయకట్టును చూపించటంతో సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు నిలిచిపోవటంతో ప్రత్యామ్నాయంగా దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ప్రభుత్వం సీడబ్ల్యూసీ అనుమతి పొందింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పాలకుర్తి నియోజకవర్గంలో 44,942 ఎకరాలు, వర్ధన్నపేటలో 9,012 ఎకరాలు, డోర్నకల్‌లో 55,558 ఎకరాలకు ఎస్సారెస్పీ-2 ద్వారా గోదావరి జలాలు అందుతున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టుకు దేవాదుల ద్వారా గోదావరి జలాలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

భూ సేకరణే అడ్డంకి..

దేవాదుల ఎత్తిపోతలకు ప్రధాన అడ్డంకిగా భూసేకరణ ఉంది. మూడు దశల్లో దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం

(మిగతా 7లో..)

- పాతికేళ్లుగా సా..గుతున్న ప్రతిష్ఠాత్మక ఎత్తిపోతల పథకం
- ప్రాజెక్టుకు సవాల్‌గా మారిన భూ సేకరణ
- ఇంకా 2,869 ఎకరాల భూసేకరణ.. 767 కి.మీ. గ్రావిటీ కెనాల్ నిర్మాణం పెండింగ్
- 5.56 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం కాగా, 3.17 లక్షల ఎకరాలకే సాగునీరు
- ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యంతో భారీగా పెరుగుతున్న దేవాదుల వ్యయం
- రూ.6,016 కోట్లతో ప్రారంభమై.. రూ.18,055 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- ఎస్సారెస్పీ-2 కింద ఉన్న ఆయకట్టుకు కూడా ఇక దేవాదుల నీళ్లే..

ఏసీబీ అధికారులమంటూ

టోకరా

- ఆర్టీఏ అధికారులకు ఫోన్ చేసి బెదిరింపులు
- రూ.10లక్షల 20 వేలు అర్పించుకున్న ఎంవీఐలు
- ఏసీబీ డీఎస్పీని ఆశ్రయించిన బాధితులు

వరంగల్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారులమని చెప్పి కొందరు వ్యక్తులు వరంగల్ ఆర్టీఏ అధికారులకు ఫోన్ చేసి రూ.10లక్షల 20వేలు లాగేసుకున్నారు. ఫోన్ కాల్‌పై ఓ ఎంవీఐకి అనుమానం రావడంతో వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో తాము నకిలీ ఏసీబీ అధికారుల చేతుల్లో మోసపోయామని గ్రహించారు. వివరాల్లోకి వెళితే..

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఆర్‌టీఏ చెక్ పోస్టుల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించి ఆర్టీఏ అధికారుల అవినీతిని గుర్తించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట వరంగల్ ఆర్టీఏ అధికారులకు గుర్తు తెలియని వ్యక్తులు 98868 26656, 98804 72272, 95919 38585 నెంబర్‌ల నుంచి ఫోన్‌చేశారు. ఆర్టీఏ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అంతా తెలుసని, అరెస్టు కాకుండా ఉండాలంటే డబ్బులు పంపించాలని ఎంవీఐలను బెదిరించగా దశల వారీగా రూ.10లక్షల 20 వేలను గుర్తు తెలియని వ్యక్తుల అకౌంట్‌ల్లోకి జమ చేశారు. అయితే ఎంవీఐలలో ఒక అధికారికి ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తిపై అనుమానం వచ్చి వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను ఆశ్రయించి జరిగిన విషయాన్ని తెలియజేశారు. అలాంటి ఫోన్స్ తాము చేయమని, గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో మిమ్మల్ని మోసం చేశారని చెప్పడంతో పాటు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు. కాగా, తాము మోసపోయిన విషయం ఇతరులకు తెలియకుండా గుట్టుగా ఉంచేందుకు ఆర్టీఏ అధికారులు యత్నించారు. ప్రస్తుతం ఈ విషయంలో స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, త్వరలోనే పూర్తి విషయాలు చెబుతామని దాటేశారు. అయితే మిల్స్‌కాలనీ పోలీసులు మాత్రం ఈ అంశంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని అంటున్నారు. ఈ విషయంపై ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను వివరణ కోరగా.. ఇద్దరు ఎంవీఐలకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే డబ్బులు పంపించారని చెప్పారు.

పోలీసు అమరవీరులు చిరస్మరణీయులు

- ప్రజల శ్రేయస్సు కోసం సిబ్బంది పాటుపడాలి
- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ అమరువీరుల సంస్మరణ దినం

వరంగల్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని పోలీస్ కమిసనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. పోలీస్ అమరువీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద సీపీతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు హాజరై నివాళులర్పించారు. అనంతరం ఆర్ఐ స్పర్జన్ ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు 'శోక్ శస్త్రి' చేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. దేశవ్యాప్తంగా అమరులైన 191 మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకు ప్రాణాలర్పించిన పోలీసులు మహానుభావులన్నారు. పోలీసు అమరవీరుల చూపిన మార్గదర్శకాన్ని అనుసరిస్తూ సిబ్బంది ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేమని, ఎల్లప్పుడూ మన గుండెల్లోనే ఉంటారన్నారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి మిషన్ ఆస్పత్రి వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యేలు (మిగతా 6లో..)


పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు, సీపీ, కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్, సీఎండీ

వంట తంటా

కొండెక్కిన కోడిగుడ్ల ధర



- ఏజెన్సీలకు 7 నెలలుగా అందని రూ. కోటి 23 లక్షల ఎగ్ బిల్లులు
- 1 నుంచి 8 తరగతి వరకు సెప్టెంబర్ నెల భోజన బిల్లు పెండింగ్
- 9, 10 వ తరగతి వరకు విడుదల కాని 7 నెలల భోజన బిల్లులు
- అప్పులు తేలేక వంట నిర్వాహకులకు తప్పని తిప్పలు

7

నేటి నుంచి కార్తీక మాసం

- నెలంతా నోములు, వ్రతాలు, ఉపవాస దీక్షలు
- వన భోజనాలు, శుభకార్యాల సందడి



వరంగల్ కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శివ కేశవులకు ప్రీతికరమైనది కార్తీక మాసం. శివుడికి అభిషేకాలు, విష్ణువుకు ఆరాధనలు, అలంకరణలు, అమ్మవారికి కుంకుమ పూజలతో 30 రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంతో అలరారే మాసం ఇది. శుభకార్యాలు, వివాహాలు, గృహ ప్రవేశాలకు అనువైన మాసంగా దీనికి పేరు. ఈ నెలలో సత్యనారాయణ స్వామి వ్రతాలు, అనఘాదేవి, అనఘాస్వామి వ్రతాలు, భగినిహస్త భోజనాలు (సోదరులకు సోదరీమణులు భోజనాన్ని అందించే కార్యక్రమం) నిర్వహించుకుంటారు. 30రోజుల పాటు శివుడికి విశేష అభిషేకాలు, సాయంత్రం వేళ దీపాలను వెలిగించడం, ఆకాశ దీపాన్ని వెలిగించడం, ప్రదోషకాలంలో అభిషేకాలు, దీపోత్సవ కార్యక్రమాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. కార్తీక మాస దీక్షలను అనగా శివ దీక్షలను స్వీకరించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహారం తీసుకోకుండా కార్తీక పురాణం రోజుకొక అధ్యాయం చొప్పున పఠించి సాయంత్రం చుక్కలు వచ్చిన అనంతరం దీపాలు వెలిగించి భోజనాలు చేస్తారు.

కార్తీక మాస వ్రత దీక్షలు..

కార్తీక మాసంలో ఉసిరి చెట్టు వద్ద ప్రతీ రోజు దీపాలు వెలిగిస్తారు. శ్రీమహావిష్ణువు ఉసిరి చెట్టులో నిక్షిప్తమై ఉంటారని, ధాత్రి నారాయణుడిగా ఉసిరి చెట్టుకు పూజుల నిర్వహించి భోజనాలు నిర్వహించడం శుభ ప్రదంగా భావిస్తారు. ఈ మాసంలోనే విశేషంగా అన్నదానాలు, వనభోజనాలను నిర్వహిస్తారు. అమ్మవారి దేవాలయాల్లో సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించి వాయినాలిస్తారు. సామూహికంగా శ్రీలలిత సహస్ర నామ పారాయణాలు, భజనలు నిర్వహిస్తారు. ఈ మాసంలో నాగుల చవితి, నాగుల పంచమి, ఏకాదశి, పౌర్ణమి పర్వదినం రోజులలో విశేష పూజలు నిర్వహిస్తారు.

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై కొరడా

- ఇద్దరు వీవోఏల తొలగింపు
- ఇద్దరు సీసీలకు షోకాజ్ నోటీసులు, ఏపీఎంకు మెమో

శాయంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని శాయంపేట, కాట్రపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అక్రమాలకు పాల్పడిన వారిపై జిల్లా ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. 2024-25 రబీ సీజన్‌లో శాయంపేట సెంటర్‌కు వసుంధర గ్రామైక్య సంఘం వీవోఏ బలభద్ర హైమావతి, కాట్రపల్లిలో జ్యోతి గ్రామైక్య సంఘం వీవోఏ అల్లె అనితలు సెంటర్ ఇన్‌చార్జులుగా వ్యవహరిచారు. ఈ క్రమంలో ఓ మిల్లర్‌తో కలసి రూ.కోట్లలో అక్రమాలకు పాల్పడ్డారు. ఈ బాగోతం ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయీస్ అధికారుల విచారణలో బయటపడగా, మొత్తం 21 మందిపై శాయంపేట పీఎస్‌లో కేసు నమోదు చేశారు.

ఇందులో భాగంగా సెంటర్ ఇన్‌చార్జులుగా ఉన్న ఇద్దరు వీవోఏలను ఇటీవల అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో సెర్ప్ ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలలో భాగంగా ఇద్దరు వీవోఏలను విధుల నుంచి పూర్తిగా తొలగిస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వారి వద్ద సంబంధిత పుస్తకాలు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ సంబంధిత క్లస్టర్ సీసీలు విజయ్‌కుమార్, హేమలతకు షోకాజ్ నోటీసులు, అప్పటి ఏపీఎం శ్రీధర్ రెడ్డికి మెమో జారీ చేసి, వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.


తొర్రూరులో రోడ్డుపై పడిపోయిన గ్రానైట్ రాళ్లు

హైవేపై గ్రానైట్ లారీ బీభత్సం

- అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టిన వైనం
- రోడ్డుకు అడ్డంగా పడిన భారీ బండరాళ్లు

తొర్రూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై తొర్రూరు పట్టణంలో ఓ గ్రానైట్ లారీ బీభత్సం సృష్టించింది. కరీంనగర్ నుండి విజయవాడ వెళ్తున్న గ్రానైట్ లారీ బస్టాండ్ సమీపంలో సిగ్నల్ వద్ద మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పడంతో లారీపై ఉన్న భారీ బండరాళ్లు (గ్రానైట్ బ్లాక్స్) రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు చేరుకుని క్రేన్ సాయంతో లారీని తొలగించి, బండరాళ్లను పక్కకు జరిపించారు. లారీలో డ్రైవర్, క్లీనర్ ఉండగా స్వల్పగాయాలతో వారు బయటపడ్డారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు. గ్రానైట్ బ్లాక్‌లతో ప్రధాన రహదారిపై ఇష్టారాజ్యంగా ప్రయాణించే లారీలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.


మ్యూజికల్ గార్డెన్‌లో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వేగవంతంగా గ్రీనరీ పనులు పూర్తి చేయండి

● కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్

● కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని మ్యూజికల్ గార్డెన్ (కేఎంసీ) గ్రీనరీ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కుడా పరిధిలో జరుగుతున్న మ్యూజికల్ గార్డెన్ పనులు క్షేత్రసాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బాజ్‌పాయ్ మాట్లాడారు. అభివృద్ధిపనులు పూర్తి అయిన దృష్ట్యా ఇంకా మిగిలి ఉన్న ప్యాచ్ వర్క్‌లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మ్యూజికల్ గార్డెన్‌ను త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా హార్టికల్చర్ అధికారి ఆసీఫ్‌తోపాటు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా విలాయత్‌అలీ నియామకం

ఐనవోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పున్నేలు గ్రామానికి చెందిన మహ్మద్ విలాయత్‌అలీకి డిప్యూటీ కలెక్టర్‌గా మంచిర్యాలలో పోస్టింగ్ ఇచ్చారు. గ్రూప్-1 ఫలితాల్లో విలాయత్‌అలీ రాష్ట్రస్థాయిలో 86వ ర్యాంక్, బీసీ-ఈలో మొదటి ర్యాంక్ సాధించింది తెలిసిందే. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్‌గా నియామకమైన విలాయత్‌అలీకి వరంగల్ డిప్యూటీ మేయర్ దంపతులు సయ్యద్ రిజ్వాన షమీమ్ మసూద్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.


విలాయత్‌అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మసూద్



కొవ్వొత్తుల ర్యాలీ పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

పోలీసు అమరవీరులు చిరస్మరణీయులు

(5వ పేజీ తరువాయి)

నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, అధికారులు, పోలీస్ అమరవీరుల కుటుంబసభ్యులు, జాగృతి కళాబృందం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు డీసీపీలు సురేశ్‌కుమార్, ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, బాలస్వామి ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని మంగళవారం రాత్రి వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి అశోకా జంక్షన్ వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమిషనరేట్‌లోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు పెట్టి నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 31 వరకు కమిషనరేట్ పరిధిలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అదనపు డీసీపీ రవి తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు సురేశ్, ప్రభాకర్‌రావు, ఏసీపీలు, అమరవీరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వెలుగుపూల వేడుక

● ఇంటింటా ఆనందోత్సాహాలతో దీపావళి పండుగ

● భక్తిశ్రద్ధలతో గౌరీ కేదారేశ్వర వ్రతాలు

● ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు

వరంగల్ కల్చరల్/హనుమకొండ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అజ్ఞానపు చీకట్లను పారదోలి జ్ఞాన జ్యోతులను వెలిగించే దేదీప్యమానమైన పండుగ దీపావళి. ఆశ్వయుజ అమావాస్య సోమవారం రోజున దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి సోదరీమణుల చేత హారతులు తీసుకున్నారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి, బంతి పూల మాలలతో అందంగా అలంకరించి ఇంటిల్లిపాది బంధు మిత్రులతో దీపావళి వేడుకలను జరుపుకున్నారు. సాయంత్రం వేళ ఇంటి ముంగిట దీపాలు వెలిగించి టపాసులు కాల్చారు. ఇళ్లల్లో, దుకాణాల్లో ధనలక్ష్మి పూజలు నిర్వహించుకున్నారు. ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా పలు చోట్ల అన్నదానాలు నిర్వహించారు. బంధు మిత్రులను ఆహ్వానించుకొని సకుటుంబసపరివార సమేతంగా బంతిభోజనాలు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి సంబరాలను జరుపుకున్నారు.

గౌరీ కేదారేశ్వర వ్రతాలు

దీపావళి అంటేనే నోముల పండుగ. మంగళవారం సాయంత్రం వరకు అమావాస్య తిథి ఉండడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గౌరీ కేదారేశ్వర వ్రతాలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్నవారు సొంతూళ్లకు చేరుకొని బంతి పూలు, మర్రిపుల్లలతో పందిరి వేసి నైవేద్యాలను సమర్పించారు. అత్తిపత్తిదారాలతో, మర్రి ఊడలతో, మామిడి తోరణాలతో గౌరీ మాతను ప్రతిష్ఠచేసి కేదారేశ్వరుడిని ఆరాధించి పసుపు కుంకుమలతో వ్రతాలను ఆచరించుకున్నారు. అనంతరం ఇంటి ముందు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

వేడుకల్లో ప్రముఖులు

దీపావళి పర్వదిన వేడుకల్లో అనేక మంది ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. హనుమకొండలోని ఎక్సైజ్‌కాలనీ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కావ్య, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో కుటుంబసభ్యులతో పాటు అనేక మంది కాంగ్రెస్ శ్రేణులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, టీచర్ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి కూడా హనుమకొండలోని స్వగృహాల్లో దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.

దత్తక్షేత్రంలో ప్రత్యేక పూజలు..

నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలోని శ్రీమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక అభిషేకం, అలంకరణ, ధనలక్ష్మి పూజలు నిర్వహించారు. దాదాపు 2 వేల మంది పూజకు హాజరు కాగా హారతి అనంతరం అమ్మవారికి నిర్వహించిన ధనార్చన నాణెములను అర్చకుడు రాపాక గోపీకృష్ణశర్మ భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కుటుంబ సభ్యులతో దత్తక్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి శేష వస్త్రాలు, అమ్మవారి, దత్తుడి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


దీపావళి వేడుకలు నిర్వహించుకుంటున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

మామునూరు పీటీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేష్


స్మృతి చిహ్నం వద్ద నివాళులు అర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు

మామునూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల త్యాగాల వల్లే నేడు శాంతి నెలకొందని మామునూరు పీటీసీ ఇన్‌జార్జి ప్రిన్సిపాల్ కె.రమేష్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మామునూరు పీటీసీ ప్రాంగణంలో ఘనంగా పరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌జార్జి ప్రిన్సిపాల్ పాల్గొని స్మృతి చిహ్నం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్యాగానికి, సేవకు ప్రతీకగా పోలీస్ శాఖ నిలుస్తుందని, పోలీసు అమరవీరుల సేవలు ప్రజల్లో ఎప్పటికీ గుర్తుండి పోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వేంకటేశ్వరరావు, విజయ్, భిక్షపతి, సోమాని, ఏవో కల్పన, ఆర్‌ఐలు చంద్రశేఖర్, మహేష్, నవీన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుదీర్, సీఎల్ రాంమూర్తి, పీటీసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4వ బెటాలియన్‌లో..

మామునూరు 4వ బెటాలయన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ పాల్గొని పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండర్స్ కృష్ణ ప్రసాద్, పి.శ్రీనివాసరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు విజయ్, కార్తిక్, రవి, వెంకటేశ్వరు, రాజ్‌కుమార్, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

23న జాబ్ మేళా


వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సాత్విక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీని అగ్రి ల్యాబ్స్‌లో వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఫీల్డ్ ఆఫీసర్ల పోస్టుల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. టెంత్, ఇంటర్, డిగ్రీ పాసై 18 నుంచి 45 ఏళ్ల మధ్యగల యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు గురువారం నాడు ములుగురోడ్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు 9121075429 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ఆమె సూచించారు.


రిటైర్డ్ ఎస్సై కృష్ణారావుకు సన్మానం చేస్తున్న సీఐ

రిటైర్డ్ పోలీసులకు భరోసా

కాజీపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన వారిని దీపావళి పండుగ పురస్కరించుకుని మంగళవారం కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి బృందం ప్రగతినగర్‌లోని రిటైర్డ్ ఎస్సై టి. కృష్ణారావు ఇంటికి వెళ్లి కలిశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మొదటిసారిగా ఈ సంప్రదాయాన్ని ప్రారంభించామని చెప్పారు. రిటైర్డ్ కాగానే వారిని మరిచిపోకుండా వారి సమస్యలు, యోగక్షేమాలు తెలుసుకోవడంతో వారికి ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. సీఐ వెంట ఎస్సైలు నవీన్‌కుమార్, లవణ్‌కుమార్ ఉన్నారు.

సూర్యతేజస్సుతో నాగేంద్రుడు


పుష్పాలంకరణలో నాగసుబ్రహ్మణ్యేశ్వరుడు

గీసుగొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊకల్‌హవేలిలో గల ప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నాగేంద్రుడిపై ప్రభాత సూర్యకిరణాల పడిన అద్భుత సన్నివేశం మంగళవారం చోటుచేసుకుంది. కార్తీక మాసోత్సవాల సందర్భంగా స్వామివారికి అలంకరణ సమయంలో గర్భగుడిలోని పుట్టపై, నాగేంద్రుడిపై సూర్యకిరణాలు పడడంతో సూర్యతేజస్సుతో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి దివ్యాభిషేకం, రసాభిషేకాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 25న జరిగే నాగుల చవితికి ముందు సూర్యభగవానుడు తన కాంతి ప్రకాశంతో స్వామి పాదాల నుంచి ముఖారవిందం వరకు పునీతం చేయటం అరుదైన ఘటన అని ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శనాచార్యులు తెలిపారు. అర్చకుడు శ్రీహర్ష, ఆలయ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

దీపావళి రద్దీ దృష్ట్యా కాజీపేట మీదుగా స్పెషల్ రైళ్లు

కాజీపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి రద్దీని పురస్కరించుకుని కాజీపేట మీదుగా పలు స్పెషల్ రైళ్లను నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 23, 28తేదీలలో (070 91) చర్లపల్లి - దానాపూర్ మధ్య నడిచే ఈ స్పెషల్ రైలు ఈ నెల 28, 29 తేదీలలో చర్లపల్లిలో ఉదయం 9:30 నిమిషాలకు బయలు దేరి తరువాత రోజు రాత్రి 7.45 నిమిషాలకు దానాపూర్‌కు చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు (07092) దానాపూర్ - చర్లపల్లి మధ్య ఈ నెల 24, 29 తేదీల్లో దానాపూర్‌లో రాత్రి 9:15 నిమిషాలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30 నిమిషాలకు చర్లపల్లికి చేరుకుంటుంది.

(07049) చర్లపల్లి - దానాపూర్ మధ్య నడిచే మరో స్పెషల్ రైలు ఈ నెల 26న చర్లపల్లిలో ఉదయం 9:30 నిమిషాలకు బయలుదేరి మరసటిరోజు రాత్రి 7:45 నిమిషాలకు దానాపూర్‌కు చేరుకుంటుంది. (07050) దానాపూర్-చర్లపల్లి మధ్య నడిచే ఈ స్పెషల్ రైలు ఈ నెల 27న దానాపూర్‌లో రాత్రి 7:15 నిమిషాలకు బయలుదేరి మరుసటి రో జు ఉదయం 7:30 నిమిషాలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైళ్లు కాజీపేట జంక్షన్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్లార్ష, నాగ్‌పూర్, ఇటార్సి, జబల్‌పూర్, కట్ని, మైహార్, సట్నా, ప్రయాగ్‌రాగ్, దీన్‌దయాల్ ఉపాధ్యాయ, బక్సర్, స్టేషన్‌లలో హాల్టింగ్ సౌక ర్యం కల్పించినట్లు రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ ఒక ప్రకటనలో చెప్పారు.

అక్రమంగా బాణసంచా నిల్వలు

● ఇళ్లల్లో, షాపుల్లో భారీగా టపాసులు ● ఫంక్షన్ హాల్స్‌కు తాత్కాలిక అనుమతులు

● ఇష్టారాజ్యంగా అగ్నిమాపక శాఖ అధికారులు

మట్టెవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లల్లో, షాపుల్లో, ఫంక్షన్ హాల్స్‌లో వ్యాపారులు టన్నులకొద్దీ బాణసంచా నిల్వ చేశారని ఆరోపణలు వస్తున్నాయి. వరంగల్ జిల్లాల్లో 125కుపైగా తాత్కాలిక దుకాణాలకు అగ్నిమాపక శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే లైసెన్స్‌ల జారీలో పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ నగరంలో 8 ఫంక్షన్ హాళ్లలో అనుమతి ఇవ్వగా నిర్వాహకులు 500 కిలోల వరకు మాత్రమే అనుమతి తీసుకొని వేల కిలోల టపాసులను నిల్వ చేశారని ప్రచారం జరుగుతోంది.

నిబంధనలకు నీళ్లు..

నిబంధనల ప్రకారం అగ్నిమాపక శాఖ సాధనాల సంరక్షణలో బాణసంచా నిల్వలు ఉండాలి. ఎన్ని కిలోల నిల్వకు అనుమతి తీసుకుంటారో అంతకుమించి నిల్వ చేయరాదు. అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. కానీ రాజకీయ పలుకుబడి ఉన్న వ్యాపారులు, అగ్నిమాపక విభాగం అధికారులను మేనేజ్ చేసుకొని యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ఈ విషయంలో అగ్నిమాపక విభాగం అధికారులు ఎలాంటి తనిఖీలు చేపట్టలేదని, చూసీ చూడనట్లు వ్యవహరించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతాగాకుండా అధికారులు కనీస పరిశీలన చేయకుండానే తాత్కాలిక లైసెన్స్‌లు జారీ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో పాటు జనవాసాల మధ్యలో ఉన్న ఫంక్షన్ హాల్స్‌కు ఏలాంటి అగ్నిమాపక సాధనాలు లేకపోయినా అనుమతులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల చొప్పున వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా జనవాసాల మధ్య నగరంలో బాణసంచా విక్రయాలు జరిగినా పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ అర్చరీ జట్ల ఎంపిక

కేయూ క్యాంపస్ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 24 నుంచి 31 వరకు పంజాబ్‌లోని గురూకాశీ వర్సిటీలో నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ కాకతీయ యూనివర్సిటీ స్త్రీ, పురుషుల అర్చరీ పోటీలకు జట్టు ఎంపికైంది. ఈ మేరకు కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య మంగళవారం ఎంపిక క్రీడాకారుల వివరాలను వెల్లడించారు. ఎంపికైన వారిలో ఇండియన్ రౌండ్ పురుషుల విభాగంలో టి.సునీల్‌కుమార్, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్), రీకర్‌వే రౌండ్ పురుషుల విభాగంలో బి.గంగారాజు (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), సీహెచ్.త్రిమూల్, (సమత డిగ్రీ కళాశాల, తొర్రూరు), ఇ.ఆనంద్, కె.అశ్విత్ దొర (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భద్రాచలం), రీకర్‌వే రౌండ్ స్త్రీల విభాగంలో తన్వీర్ కౌసర్, (సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వరంగల్), కంపోండ్ రౌండ్ వుమెన్ విభాగంలో మాన్యూరా హసిబా (పద్మావతి డిగ్రీ కళాశాల, వరంగల్)లు ఎంపికైనట్లు వెంకయ్య వెల్లడించారు. జట్టుకు కోచ్,ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాజేశ్, హనుమకొండ న్యూసైన్స్ డిగ్రీ కళాశాల పీడీ వ్యవరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.


ఎంపికైన క్రీడాకారులతో కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ వెంకయ్య తదితరులు

అడవి దున్న దాడిలో వ్యక్తి మృతి

కొత్తగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అడవి దున్న దాడిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కార్లాయి గ్రామంలో జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కార్లాయి గ్రామానికి చెందిన కల్తీ గోవిందు(50) మేకల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18(శనివారం)న మేకలు మేపేందుకు అడవిలోకి వెళ్లాడు. సాయంత్రం మేకలు తిరిగి గ్రామానికి వచ్చాయి కానీ గోవిందు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గోవిందు కోసం అడవిలో గాలించగా సోమవారం కుళ్లిన స్థితిలో ఉన్న గోవిందు మృతదేహాన్ని గుర్తించారు. విషయాన్ని గ్రామస్తులు పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడంతో సంఘటన స్థలానికి చేరుకుని ఎస్సై రాజ్‌కుమార్ విచారణ చేపట్టారు. గోవింద్ మృతదేహం పక్కన అడవి దున్న పిల్ల మృతదేహం ఉండడంతో గోవిందు అడవి దున్న మృతదేహాన్ని పరిశీలిస్తుండగా తల్లి దున్న జరిపిన దాడిలో గోవిందు మృతి చెందినట్టు నిర్ధారణకు వచ్చారు. మృతుడికి భార్య పద్మ ఉన్నారు. మృ తుడి మరదలు కుమారుడు పిడబోయిన సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.


కార్లాయిలో గోవిందు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

ప్రభుత్వ ఆస్పత్రుల సందర్శనకు బీఆర్‌ఎస్ కమిటీ

హనుమకొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించి అక్కడి దుస్థితిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు మాజీ ఉప ముఖ్య మంత్రి తాటికొండ రాజయ్య మంగళవారం తెలిపారు. ఈ కమిటీలో తనతో పాటు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ మెతుకు ఆనంద్ ఉంటున్నారని తెలిపారు. ప్రజా ఆరోగ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ప్రభుత్వ బస్తీ దవాఖాన వైద్యులకు జీతాలు సరిగా ఇవ్వడం లేదని రాజయ్య తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వారి సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా రాజయ్య తెలిపారు.

అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

వేలేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన రేణ శ్రీనివాస్ (52) అనే కూలీ అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అజ్మీర సురేష్ మంగళవారం తెలిపారు. రేణ శ్రీనివాస్ గ్రామంలో వ్యవసాయ కూలీగా పనిచేస్తు జీవనం సాగిస్తున్నారు. కూలీకి వెళ్లిన డబ్బులు ఇంట్లో ఖర్చులకు సరిపోకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో ఇరుగుపొరుగు వద్ద చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్థాపానికి గురై సోమవారం తన సోదరుడి వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అసస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితిని గమనించి చికిత్స కోసం 108లో హుజురాబాద్ సివిల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుంటలో పడి వృద్ధురాలి మృతి

హసన్‌పర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కుంటలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మంగళవారం హసన్‌పర్తి పద్మశాలి కాలనీ శివారు బొత్తలకుంటలో చోటు చేసుకుంది. ఎస్సై శీలం రవి, మృతుడి కుమారుడు శ్రీపతి రమేష్ కథనం ప్రకారం.. శ్రీపతి నీలమ్మ(85)కు ఐదుగురు సంతానం, వీరిలో ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, అందరికీ వివాహాలు కాగా, భర్త మృతి చెందగా పెద్ద కుమారుడు శ్రీపతి రమేష్‌తోనే ఉంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం నీలమ్మ ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి పద్మశాలి కాలనీ సమీపంలోని బొత్తలకుంటను అనుకొని ఉన్న వారాల కుల సంఘం శ్మశాన వాటిక కల్వర్టుపై కూర్చుంది. ఇంతలో ఏం జరిగిందో ఏమో కానీ నీలమ్మ బొత్తలకుంట చెరు వు కల్వర్టు వద్ద నీటిలో మునిగి మృతి చెందింది. మృతుడి కుమారుడు శ్రీపతి రమేష్ ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు నీలమ్మ నీటిలో పడి మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శీలం రవి తెలిపారు.


కుంటలో పడి మృతి చెందిన నీలమ్మ

విద్యతో పాటు మానసిక ఆరోగ్యం



జ్యోతి ప్రజ్వలన చేసి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, తదితరులు

- నిట్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు
- విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ
- హార్ట్‌ఫుల్‌నెస్, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌తో ఎంవోయూ
- మానసిక ఆరోగ్య శిక్షణలో నిట్‌కు జాతీయ గుర్తింపు

హనుమకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (నిట్) విద్యార్థులు, అధ్యాపకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మానసిక ఆరోగ్యం, భావోద్వేగ స్థిరత్వం, సమగ్ర విద్యను ప్రోత్సహించే దిశగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యతో పాటు మానసిక ఆరోగ్యం పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తోంది. సాధారణంగా ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకే ప్రాధాన్యం ఇస్తారు. ప్రామాణికమైన విద్యను అందించడంపైనే ప్రధానంగా దృష్టి పెడతారు. విద్యార్థులు, అధ్యాపకుల ఒత్తిడి, వారి మానసిక స్థితిగతులను పెద్దగా పట్టించుకోవు. కానీ వరంగల్ నిట్ ఇందుకు భిన్నంగా ఒక పక్క ప్రపంచస్థాయి ఉన్నత విద్యాప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూనే సమాజానికి మానసికంగా స్థిరత్వం, ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కొగలిగే స్థితప్రజ్ఞత, ధైర్యవంతులైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు మరోపక్క ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే నిట్ క్యాంపస్‌లో మానసిక ఆరోగ్య వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. కళాశాల వినూత్న కార్యక్రమాల్లో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు.

ఆరోగ్యకరమైన వాతావరణం

విద్యార్థులు, అధ్యాపకులకు ఆత్మీయ, మానసిక సమతుల్య వాతావరణాన్ని కల్పించడం ఈ కేంద్ర ప్రధాన లక్ష్యం. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020లో పేర్కొన్న మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ఒక ప్రధాన అంశాన్ని ఆచరణాత్మకం చేసేందుకు దీనిని ఏర్పాటు చేశారు. ఈ మానసిక ఆరోగ్యం, వెల్‌నెస్ సెంటర్‌కు గత సంవత్సరం ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్ (కన్హా శాంతి వనం)తో ఎంవోయూ కుదుర్చుకోవడంతోనే అంకురార్పణ జరిగింది. హార్ట్‌ఫుల్‌నెస్ పక్షాన ఈ ఒప్పందంపై రిటైర్డ్ డీజీపీ ఆదిత్య ఆర్య, డాక్టర్ అనంత మాధవ మోహన్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ధ్యానం, యోగాభ్యాసం, మానసిక ఒత్తిడి నియంత్రణ వంటి పద్ధతులను విద్యార్థులు, అధ్యాపకులు తమ దైనందిన జీవితంలో ఆచరించేట్లు చేయడం ఈ సెంటర్ ముఖ్య ఉద్దేశం.

జాతీయ గుర్తింపు

నిట్ వెల్‌నెస్ సెంటర్ మానోసిక ఆరోగ్యం, భావోద్వేగాల నియంత్రణపై ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలకు జాతీయ గుర్తింపు లభించింది. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ నిర్వహించిన తొలి జాతీయ వెల్‌బీయింగ్ కాంక్లేవ్‌లో వరంగల్ నిట్ తన కార్యక్రమాలను ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఉన్నత విద్యా కార్యదర్శి సంజయ్ మూర్తి, విద్యా మంత్రిత్వశాఖ అధికారులు ఈ కార్యక్రమాలపై ప్రశంసలు కురిపించారు.

ధ్యానం, ఒత్తిడి నివారణలో శిక్షణ

ఈ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటైన తర్వాత విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక ఆరోగ్యాన్ని పెంచడానికి పలు ముఖ్యమైన కార్యక్రమాలు చేపట్టింది. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌తో కలిసి సుదర్శన క్రియ, మైండ్‌ఫుల్‌నెస్‌లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. అధ్యాపకుల కోసం ప్రత్యేకంగా బేర్‌ఫుట్ కౌన్సెలింగ్ వర్క్‌షాపు నిర్వహించింది. ఇందులో విద్యార్థులతో పాటు నిట్‌లో పని చేస్తున్న 150 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఎక్స్‌ప్రెషన్ ఇండియా సంస్థ డైరెక్టర్ జితేంద్ర నాగపాల్, డాక్టర్ గీతా మెహ్రోత్ర పాల్గొని భావోద్వేగ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు.

వెల్‌నెస్ కార్యకలాపాలు

నిట్ క్యాంపస్‌లో మానసిక ఆరోగ్య వెల్‌నెస్ సెంటర్ విద్యార్థులు, అధ్యాపకుల కోసం ప్రతి వారం ధ్యానం, యోగ అభ్యాసాలపై ఇస్తున్న శిక్షణకు మంచి స్పందన లభిస్తోంది. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. నిరంతరం మానసిక ఆరోగ్య శిక్షణా కార్యక్రమాలను కొనసాగించేందుకు వీలుగా వరంగల్ నిట్ 67వ వ్యవస్థాపక దినోత్సవం, ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10వ తేదీన వెల్‌నెస్ సెంటర్‌కు ప్రత్యేక హాల్‌ను కేటాయించారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి ఈ హాల్‌ను ప్రారంభించారు. ఈ యేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఇతి వృత్తం 'సంక్షోభాలు, అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యం- వివిధ సేవా రంగాల్లో అందుబాటు'. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ మెడికోవర్ ఆస్పత్రి డాక్టర్ ప్రియాంక మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. హైదరాబాద్ హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులు కూడా పాల్గొని ధ్యానంపై మార్గదర్శనం చేశారు. ఈ మానసిక శిక్షణా కార్యక్రమాలను కొనసాగించేందుకు ఈ యేడు మే 5న హార్ట్‌ఫుల్‌నెస్‌తో ఉన్న ఎంవోయూను మరో మూడేళ్లు నిట్ పొడిగించుకున్నది.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం

మానసిక ఆరోగ్యం అనేది నేర్చుకునే ప్రక్రియ మాత్రమే కాదు. జీవన గమనంలోనూ కీలకమైంది. ఈ కేంద్రం ద్వారా కరుణ, సమతుల్యత, ధైర్యం, మానసిక స్థితప్రజ్ఞత కలిగిన విద్యార్థులను సమాజానికి అందించాలన్నది మా లక్ష్యం. వరంగల్ నిట్ తన విశిష్టమైన కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ విద్యా వ్యవస్థలో సమగ్ర దృక్పథాన్ని తీసుకువస్తున్న అత్యున్నత విద్యా సంస్థగా నిలుస్తోంది.

నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి



సీతంపేటలో రేగడి మట్టిని సేకరిస్తున్న నేతకాని కులస్థులు

'దీపావళి బతుకమ్మ' షురూ

సీతంపేటలో నేడు జోడెద్దుల విగ్రహ ప్రతిమల నిమజ్జనం

హసన్‌పర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటలో దీపావళి అమావాస్య రోజు నుంచి మూడు రోజుల పాటు సాగే నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వారం నుంచే వివిధ రాష్ట్రాలలో స్థిరపడిన నేతకాని కులస్తులు, వారి కుటుంబ సభ్యులు సీతంపేటకు చేరుకోవడంతో సీతంపేటలో పండుగ వాతావరణం నెలకొంది. వేడుకల్లో మొదటి రోజు మంగళవారం ఉదయమే నేతకాని కులస్తులు ఉపవాస దీక్షతో ఊరు శివారులోని కుంటకు చేరుకొని రేగడి మట్టిని సేకరించి జోడెద్దుల విగ్రహ ప్రతిమలను తయారు చేశారు. పిండి వంటలతో జోడెద్దుల విగ్రహ ప్రతిమలకు నగలు అలంకరించి కేదారీశ్వరస్వామి వ్రతం ఉపవాసదీక్షతో నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా ఉండాలని కుటుంబ సభ్యులంతా ఆయురారోగ్యాలతో ఐశ్వైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని వేడుకున్నారు. దీంతో నేతకాని కులస్తుల దీపావళి బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి.

ఊరేగింపు.. నిమజ్జనం..

సీతంపేటలో రెండో రోజు నేతకాని కులస్తుల దీపావళి వేడుకలలో భాగంగా బుధవారం కేదారీశ్వరస్వామి వ్రతం ముందు రేగడి మట్టితో తయారు చేసిన జోడెద్దుల విగ్రహ ప్రతిమలకు ప్రత్యేకంగా పిండి వంటలతో తయారు చేసిన (వ్యవసాయ పనిముట్లు నాగళి, కోల, కర్రు) నగలను అలంకరించి కోలాటాలతో ఆటపాటలతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకొని నిమజ్జనం చేస్తారు. ఇది కేవలం పురుషులు మాత్రమే జరుపుకునే రెండో రోజు ఘట్టం.



మహానంది పురస్కారాన్ని అందుకుంటున్న గంగు ఉపేంద్రశర్మ

మహానంది అవార్డుల ప్రదానోత్సవం

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోజా క్రియేషన్స్ 30వ వార్షికోత్సవాల సందర్భంగా దీపావళి పర్వదిన వేళ హనుమకొండ చౌరస్తాలోని వీనస్ ఫంక్షన్ హాల్‌లో వివిధ రంగాల ప్రముఖులకు కాకతీయ మహానంది పురస్కారాలను ప్రదానం చేసింది. రాష్ట్ర బాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ సంగీతకారుడు, కర్నాటక గాత్ర విద్వాంసుడు ఆచార్య తిరుపతయ్య మాట్లాడుతూ.. సకల కళల సమాహారంగా ఓరుగల్లు విరాజిల్లుతున్నదన్నారు. రోజా క్రియేషన్స్ డైరెక్టర్ ఆలేటి శ్యాం సుందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకుడు గట్టు మహేశ్‌బాబు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా అనేక వైవిధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న రోజా క్రియేషన్స్‌ను అభినందించారు.

కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మను ఘనంగా సత్కరించి అర్చక రత్న బిరుదుతో కాకతీయ మహానంది పురస్కారాన్ని అందజేశారు. అదే విధంగా ప్రముఖ కవిగా, లయనిజం ద్వారా సామాజిక సేవ చేస్తున్న పొట్లపల్లి శ్రీనివాసరావు, ఓరుగల్లుకు సంగీత పరిజ్ఞానం నేర్పిన ప్రముఖ సంగీత విద్వాంసుడు సీతాల రఘువేందర్, రంగస్థల నటుడు, కళాపోషకుడు, కళా రాజేశ్వర్‌రావు, ప్రముఖ ఫొటోగ్రాఫర్, లయన్ వంగరి వేణుగోపాల్, ప్రముఖ అధ్యాపకురాలు ఎం.రాంబాయి, కొప్పుల రాకేశ్, ఉప్పనపల్లి రవికుమార్, బి.లక్ష్మీబాయి తదితరులకు కాకతీయ మహానంది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాల య జానపద గిరిజన విజ్ఞాన పీఠం డీన్ గడ్డం వెంకన్న, పోలీసు అధికారి రావేళ్ల రామారావు, ప్రముఖ వ్యాపారి పుల్లూరు మధు, వేణుమాధవ్, ప్రముఖకవి పిట్టవరం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రముఖ వ్యాఖ్యాత గాయకుడు ఠయ్యాల శ్రీధరాచారి స్వాగతం పలికారు.

మందులోళ్లా.. మాయలోళ్లా?

- నిబంధనలను ఉల్లంఘిస్తున్న మెడికల్ షాపుల నిర్వాహకులు
- యథేచ్ఛగా యాంటీ బయాటిక్స్, అన్‌వాంటెడ్ కిట్ల అమ్మకాలు
- మందులపై జీఎస్టీ తగ్గినా అమలు కాని వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



పోచమ్మమైదాన్ (వరంగల్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపుల మాయాజాలం కొనసాగుతోంది. అడిగేవారు, ఆపేవారు లేకపోవడంతో షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన రెచ్చిపోతున్నారు. ప్రజలకు నాసిరకం మందులు అంటగడుతూ బిల్లులు లేకుండా రూ.కోట్లలో వ్యాపారం కొనసాగిస్తున్నారు. అనేక మంది మెడికల్ షాపుల నిర్వాహకులు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. జ్వరం, జలుబు, దగ్గు తదితర జబ్బులకు విచ్చల విడిగా యాంటీబయాటిక్స్ అమ్ముతున్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మేవారు కొందరైతే, ప్రిస్క్రిప్షన్ పట్టుకొని వెళ్తే నాసిరకమైన మందులు అంటగట్టేవారు మరికొందరు. సేమ్ మందులు కాదుకదా అని ఎవరైనా ప్రశ్నిస్తే కేవలం కంపెనీ మాత్రమే తేడా, ఫార్ములా ఒక్కటే అని బుకాయిస్తున్నారు. నగర పరిధిలోనే సుమారు 1500 వరకు, జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల వరకు మెడికల్ షాపులు కొనసాగుతున్నాయి.

సుమారు 80 శాతానికి పైగా మెడికల్ షాపులలో ఫార్మసిస్టులే ఉండరు. కేవలం వారి సర్టిఫికెట్ పెట్టి మెడికల్ షాపుల అనుమతి పొంది పదో తరగతి చదివిన వారు మెడికల్ షాపులు నిర్వహిస్తున్నవారు కోకొల్లలు. అంతేకాక అనేక చోట్ల ఇష్టారీతిన యాంటీబయాటిక్స్, అన్‌వాంటెడ్ కిట్లు, స్టెరాయిడ్స్, పలురకాల సిరప్‌లు, మత్తు ఇంజక్షన్లు, ఇతర మందుల అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి.

అనేక చోట్ల మందులకు బిల్లలు ఇవ్వకుండా జీరో దందాలకు పాల్పడుతున్నారు. మందులు కొనుగోలు చేసిన వారి వద్ద డబ్బులు తీసుకోవడం తప్ప.. బిల్లు ఇవ్వడం అనేదే కనిపించడం లేదు. అధిక లాభాలకు ఆశపడి నాసిరకమైన మందులను అంటగట్టడమే ఇందుకు కారణమని పలువురు చెబుతున్నారు. యేటా రూ.కోట్లలో జీరో దందా కొనసాగుతోంది. అంతేకాక కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జీఎస్టీని సైతం అమలు చేయడం లేదు. పాత ధరలకే మందులు అమ్ముతున్నారు.

అధికారులెక్కడ ?

మెడికల్ మాఫియా ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు.ఔషధ నియంత్రణశాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వెలువడుతున్నాయి. పైగా మెడికల్ వ్యాపారానికి వారే అండగా ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. మెడికల్ షాపులలో కనీసం ఫార్మసిస్టులు లేకపోవడం కనబడటం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా డ్రగ్ కంట్రోల్ అధికారులు మేలుకొని మెడికల్ మాఫియాను అరికట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

విచ్చలవిడిగా దోపిడీ..

ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల మెడికల్ షాపుల హవా జిల్లాలో కొనసాగుతోంది. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో సైతం కార్పొరేట్ కంపెనీలు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నాయి. గల్లీకి ఒక షాపు చొప్పున అనేక చోట్ల వీరి దందా కొనసాగుతోంది. అందులో సొంత కంపెనీల మందులే రోగులకు అంటగడుతున్నట్లు విమర్శలు వెలువడుతున్నాయి. అంతేకాక పలు చోట్ల జనరిక్ మందులను సైతం బ్రాండెడ్ పేరుతో అమ్మకాలు సాగిస్తున్నారని, ఇందుకోసం డిస్కౌంట్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని తెలుస్తోంది.

సురేఖ మంత్రి పదవిపై

'కడియం' కుట్ర

- మాజీ ఉప ముఖ్యమంత్రి టి. రాజయ్య



మీడియాతో మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

హనుమకొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండా సురేఖ మంత్రి పదవిపై కడియం శ్రీహరి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఆరోపించారు. మంత్రి పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో శ్రీహరి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. సోమవారం హనుమకొండలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. రాష్ట్రంలో మంత్రి పదవుల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య గొడవలు జరుగుతున్నాయని అన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ రెడ్డి నాయకులంతా కలిసి ఒక బీసీ మహిళ మంత్రి కొండా సురేఖపై కుట్రలు చేయడం దారుణమన్నారు. రెడ్డి నాయకులతో కలిసి మంత్రి పదవిని చేజిక్కించుకోవాలని కడియం శ్రీహరి ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కడియం శ్రీహరి గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోసి పార్టీని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్లారని రూ.3లక్షల కోట్లు అప్పులు చేసి ఒక కొత్త ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునితగోపీనాథ్ భారీ మెజార్టీతో గెలుస్తుందని, రాష్ట్రంలో నిజమైన మార్పు జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం అవుతుందని రాజయ్య తెలిపారు.

చిగురిస్తున్న ఆశలు

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఇందులో మొదటి దశలో 1,738 ఎకరాలు, రెండో దశలో 6,075 ఎకరాల భూమి అవసరం కాగా, పూర్తిస్థాయిలో భూసేకరణ చేశారు. ఈ రెండు దశల నుంచి ఎత్తిపోతలు జరుగుతున్నాయి. అయితే భూ చిక్కులన్నీ కూడా మూడో దశలో ఎదురవుతున్నాయి. ప్రాజెక్టులో కీలకమైన మూడో దశ నుంచే అత్యధికంగా 2,39,790 ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇప్పటికే దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌లోకి దేవాదుల నుంచి లిఫ్టుల ద్వారా గోదావరి జలాలు చేరుతున్నాయి. ఈ సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న వెల్‌టైప్‌లో నిర్మించగా, 141 మీటర్ల లోతులో పంపుహౌస్ ఏర్పాటు చేశారు.

ఇక్కడి నుంచే ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీటిని లిఫ్టుచేసి ఎగువన ఉన్న జిల్లాలకు గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. అయితే ఎంతో కీలకమైన ఈ దశలోనే భూసేకరణకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో రైతాంగానికి సాగునీరు అందటం లేదు. మొత్తం 33,451ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటి వరకు అధికారులు 30,582 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 2,869 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

ఇందులో ప్రధానంగా జనగామ జిల్లాలో 1,080, సిద్ధిపేట జిల్లాలో 935 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలో గల జనగామ నియోజకవర్గంలో 6,477 ఎకరాలకు గాను, 5,492 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 985 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అలాగే స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో 8,035 ఎకరాలకు భూసేకరణకు 7,935 ఎకరాల భూమి సేకరించారు. ఇంకా 100 ఎకరాలు, పాలకుర్తి నియోజకవర్గంలో 4,706 ఎకరాలకు గాను 3,939 ఎకరాల భూ సేకరణ చేయగా, ఇంకా 767 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. అలాగే వర్ధన్నపేటలో 168 ఎకరాలు, నర్సంపేట నియోజకవర్గంలో 133ఎకరాలు, భూపాలపల్లిలో 59ఎకరాలు, ములుగులో 179 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

భూ సేకరణపై ఇటీవల భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దేవాదుల, వరంగల్, హైదరాబాద్‌లో పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. దేవాదులను ప్రాధాన్యత ప్రాజెక్టుగా చేపట్టడంతోపాటు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, పనుల్లో జాప్యం జరగవద్దని ఆదేశించారు. దీంతో కెనాల్స్, పంపుహౌస్‌లు, మోటర్ల పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ, భూసేకరణపై అడుగులు పడటం లేదనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. భూసేకరణ పూర్తయితేనే చివరి ఆయకట్టు వరకు గోదావరి జలాలు అందించే వీలుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే భూసేకరణతో పాటు మూడో దశల్లో మొత్తం 2,430 కిలో మీటర్ల గ్రావిటీ కెనాల్స్ తవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 1,663.10 కిలో మీటర్లే పూర్తి చేశారు. ఇంకా 767కిలో మీటర్ల గ్రావిటీ కెనాల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అధికారులు కాలువల తవ్వకాలపై కూడా దృష్టి పెట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉర్సు దర్గా వద్ద ఫూలే విగ్రహం ధ్వంసం

మద్యం మత్తులో ఓ వ్యక్తి దుశ్చర్య



ధ్వంసమైన జ్యోతిబా ఫూలే విగ్రహం

కరీమాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉర్సు దర్గా వద్ద బీసీల ఆరాధ్య దైవమైన మహాత్మజ్యోతిరావు ఫూలే విగ్రహాన్ని ఓ దుండగుడు ధ్వంసం చేశాడు. మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు సోమవారం అర్ధరాత్రి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. వాటి ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన వంగరి రాహుల్‌గా నిర్ధారించారు. కాగా ఈ ఘటనపై పలువురు బీసీ సంఘాలు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ డిమాండ్ చేశారు. బీసీల స్ఫూర్తి ప్రదాత అయిన ఫూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని అన్నారు. ఇది హేయమైన చర్య అని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు డిమాండ్ చేశారు.

సొంత ఖర్చుతో మళ్లీ ఏర్పాటు చేయిస్తా : నన్నపునేని

ఉర్సు దర్గా వద్ద మహాత్మ జ్యోతిరావు ఫూలే విగ్రహం ధ్వంసం కావడం బాధాకరమని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం ఆయన సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అదే స్థలంలో సొంత ఖర్చులతో జ్యోతిరావు ఫూలేతో పాటు, సావిత్రీబా ఫూలే కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

వంట.. తంటా



నర్సంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో భోజనం, గుడ్డు వడ్డిస్తున్న వంట ఏజెన్సీ మహిళలు

కొండెక్కిన కోడిగుడ్ల ధర

- ఏజెన్సీలకు 7 నెలలుగా అందని రూ. కోటి 23 లక్షల బిల్లులు
- 1 నుంచి 8 తరగతి వరకు సెప్టెంబర్ భోజన బిల్లు పెండింగ్
- 9, 10 వ తరగతులకు విడుదల కాని 7 నెలల భోజన బిల్లులు
- అప్పులు తేలేక వంట ఏజెన్సీ కార్మికులకు తప్పని తిప్పలు

నర్సంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆకలి తీరుస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలకు సకాలంలో బిల్లులు అందడంలేదు. నెలనెలా అందాల్సిన బిల్లులను ఆరు, ఏడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో మహిళలు అప్పులు చేసి కోడి గుడ్లు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి వారానికి మూడు రోజులు భోజనంలో గుడ్డును పిల్లలకు పెడుతున్నారు. బిల్లులు సకాలంలో రాక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత కొన్ని నెలలుగా పెద్ద మొత్తంలో బిల్లుల బకాయిలు అందక వంటఏజెన్సీల నిర్వాహకులు అప్పులు తీర్చలేక పడరాని పాట్లు పడుతున్నారు. పెరిగిన ధరలతో మధ్యాహ్న భోజనం నిర్వహణ వారికి భారంగా మారుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన బిల్లులు విడుదల కాక మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు పడరానిపాట్లు పడుతున్నారు.

వరంగల్ జిల్లాలో 546 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 27,168 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలవుతుంది. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి భోజనం రూ.6.78, 6నుంచి 8వ తరగతి వరకు విద్యార్థికి రూ:10.17, 9, 10వ తరగతి విద్యార్థికి రూ:10.67 వంతున్న వంటఏజెన్సీ మహిళలకు చెల్లిస్తున్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు భోజన బిల్లులు ఆగస్టు వరకు ప్రభుత్వం చెల్లించారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9, 10 వతరగతి వరకు భోజన బిల్లులు మార్చి నుంచి పెండింగ్‌లో ఉండడంతో వంటఏజెన్సీ మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఒక్కో కోడిగుడ్డుకు రూ.6 వంతున గుడ్డు బిల్లు సపరేటుగా అందిస్తుంది. 1 నుంచి 8 వ తరగతి వరకు చదివే విద్యార్థులకు సంబంధించి మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలకు భోజన బిల్లులు ఆలస్యమైనా సక్రమంగా అందుతూ సెప్టెంబరు నెల బిల్లు మాత్రమే పెండింగ్ ఉంది. 9, 10 వతరగతి విద్యార్థులకు సంబంధించిన భోజన బిల్లులు మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎగ్ (కోడి గుడ్లు) బిల్లులు మాత్రం నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో వంటఏజెన్సీ మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు.

అందని బిల్లులు

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులకు మెనూ ప్రకారం వారంలో మూడు సార్లు కోడి గుడ్డును అందిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధరలు కొండెక్కాయి. దీంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ:6 చెల్లిస్తుంది. మార్కెట్‌లో మాత్రం గుడ్డు ధర రూ.6 నుంచి రూ.7 ధర పలుకుతుంది. నిత్యావసర సరుకుల ధరలు సైతం పెరగడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో 546 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 27,168 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. గత మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలలకు సంబంధించిన జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని వంట ఏజెన్సీ మహిళలకు నెలకు సుమారు రూ.17లక్షల 60 వేల మేరకు ఎగ్ బిల్లులు అందిస్తుంటారు. గత మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలలకు సంబంధించిన ఎగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఏజెన్సీల మహిళలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



ప్రమోద్ మృతిని రాజకీయం చేయడం సిగ్గుచేటు

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ప్రమోద్ మృతిని రాజకీయం చేయడం సిగ్గుచేటని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి తాటికొండ రాజయ్య ఈ విషయంలో వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాజయ్య వ్యాఖ్యలను రాజేందర్‌రెడ్డి ఖండించారు. బీఆర్ఎస్ హయాంలోనే పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో వ్యవస్థలో గౌరవం, భద్రతా లేకుండా చేశారని విమర్శించారు. మంత్రి పదవి నుంచి తొలగించిన సమయంలో రాజయ్య నోరు ఎందుకు మెదపలేదని ప్రశ్నించారు. ప్రజల భద్రతా, సంరక్షణకు కాంగ్రెస్ మెరుగైన చర్యలు తీసుకుంటుందన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా దక్కదన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఐ శివకుమార్, మహేశ్‌బాబు తదితరులు

నేటి నుంచి కార్తీక మాసోత్సవం

వేయి స్తంభాలగుడిలో విస్తృత ఏర్పాట్లు - కరపత్రం ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడిలోని ఆలయ మండపంలో ఈనెల 22 నుంచి కార్తీక మాసోత్సవ పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డి.అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఈ కార్తీక మాసంలో నెల పాటు జరిగే పూజా కార్యక్రమాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ.. బుధవారం ఉత్తిష్టగణపతి అభిషేకంతో కార్తీకమాసం పూజలు ప్రారంభమవుతాయని చెప్పారు. రుద్రేశ్వరుడికి పాశుపత రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతీ సోమవారం ప్రదోశ కాలసమయంలో కూడా రుద్రాభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతీ సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపండితుడు గంగు మణికంఠ, అర్చకులు సందీప్‌శర్మ, ఎన్ మధుకర్, ఎల్.రామక్రిష్ణ, బి.రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇన్‌స్ట్రుమెంటేషన్ భవనానికి శంకుస్థాపన

కేయూ క్యాంపస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేయూలో నూతనంగా సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ భవనానికి నేడు శంకుస్థాపన చేయనున్నారు. కేయూ క్యాంటీన్ సమీపంలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమంలో కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రూసా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, కాలేజీయేట్ కమిషనర్ ఎ.శ్రీదేవసేన, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, రూసా ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ సౌందర్య జోసెఫ్, కేయూ నోడల్ ఆఫీసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, డీవో ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, డీఈ, ఈఈ రామిశెట్టి రవీందర్, పి.అరుణ్‌కుమార్‌లతో పాటు ఇతర పరిపాలన అధికారులు హాజరు కానున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్థానంపై బుక్‌లెట్



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న భూక్య మోహన్

వడ్డెపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానంపై పుస్తకాన్ని రాసినట్లు పుస్తక రచయిత భూక్య మోహన్ వెల్లడించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. 'సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయంగా మొనగాడు' అనే 9 పేజీల బుక్‌లెట్‌ను రాశానని, త్వరలోనే సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యార్థి నాయకులు గుగులోత్ నవీన్‌నాయక్, ధరావత్ నరసింహ నాయక్, మడకం రమేష్, కోరశ గంగరాజు, కల్యాణ్ నాయక్, బానోత్ ఆదినాయక్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ నగర్‌లో ఆరుగురిపై కుక్కల దాడి



గాయపడిన బాలుడిని పరామర్శిస్తున్న గాంధీనగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

వడ్డెపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 57వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో కుక్కలబెడద నెలకొంది. సోమవారం సాయంత్రం ఆరుగురు బాలురపై మూకుమ్మడిగా దాడి చేసి కరిచాయి. బయటకు రావడానికి పిల్లలు,పెద్దలు జంకుతున్నారు. స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు జీడబ్ల్యూఎంసీ సిబ్బంది మంగళవారం గాంధీనగర్‌లో కొన్ని కుక్కలను పట్టుకున్నారు. గాయపడిన బాలురను గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య గౌడ్ తదితరులు పరామర్శించారు.

వన భోజనాలను జయప్రదం చేయాలి

మడికొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి పరపతి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నవంబరు 9న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు హనుమకొండ హసన్‌పర్తిలోని ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు పద్మశాలి పరపతి సంఘాల జేఏసీ జిల్లా కో కన్వీనర్ వైద్యం రాజగోపాల్, అఖిల భారత పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం తెలిపారు. మడికొండలోని పద్మశాలి భవనంలో సోమవారం కార్తీక మాస సామూహిక వన భోజనాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పద్మశాలి సంఘీయులంతా సామూహిక వన భోజనాల కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మడికొండ పద్మశాలి సంఘం, సేవా పరపతి సంఘం అధ్యక్షుడు బిల్లా రవీందర్, కామని మల్లేష్, నల్ల సురేష్‌కుమార్, సదానందం, వెంకటేశ్వర్లు, నామని సదానందం, ప్రకాష్, శివ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని నాగారం గ్రామానికి చెందిన పోలీసు అమరవీరుడు గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్ పెరుగు రవి విగ్రహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు, ఎస్సై శీలం రవితో పాటు పెరుగు రవి కుటుంబ సభ్యులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేస్తున్న పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షుడు గౌరు రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సందరాజు సంతోష్‌తో పాటు పెరుగు రవి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రవి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, పోలీసులు

అయోడిన్ ఉప్పునే వినియోగించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అయోడిన్ కలిగిన ఉప్పునే వినియోగించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య సూచించారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పోచమ్మకుంటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. నర్సింగ్ సిబ్బంది, ఆరోగ్య మహిళ క్లినిక్‌కు వచ్చిన మహిళలు, సిబ్బందిని ఉద్దేశించి డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... అయోడిన్ లోపం వల్ల వచ్చే వివిధ రకాల ఆరోగ్య సమస్యలను ప్రజలకు వివరించాలన్నారు. అయోడైడ్ ఉప్పు వాడకం వల్ల సరైన పెరుగుదల, చురుకుదనం, మంచి శారీరక, మానసిక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి ఉంటుందన్నారు. ఆరోగ్య, సిబ్బంది ఆశా కార్యకర్తలు అయోడైజ్డ్ ఉప్పు వినియోగంపై ప్రోత్సాహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇక్తదర్ అహ్మద్, డాక్టర్ దీప్తి, శ్రీనివాస్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు పతకానికి విరాళం

కేయూ క్యాంపస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 2025 ఏడాదిని కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఎం.కరుణాదేవి స్మారక బంగారు పతకాన్ని అందజేయనున్నారు. ఈ మేరకు మంగళవారం కేయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంను కలిసి ఎం.కరుణాదేవి స్మారక బంగారు పతకానికి సంబంధించిన విరాళం చెక్‌ను వరంగల్ డీఆర్వో ఎం.విజయలక్ష్మి అందజేశారు. ఎంఏ తెలుగు విభాగం సంస్కృతం సబ్జెక్టులో మొదటి దఫాలో అత్యధిక మార్కులు సాధించిన వారికి తన మాతృమూర్తి కరుణాదేవి స్మారక బంగారు పతకాన్ని అందజేయనున్నట్లు డీఆర్వో తెలిపారు. దీనికి సంబంధించిన డబ్బులను వర్సిటీకి చెక్ రూపంలో అందజేసినట్లు తెలిపారు.

'దైవ మార్గమే సత్యమార్గం'

హసన్‌పర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దైవ మార్గమే సత్యమార్గమని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలోని బొత్తలకుంట కట్ట చదును పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాగపంచమిని పురస్కరించుకొని నాగమయ్య ఆలయానికి వచ్చే భక్తుల కోసం కట్ట నుండి దేవాలయ మార్గంలో ఉన్న కట్ట చదును పనులకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వీసం పాపిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జన్ను రవిందర్, పుల్ల రవిందర్, ఆరెల్లి వెంకటస్వామి, తాళ్ల మధు, పెద్దమ్మ సురేష్, బిగుళ్ల సురేష్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోలు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని టీఎన్జీవోల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జిల్లాలోని ఉద్యోగులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నాయినిని కలిసిన వారిలో టీఎన్‌జీఓస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్రం సంఘం నాయకులు రామునాయక్, జిల్లా నాయకులు రాజేష్‌ఖన్నా, సురేష్, రామాంజనేయులు, రాజీవ్, కలకోట్ల భరత్, పైడి రాజు, ప్రణయ్, పృథ్వీ, మల్లేశం, రియాజ్, మహబూబ్‌లు ఉన్నారు.

కలెక్టర్ స్నేహ శబరీష్‌కు..

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో క్రియాశీలక పాత్ర పోషించే గెజిటెడ్ అధికారులు జిల్లాను ముందు వరుసలో ఉంచేలా కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెన్నమనేని జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ ఐఏఎస్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఇతర నాయకులు వెంకటేశ్వర్‌రావు, మేన శ్రీను, సంజీవరెడ్డి, భానుప్రసాద్, కోలా రాజేష్‌కుమార్, బాలరాజు, రవీందర్‌సింగ్, నవీన్, మాధవరెడ్డి, రాజేష్‌కుమార్, రఘుపతిరెడ్డి, జయంతి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాయినికి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవోలు

గ్రూప్-1 ర్యాంకర్లను అభినందించిన ఎమ్మెల్యే

హనుమకొండ సిటీ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాకు చెందిన ముగ్గురు గ్రూప్-1 ర్యాంకర్లను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభినందించి సన్మానించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బండారి అన్వేశ్(డీఎస్పీ), సంగాల జశ్వంత్ రాజ్(డీఎస్పీ), పోతరాజు పవన్ (మునిసిపల్ కమిషనర్)ను నాయిని రాజేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు.

26న 'ఓరుగల్లు గాన కళావైభవం'

సమన్వయకర్త బిటవరం శ్రీమన్నారాయణ

వడ్డెపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఈ నెల 26న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు 'ఓరుగల్లు గాన కళావైభవం' అనే ప్రజా చైతన్య యాత్ర జరుగుతుందని ఓరుగల్లు గాన కళావైభవం కమిటీ సమన్వయ కర్త బిటవరం శ్రీమన్నారాయణ, ప్రతినిధులు రిటైర్డ్ ప్రొఫెస్ తిరుపతయ్య, విశ్వ కవి సిరాజొద్దీన్ తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళావైభవానికి సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా వాగ్గేయ కారుడు మైస ఎర్రన్న వందకు పైగా సామాజిక చైతన్యాన్ని నింపే గీతాలను చూడకుండానే ఈ కళావైభవంలో నిర్వీరామంగా ఆలాపిస్తారని తెలిపారు. ఇది ఒక ప్రపంచ రికార్డు స్థాయిలో నిలిచే విశేష ప్రయత్నాన్ని చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, గౌరవ అతిథులుగా వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ జి. వెన్నెల హాజరవుతారని , కవులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గాయకుడు మైస ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



ఓరుగల్లు గాన కళావైభవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

దీపావళి వేడుకలు

కాజీపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట డీజిల్‌కాలనీలో ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. సీనియర్ డీఎంఈ, ఎస్.వెంకటకుమార్ దంపతులు రైల్వే కార్మికులతో కలిసి ఇనిస్టిట్యూట్ ఆవరణలో బాణసంచా పేల్చారు. ఈ సంబరాల్లో డీఎంఈ అనికేత్ దంపతులు, డీఎంఈ రమేశ్ కుమార్ దంపతులు, సల్మాన్‌రాజ్‌తో పాటు రైల్వే కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో..

బాలసముద్రం : అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.అనితారెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో దీపావళి సంబరాలు జరుపుకున్నారు. పిల్లలతో టపాసులు కాల్పించి అనితారెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కరుకాల అర్పికారెడ్డి, సుచరిత, రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాజీపేటలో సంబురాలు జరుపుకుంటున్న రైల్వే కార్మికులు

అక్రమ నిర్మాణాల అడ్డగింపు

వడ్డెపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి శివారులోని బతుకమ్మ బండ ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలకు రియల్టర్లు ఉపక్రమించారు. మంగళవారం రియల్టర్ల సిబ్బంది బతుకమ్మ బండ స్థలంలో పునాదులు తీస్తుండగా వడ్డెపల్లికి చెందిన కె.ప్రసాద్, రామకృష్ణ, సురేష్ తదితరులు అడ్డుకున్నారు. వడ్డెపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 690లో 33 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని రియల్టర్లు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన చేశారు. జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ తోపాటు ఆర్‌డీవో రమేష్ రాథోడ్, హనుమకొండ తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి బతుకమ్మ బండ స్థలాన్ని సందర్శించి హద్దులు ఏర్పాటు చేయించి రియల్టర్ల భారి నుంచి కాపాడాలని వడ్డెపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

'ఆర్టిజన్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి'

రాంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాక్ ఆధ్వర్యంలో మంగళవారం టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జాక్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న 23,667 మంది కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి పూర్తిస్థాయిలో రెగ్యులరైజ్ చేయకుండా ఆర్టిజన్‌లుగా గుర్తించి ఒకే సంస్థలో రెండు సర్వీసు రూల్స్‌ను ఆయా డిస్కంల యాజమాన్యాలు అమలుచేస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమాన హక్కులు కల్పించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేసేందుకు సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ జాక్ చైర్మన్ సికిందర్, నాయకులు శ్రీకాంత్, రవీందర్‌రెడ్డి, తిరుపతి, జి.అనంత రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీనువాస్, అశోక్, చింతలపూడి సతీష్‌కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, సదాశివ కాలనీ, మహాలక్ష్మీ టెంపుల్, మారుతికాలనీ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, సుప్రభ హోటల్, హరిత హోటల్ ఏరియా, ఏకశిల పార్కు ఏరియాల్లో ఉదయం 7.30 నుంచి రాత్రి 9.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

సాస్కికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి : మేయర్



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) పథకం అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు సాస్కి ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నవంబర్ 30 లోగా సాస్కి ప్రతినిధులతో కలిసి ఇక్కడి అధికారులు పథకానికి సంబంధించిన అంశాలను అవగతం చేసుకుని వ్యూహాత్మక ప్రణాళికలు, డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలన్నారు. సాస్కి పథకంలో భాగంగా చారిత్రాత్మక వరంగల్ నగరంలో పురాతత్వ విధానాలను ప్రోత్సహించి అభివృద్ధి చేయాలన్నారు. నైబర్ హుడ్ ప్రణాళిక అంశం, పాదాచారులు నడిచే మార్గాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సీసీ కెమెరాల ఏర్పాటు, స్పాంజ్ పార్కుల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు, సిటీ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా 50 ఎకరాల పచ్చదనాన్ని పెంచే ప్రదేశానికి సంబంధించిన అంశాలు ఈ పథకంలో పొందుపర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఈఈలు రవికుమార్, మాధవిలత, స్మార్ట్‌సిటీ ప్రతినిదులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వడ్డెపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణానికి చెందిన పుట్టపురి అనిత అనే కళాకారిణి తల్లి సీహెచ్. మల్లికాంబ అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా సినిమా, టీవీ కళాకారుల సంఘం అధ్యక్షుడు రుద్రారపు సదా తోటి కళాకారుల సహకారంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మల్లికాంబకు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం ఆస్పత్రిలో అందజేశారు. ఆయన వెంట ఉమ్మడి వరంగల్ జిల్లా యాక్టింగ్,

అంబేద్కర్ ఆశయాలను విస్తృతం చేయాలి

అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య



సమావేశానికి హాజరైన నాయకులు

వడ్డెపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాలను గ్రామాలు, పల్లెలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిప్పలపల్లి అవిలయ్య అన్నారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల అంబేద్కర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అవిలయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ యువజన సంఘాలను పటిష్ట పర్చాలని పిలుపు నిచ్చారు. చైతన్య సదస్సులను నిర్వహించి అంబేద్కర్ భావజాలాన్ని ప్రజలకు తెలియ చేయాలని కోరారు. సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మధుపాక ఎల్లయ్య, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల అరుణ్‌కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు, రాష్ట్ర, జిల్లా నాయకులు నీరుడు సామ్యేల్, పుల్ల మల్లయ్య, తప్పెట్ల వీరన్న, హరిప్రసాద్, కలకోట్ల ప్రతాప్, ఏనుగట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ రన్నర్‌గా కేయూ ఇంజనీరింగ్ జట్టు

కేయూ క్యాంపస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి కిట్స్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన కాకతీయ వర్సిటీ పురుషుల ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ పోటీల్లో కేయూ కోఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. కేయూ ఇంజనీరింగ్ విద్యార్థులు బి.చందన్, దారావత్ రాజేశ్వర్, ఎనగందుల రవికిరణ్‌ల జట్టు టేబుల్ టెన్నిస్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపి వర్సిటీస్థాయిలో రన్నర్‌గా నిలిచారు. జట్టు సభ్యులను కళాశాల ప్రిన్సిపాల్ రమణ, కళాశాల సూపరింటెండెంట్ బొల్నేపాక ప్రభాకర్, పీడీ శ్రీధర్‌రెడ్డి మంగళవారం కళాశాలలోని ట్రోఫీని అందచేసి అభినందలు తెలిపారు. కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని 36 జట్లు టెన్నిస్‌లో పోటీపడగా కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ రమణ తెలిపారు.

ఫ్యాషన్



ధగధగలాడే బంగారం డ్రస్

బంగారంతో ఆభరణాలతో పాటు దుస్తులూ రూపొందుతూ ఉంటాయి. తాజాగా దుబాయ్‌కు చెందిన అల్ రొమోజాన్ ఆభరణాల బ్రాండ్... పది కిలోల బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల ఖరీదైన 'దుబాయ్ డ్రస్'ను రూపొందించింది. ఇలాంటి బంగారం దుస్తుల స్ఫూర్తితో ట్రెండ్‌గా మారిపోతున్న గోల్డెన్ డ్రస్సుల మీద ఓ లుక్కేద్దామా...





9.5 కోట్ల డ్రస్

విలాసాలకూ, సంపదకూ పేరు పొందిన దుబాయ్ తాజాగా 21 క్యారెట్ల మేలిమి బంగారంతో తొమ్మిదిన్నర కోట్ల రూపాయల విలువైన బంగారం డ్రస్‌ను రూపొందించి, గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. పది కిలోల బరువున్న ఈ డ్రస్ ప్రపంచంలోనే అత్యంత బరువైన, విలువైన డ్రస్‌గా పేరు తెచ్చుకుంది. ఒక బంగారు కిరీటం, నెక్లెస్, నడుముకు తగిలించుకునే హియార్ అనే ఆభరణం లాంటి అదనపు హంగులు కూడా ఈ డ్రస్‌కు తోడవడం విశేషం. ఎమిరాటి సంస్కృతిని ప్రతిబింబించేలా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చరిత్ర, వారసత్వాలకు అద్దం పడుతూ చక్కని పనితనంతో, ఆకృతులతో ఈ డ్రస్‌ను ఎంతో కళాత్మకంగా రూపొందించారు.

బంగారం ప్రియులను అలరించేలా...

ఈ దుస్తులకు తగ్గట్టుగా రూపొందించిన బంగారం టియారా 398 గ్రాముల బరువుంటే, నెక్లెస్ ఏకంగా 8,810 గ్రాముల బరువుంది. ఇయర్ రింగ్స్ 134 గ్రాముల బరువున్నాయి. ఇలాంటి అత్యంత బరువైన, విలువైన బంగారం డ్రస్ రూపకల్పన... ప్రపంచ నాయకత్వాన్ని చాటుకోవాలనే యుఎఇ ఆశయం ప్రతిబింబించడంతో పాటు దుబాయ్ నగరం... బంగారు ఆభరణాల ప్రియుల ప్రధాన గమ్య స్థానంగా ప్రత్యేక గుర్తింపును కూడా పొందగలిగింది. షార్జాలో జరిగిన 56వ మధ్యప్రాచ్య వాచ్ అండ్ జ్యువెలరీ ప్రదర్శనలో భాగంగా పలు ఆభరణాల కంపెనీలు తమ ఆసక్తికరమైన ఉత్పత్తు లను ప్రదర్శించాయి. 500మందికి పైగా స్థానిక, అంతర్జాతీయ ప్రదర్శనకారులు పాల్గొనగా, ప్రపంచవ్యాప్తంగా 1800 మంది డిజైనర్లు, వర్తకులు వారి ఉత్పత్తులు ప్రదర్శించారు. వీటిలో దుబాయ్ డ్రస్‌తో పాటు మూడున్నర కోట్ల రూపాయల విలువైన గోల్డ్ ప్లేటెడ్ సైకిల్ కూడా ఉండడం చెప్పుకోదగిన విశేషం!



వినూత్నం

ప్రతి ఒక్కరిలో రహస్య నైపుణ్యాలు దాగి ఉంటాయి. వాటిని కనిపెట్టి మెరుగులు దిద్ది, ప్రతిభను చాటుకునే సామర్థ్యం కొందరికే ఉంటుంది. కేరళకు చెందిన బీట్ ఆఫీసర్, **బిస్మి విల్స్** కథే ఇందుకు ఉదాహరణ. అటవీ శాఖలో వృత్తి బాధ్యతలకే పరిమితమైపోకుండా, తనలోని కెమెరా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుని, కేరళ అటవీ శాఖ ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ ప్రయత్నాలకు నిదర్శనంగా మారిందామె. మరిన్ని వివరాలు...

అడవిలో ఫొటోగ్రాఫర్‌గా మారి..

తిరువనంతపురంలోని పరసాలకు చెందిన బిస్మి విల్స్. కేరళ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా ఎంపికైంది. పరీక్ష పాసై, ఉద్యోగానికి ఎంపికైంది కాబట్టి వృత్తిలో చేరాలనే ఆలోచనే తప్ప, వృత్తి పట్ల ఆమెకెలాంటి ఆసక్తి కలగలేదు. అయితే ఆమె పై అధికారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రియ టి.జోసెఫ్ మాటలు బిస్మిని ప్రభావితం చేశాయి. వృత్తిలో పైకి ఎదగాలంటే, వృత్తి పట్ల నిబద్ధత కలిగి ఉండాలనీ, మక్కువ పెంచుకోవాలనీ ప్రియ... బిస్మికి హితబోధ చేసింది. ఆ మాటలు బిస్మి మనసులో నాటుకుపోయాయి. అప్పటి నుంచి అడవిలో గస్తీ సమయంలో పరిసరాలను ఆసక్తిగా గమనించడం మొదలుపెట్టింది.

చుట్టూరా అందమైన ప్రకృతి, ఆసక్తి కలిగించే వన్యప్రాణులు, వాటి ప్రవర్తనలు ఆమెను ఆకట్టుకోవడం మొదలుపెట్టాయి. వాటిని జ్ఞాపకాల్లో బంధించడంతో పాటు, అటవీ శాఖకు ఉపయోగపడేలా కెమెరాలో బంధిస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే ఆలోచనతో ఒకడిఎస్ఎల్ఆర్ కెమెరా కొనుగోలు చేసింది బిస్మి. ఈ సందర్భం గురించి ప్రస్తావిస్తూ....'పంప ప్రాంతంలో విధులు నిర్వహించే సమయంలో అక్కడి చెట్ల ఆకులు నన్ను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఫీల్డ్ డ్యూటీలో భాగం వేర్వేరు చెట్లను గుర్తు పెట్టుకోవడం కోసం వాటి ఆకులను



సేకరించడం మొదలుపెట్టాను. ఆ తర్వాత నా ఆసక్తి సీతాకోకచిలుకల మీదకు మళ్లింది. వేర్వేరు జాతుల డేటాను సేకరించడం కోసం ఒక యాప్‌ను కూడా ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకున్నాను. అయితే చిన్న జాతుల మధ్య తేడాలను గుర్తించాలంటే వాటిని ఫొటోలు తీసుకోక తప్పదు. దాంతో నాది పాత ఫోన్ అవడంతో, ఒక డిజిటల్ కెమెరా కొనుక్కున్నాను" అంటూ తన కెమెరా ప్రయాణం తొలినాళ్ల గురించి వివరించింది బిస్మి.

నేర్పు, ఓర్పు అవసరం

పంప నుంచి వలక్కడువుకు బదిలీ అవడంతో బిస్మిలోని వన్యప్రాణుల ప్రేమి కురాలు మేలుకొంది. "పంపకు భిన్నంగా వలక్కడువులో ఏనుగులు, సాంబార్ డీర్.. ఇతర జంతువులు కనిపిస్తూ ఉండేవి. ఫారెస్ట్ వాచర్, అనుభవమున్న వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ విష్ణు నాకు తోడయ్యాడు. దాంతో ఇద్దరం కలిసి వన్యప్రాణులను వెతుక్కుంటూ కొండల మీద తిరగడం మొదలుపెట్టాం. ఏనుగుల వాసనను పసిగట్టి, వాటికి 250 మీటర్ల దూరానికి చేరుకుని, అందమైన ఫొటోలు తీయడం మొదలుపెట్టాం. జంతువుల దృష్టిలో పడకుండా ఎలా నడుచుకోవాలో, వాటికి భంగం కలగకుండా ఫొటోలు ఎలా తీయాలో, గాలి వీచే దిశ ఆధారంగా, నా ఉనికిని జంతువులు పసిగట్టే వీలు లేకుండా ఫొటోలకు తగిన ప్రదేశాన్ని ఎలా ఎంచుకోవాలో అతను నాకు నేర్పించాడు.

ఆ మెలకువల మీద పట్టు పెరిగిన తర్వాత, ఎన్నో మరపురాని ఫొటోలను తీయగలిగాను. ఎలుగుబంటి మీద దాడి చేసే అడవి కుక్కను ఫొటోలో బంధించగలిగాను. మేత మేస్తూ, గొడవ పడుతూ, ప్రేమ ప్రదర్శించుకునే పాతిక ఏనుగుల మందను ఫొటోలు తీయగలిగాను. అయితే ఫొటోల కోసం నేను చేసే ప్రతి ప్రయత్నం ఫలిస్తుందనే నమ్మకం ఉండదు. గంపెడు ఆశతో వెళ్లి, నిరుత్సాహంతో వెనుతిరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. గంటల తరబడి ఎదురుచూసి, ఖాళీ చేతులతో తిరిగొచ్చిన రోజులూ లేకపోలేదు. వన్యప్రాణుల ఫొటోగ్రఫీకి ఎంతో నేర్పు, ఓర్పు అవసరం" అంటూ ఫొటోలు తీయడంలో ఎదుర్కొన్న శ్రమల గురించి వివరిస్తోంది బిస్మి.

పులిని ఫొటో తీయాలి

"నా అంతిమ లక్ష్యం పులిని ఫొటోలు తీయడం. చాలాసార్లు వాటిని అనుసరించినా, కెమెరాలో బంధించే అవకాశం ఇప్పటివరకూ రాలేదు. పులులు సిగ్గరులు. అవి మనుషులకు దూరంగా ఉంటాయి. అయినా ఏదో ఒకనాటికి పులిని కచ్చితంగా కెమెరాలో బంధిస్తాను' అంటున్న బిస్మి, ప్రకృతి, వన్యప్రాణుల పట్ల ప్రేమతో అటవీ శాఖలో చేరుతున్న మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందనీ, అయితే ఈ వృత్తిలోకి అడుగుపెట్టే ప్రతి ఒక్కరూ అడవులు, వన్యప్రాణుల పట్ల మక్కువను పెంచుకోవడం అవసరమని అంటోంది. ఆమె తీసిన ఫొటోలు కేరళ అటవీ శాఖ డాటా సేకరణకు ఎంతో బాగా ఉపయోగపడుతున్నాయి. బిస్మి ఫొటోల వల్ల, అడవిలో వన్యప్రాణుల జీవనశైలి, వాటి మధ్య వైవిధ్యాలను ఆధారాలతో సహా ప్రదర్శించగలిగే అవకాశం కూడా దక్కుతూ ఉండడం చెప్పుకోదగిన విశేషం .



ఈ మహిళా కారాగారం... బతుకుల్ని మార్చే ఆశ్రమం

వివిధ కారణాలతో ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న వారి జీవితాల్లో మార్పు కోసం, సాధికారత కోసం కృషి చేస్తోంది రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం. ఈ సెమీ ఓపెన్ ప్రిజన్‌లో, ఆశ్రమంలాంటి వాతావరణంలో మహిళా ఖైదీలు... పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. కూరగాయల పెంపకం, పిండి వంటల తయారీ... ఇలా ఎన్నో మార్గాలతో జైలుకు ఆదాయాన్ని సమకూరుస్తూ, వేతనాలు సంపాదిస్తున్నారు. జైలు నుంచి విడుదలయ్యాక సొంతకాళ్ల మీద నిలబడి, స్వయంసమృద్ధి సాధించడానికి పునాదులు వేసుకుంటున్నారు.



కృషితో నాస్తి దుర్భిక్షం... ఇది పెద్దలు చెప్పిన మంచి మాట. కృషితో మంచి మార్పు కూడా సాధ్యమేనని రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారం అధికారులు రుజువు చేస్తున్నారు. మహిళా ఖైదీలకు చదువుతోపాటు పంటల సాగు, వంటల తయారీలో నైపుణ్యాలను అందించి, జైలు నుంచి వారు విడుదలయ్యాక... సొంత కాళ్ల మీద నిలబడేందుకు ఊతం ఇస్తున్నారు. దేశంలోని కొన్ని మహిళా కారాగారాల్లో ఓపెన్ ప్రిజన్ విధానం ప్రారంభమైనా, రకరకాల సమస్యలతో కొంత కాలానికే మూతపడ్డాయి. కానీ ఇక్కడ ఏడాదిన్నర నుంచి విజయవంతంగా అమలవుతోంది. ఆ జైలులోని మహిళా ఖైదీలు ఎన్నో రకాల పంటలు పండిస్తూ జైలుకు ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు వేతనాల రూపంలో తామూ సంపాదించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప, రాజమహేంద్రవరంలో మాత్రమే ప్రత్యేక మహిళా కారాగారాలు ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని కారాగారాన్ని ఆశ్రమం మాదిరిగా తీర్చిదిద్దారు. మహిళా ఖైదీల జీవన స్థితిగతులను మెరుగుపరచడం కోసం, శిక్ష పూర్తయ్యాక తక్కువ పెట్టుబడితో వ్యాపారం చేసుకొని జీవనోపాధి పొంపొందడం కోసం వారికి ఆసక్తి ఉన్న పనిలో తర్ఫీదు ఇస్తున్నారు. వారి నైపుణ్యాలను పదునుపెడుతున్నారు.

పూర్తి సేంద్రియంగా...

ఈ కారాగారంలో సెమీ ఓపెన్ ప్రిజన్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.. సాధారణంగా శిక్షపడిన, రిమాండ్ ఖైదీలను జైలు లోపల ఉంచుతారు. వాళ్లలో సత్ప్రవర్తనతో మెలిగే జీవిత ఖైదీలను జైలు ప్రాంగణంలో వివిధ అవసరాలకు వినియోగిస్తారు. ఇక్కడి ఓపెన్ ప్రిజన్ కోసం 27 మంది ఖైదీలను ఎంపిక చేశారు. వారిలో కొందరు విడుదల కాగా... ప్రస్తుతం 15 మంది ఉన్నారు. వీళ్లను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. ఈ జైలుకు చెందిన అయిదు ఎకరాల భూమి పూర్వం చిట్టడవి మాదిరిగా ఉండేది. దాన్ని సాగుకు అనువుగా మలిచారు. సుమారు రూ.1.50 లక్షలతో డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ భూమిలో అంజూర, షర్బత్ నిమ్మ, ఉసిరి, సీతాఫలం, వాటర్ యాపిల్, నారింజ, బత్తాయి, మామిడి, పనస, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, జామ తదితర పండ్ల మొక్కలను నాటారు. వంకాయ, బెండ, దోస, ఆనప, కాకర, గోరు చిక్కుడు, పందిరి చిక్కుడు, బీర, టమాట, దొండ లాంటి కూరగాయలతో పాటు ఆకు కూరలను జైలు సిబ్బంది పర్యవేక్షణలో మహిళా ఖైదీలు సాగు చేస్తున్నారు. వీరికి గతంలో ఎలాంటి వ్యవసాయ అనుభవం లేదు. ఉద్యానవన, అటవీ, వ్యవసాయ తదితర శాఖల సలహాలను పాటిస్తూ పూర్తి ప్రకృతి, సేంద్రీయ పద్ధతిలో పంటలను పండిస్తున్నారు. ట్రాక్టరు లాంటి యంత్రాలు లేకుండా సంప్రదాయ విధానాలను అనుసరిస్తూ... రోజుకు రూ.1500 వరకూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.



త్వరలో క్యాటరింగ్ సేవలు...

రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారంలో కవర్ల తయారీ యూనిట్, బేకరీ యూనిట్, టైలరింగ్ యూనిట్ ఉన్నాయి. వీటిలో తయారు చేసే పదార్థాలు, వస్త్రాలు, వస్తువులను జైలు బయట విక్రయిస్తారు. అలాగే రాగి మాల్ట్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి జైలు బయట చేసే ఆకు కూరలు, కాయగూరల విక్రయాలు అరగంటలో పూర్తయిపోతాయి. బేకరీ యూనిట్‌లో నాణ్యమైన దినుసులు ఉపయోగించి... స్వీట్లు చాక్లెట్లు, ఉస్మానియా బిస్కట్లు, ఫ్రూట్‌కేక్, బ్రెడ్, వాము పకోడి, కారప్పూస, జంతికలు, అటుకుల మిక్చర్, కార్న్ ఫ్లాక్స్ బూందీ, బెల్లం గవ్వలు లాంటివి తయారు చేసి బహిరంగ మార్కెట్ కంటే తక్కువకే విక్రయిస్తున్నారు. ఇవి నిల్వ ఉండడానికి, రుచి పెంచడానికి ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. పిండి వంటలు, బేకరీ ఐటమ్స్, టైలరింగ్, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రోజుకు రూ.5వేల వరకూ జైలుకు ఆదాయం సమకూరుతోంది. "ఇప్పటికే ఆర్డర్లపై పిండి వంటలు తయారుచేసి ఇస్తున్నాం. త్వరలో క్యాటరింగ్ సేవలు, స్వీట్ స్టాల్ కూడా ప్రారంభిస్తాం.



ఈ ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత బతుకుతెరువుకు ఇబ్బంది పడకుండా సమాజంలో గౌరవంగా జీవించాలనేదే మా ధ్యేయం. దీని వెనుక మా డీజీ, ఐజీ, డీఐజీల ప్రోత్సాహం చాలా ఉంది. మహిళా ఖైదీలతో వ్యవసాయం దిశగా అడుగులు వేయడంలో డీజీ హరీశ్ కుమార్ గుప్తా ఎంతో సహకరించారు. మా సిబ్బంది సహాయంతో మహిళా ఖైదీల జీవితాల్లో మెరుగైన మార్పులు రావడానికి కృషి చేస్తున్నాం" అంటున్నారు జైలు సూపరింటెండెంట్ వసంతకుమారి.

తారతమ్యాలు లేకుండా...

రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారంలో తారతమ్యాలకు తావు ఉండదు. ఏ పండుగ వచ్చినా అందరూ కలసిమెలసి చేసుకుంటారు. జైలు అధికారులు, సిబ్బంది కూడా భాగస్వాములవుతారు. ఎవరి ప్రార్థనాలయాలు వారికి ఉన్నాయి. రోజూ ఉదయం యోగాతో ఖైదీలు తమ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. తర్వాత కాసేపు ఇష్ట దైవారాధన చేసి, దైనందిన పనుల్లో నిమగ్నమవుతారు. వంటశాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుతారు. జైలు ఆవరణలో ఎటు చూసినా పచ్చదనం, అందమైన రంగవల్లులు కనువిందు చేస్తాయి. ఈ ప్రాంగణంలో ఆరు పడకల ఆసుపత్రి ఉంది. వైద్యులు నిరంతరాయంగా అందుబాటులో ఉంటారు. డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సులు చదివే సౌలభ్యం ఉంది. అధికారుల ప్రోత్సాహంతో 2008 నుంచీ ఇప్పటి వరకూ 32 మంది డిగ్రీ, ఇద్దరు పీజీ పూర్తి చేశారు. 2021-2024లో డిగ్రీ పూర్తి చేసిన డి.నాగరాజకుమారి బంగారు పతకం సాధించారు. ఈ కారాగారంలో అయిదు వేల పుస్తకాల గ్రంథాలయం కూడా ఉంది.

• పి.రమేశ్ నాగేంద్ర

వంటింటి వ్యర్థాలే బలం..!

మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి ఎరువులు అత్యవసరం. రసాయన ఎరువులకు బదులు వంటింటి వ్యర్థాలను ఉపయోగిస్తే మొక్కలు మరింత ఆరోగ్యంగా ఉంటాయి. వంటింటి వ్యర్థాలను సేంద్రీయ ఎరువులుగా ఎలా వాడాలో తెలుసుకుందాం...

- కోడిగుడ్డు పెంకుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది మొక్క పెరుగుదలకు తోడ్పడడమే కాకుండా పూలు, కాయలు అధికంగా ఉత్పత్తి కావడానికి దోహదం చేస్తుంది. కోడిగుడ్డు పెంకులను మెత్తగా పొడి చేయాలి. మొక్కల మొదళ్లలో కొద్దిగా తవ్వి, వేర్ల చుట్టూ ఈ పొడిని చల్లాలి. తరువాత యథావిధిగా మట్టిని పరచి కొన్ని నీళ్లు చిలకరించాలి. గుడ్డు పెంకుల పొడిని నీళ్లలో కలిపి రోజూ మొక్కల మొదళ్లలో పోసినా ప్రయోజనం కనిపిస్తుంది.



- అరటి పండు తొక్కలో అధికంగా ఉండే పొటాషియం, భాస్వరం లాంటి మూలకాలు.. పూల ఉత్పత్తిని పెంచుతాయి. అరటి తొక్కలను చిన్న చిన్న ముక్కలుగా చేసి ఒక ప్లాస్టిక్ బాటిల్‌లో వేయాలి. నిండా నీళ్లు పోసి మూతపెట్టి మూడు రోజులు అలాగే ఉంచాలి. తరువాత ఈ నీటిని మొక్కల మొదళ్లలో పోస్తే పువ్వులు గుత్తులు గుత్తులుగా వస్తాయి.



- ఆకు కూరల కాడలు, కూరగాయల వ్యర్థాలు.. సహజ ఎరువులుగా పనిచేస్తాయి. వీటిని మట్టిలో కలిపి మొక్కల మొదళ్లలో చల్లవచ్చు. లేదంటే మొక్కల మొదళ్లలో, చుట్టూరా కొద్దిగా తవ్వి వీటిని వేసి పైన మట్టితో కప్పవచ్చు.



- వాడేసిన టీ పొడిలో కొన్ని నీళ్లు పోసి వడకట్టాలి. ఈ పొడిని గట్టిగా పిండి కాగితం మీద వేసి బాగా ఆరబెట్టాలి. తరువాత ఈ పొడిని వారానికి ఒకసారి కొద్దికొద్దిగా తీసుకుంటూ మొక్కల మొదళ్లలో చల్లాలి. ఇలా చేయడం వల్ల పచ్చని ఆకులతో మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

పిల్లల విషయంలో జాగ్రత్త..!

నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లలపై రకరకాల ఆశలు పెట్టుకుంటున్నారు. వాటిని సాధించి తీరాలంటూ పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారు. దీని వల్ల పిల్లల మానసిక స్థితి ప్రభావితమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలను పెంచే క్రమంలో తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...



- పిల్లలందరి శక్తి సామర్థ్యాలు, ఆలోచన తీరు ఒకేరకంగా ఉండవు. కాబట్టి పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. అవసరమైన శిక్షణ ఇప్పించాలి.
- క్రమశిక్షణ పేరుతో పిల్లలకు కఠినమైన ఆంక్షలు పెట్టకూడదు. కేవలం చదువుకు మాత్రమే ప్రాముఖ్యమిస్తే పిల్లలు ఆటపాటల్లో రాణించలేరు. అంతేకాదు వాళ్లకు.. ఇతరులతో మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, పోటీ తత్త్వం అలవడవు.
- పిల్లలు ఏవైనా పొరబాట్లు చేస్తే వారిపై కోపం చూపించకూడదు. సామరస్యంగా వ్యవహరించి మంచి, చెడుల తారతమ్యాన్ని వివరించాలి.
- పరీక్షల్లో మార్కులు తగ్గాయనో, ఆటల్లో ఓడిపోయారనో పిల్లలను 'నీకేమీ చేతకాదు' అంటూ నిరాశ పరచకూడదు. దీనివల్ల పిల్లల ఆత్మ విశ్వాసం దెబ్బతింటుంది. మరో ప్రయత్నం చేసి అనుకున్నది సాధించేలా పిల్లలను ప్రోత్సహించాలి.
- పిల్లల ఇష్టాలు, ఆశయాలు తెలుసుకోకుండా చెప్పిన మాట వినాలంటూ ఒత్తిడి చేయకూడదు. పిల్లలు ఏవిధంగా ఆలోచిస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. పిల్లల అభిరుచులను గమనిస్తూ ఉండాలి. సమయం దొరికినప్పుడల్లా పిల్లలతో మాట్లాడుతూ ఉండాలి.
- పిల్లల మీద అతిగా ప్రేమ చూపిస్తూ వాళ్లు ఏమి చేసినా సమర్థించడం కూడా మంచిది కాదు. పిల్లలకు సమయపాలన, తోటివారితో స్నేహంగా ఉండడం, పెద్దలతో మర్యాదగా మెలగడం, సమయస్ఫూర్తి నేర్పించాలి. పోషకాహారం, వ్యాయామం, వ్యక్తిగత శుభ్రతల గురించి తెలియజెప్పాలి.

లోక్‌పాల్..ఇవేం విలాసాల్!

బీఎమ్‌డబ్ల్యూల కోసం భారత లోక్‌పాల్ టెండరు

- ఏడు కావాలి..రెండు వారాల్లో సరఫరా చేయాలి.. టెండరు నోటీసులో స్పష్టీకరణ
- ఒక్కొక్క కారు ధర సుమారు రూ.70 లక్షలు
- ఓ భారతీయ ఇంగ్లీష్ వెబ్‌సైట్ కథనం
- లోక్‌పాల్ నిర్ణయంపై విమర్శలు


లోక్‌పాల్ జస్టిస్ ఖాన్విల్కర్

న్యూఢిల్లీ, అక్టోబరు 21 : ఏడు హైఎండ్ లగ్జరీ కార్లను ఒక్కొక్కటి రూ.70 లక్షల చొప్పున భారత లోక్‌పాల్ కొనాలని నిర్ణయించారు. అయితే, ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి కట్టడికి నియమించిన లోక్‌పాల్ తన కోసం, ఇతర సభ్యుల కోసం ఇంత విలాసవంతమైన కార్లను కోరుతుండటం విమర్శలకు దారితీస్తోంది. ప్రముఖ కార్ల ఏజెన్సీలను దీనికోసం ఆహ్వానిస్తూ ఈ నెల 16వ తేదీన భారత లోక్‌పాల్ టెండరు నోటీసు జారీ చేశారని ఓ భారతీయ ఇంగ్లీష్ వెబ్‌సైట్ కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని అనుసరించి.. బీఎమ్‌డబ్ల్యూ థర్డ్ సిరీస్‌కు చెందిన 330 ఎల్‌ఐ మోడల్ కలిగిన కార్లను లోక్‌పాల్ ఎంపిక చేశారు. లాంగ్ వీల్ బేస్ (ఎల్‌డబ్ల్యూబీ) లైనప్, విలాసవంతమైన క్యాబిన్, విశాలమైన స్థలం, మెత్తని కుషన్ సీటింగ్, అధునాతన టెక్నాలజీ ఈ కార్ల ప్రత్యేకత. బీఎమ్‌డబ్ల్యూ వెబ్‌సైట్‌ను అనుసరించి..ఒక్కొక్క కారు ఎక్స్‌షో రూమ్ ధర రూ.60,45,000 కాగా, ఆన్‌రోడ్ ధర రూ.70 లక్షలు. కారు రంగు కూడా టెండరు నోటీసులో పేర్కొన్నారు. ప్రతి కారు తెలుపు రంగులోనే ఉండాలని నిర్దేశించారు. టెండర్లలో పాల్గొనే ఏజెన్సీలు రూ.10 లక్షలు చొప్పున డిపాజిట్‌ను ముందస్తుగా చెల్లించాలి. టెండరు విజేత రెండువారాల్లో వాటిని సరఫరా చేయాలి. లోక్‌పాల్ నియమించిన డ్రైవర్లు, సిబ్బందికి ఏడు రోజుల్లో ఆ కార్ల నిర్వహణ, డ్రైవింగ్‌కు సంబంధించిన శిక్షణ కూడా టెండరు విజేతే సమకూర్చాలి.

లోక్‌పాల్ వ్యవస్థను దిగజార్చారు

హై ఎండ్ లగ్జరీ కార్లను సమకూర్చుకోవాలన్న భారత లోక్‌పాల్ నిర్ణయాన్ని సీనియర్ న్యాయవాది, సామాజిక కార్యకర్త ప్రశాంత్ భూషణ్ మంగళవారం ఒక ప్రకటనలో తప్పుబట్టారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లోక్‌పాల్ వ్యవస్థను దిగజార్చిందని ఆయన మండిపడ్డారు. "లోక్‌పాల్ పోస్టును చాలాకాలం ఖాళీగా ఉంచారు. ఆ తర్వాత తమకు విధేయంగా ఉండేవారిని నియమించారు. లోక్‌పాల్‌కు అవినీతి గురించి చింత లేదు" అని విమర్శించారు రూ.5కోట్ల విలువైన లగ్జరీ కార్లను లోక్‌పాల్ సమకూర్చుకోవాలనుకోవడం సరికాదని తెలంగాణ కాంగ్రెస్ నేత సామా రామ్మోహన్ రెడ్డి విమర్శించారు.

సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వరయ్య

- జాతీయ కార్యదర్శిగా రామకృష్ణ ఎన్నిక

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా గుజ్జుల ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కె.రామకృష్ణ జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఒక ప్రకటనలో తెలిపారు. చండీగఢ్‌లో జరిగిన జాతీయ మహాసభల్లో రామకృష్ణను జాతీయ కార్యదర్శిగాను, మంగళవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈశ్వరయ్యను రాష్ట్ర కార్యదర్శిగాను ఎన్నుకున్నట్లు రాజా వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టులో ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహించిన సీపీఐ రాష్ట్ర మహాసభల్లోనే నూతన కార్యదర్శి ఎన్నికను పూర్తి చేయాల్సి ఉండగా... నాయకత్వం విషయంలో భిన్నాభిప్రాయాలు రావడంతో అప్పుడు వాయిదా వేశారు.

కొత్త 'అభయ్' ఎవరు?

మావోయిస్టు పార్టీ నుంచి ఆ పేరుతో ప్రకటనలు ఇస్తోంది ఎవరు?.. పోలీసు నిఘా వర్గాల ఆరా

- గతంలో ఆ బాధ్యతల్లో మల్లోజుల
- ఆయన లొంగుబాటు తర్వాత ఆ స్థానంలోకి తిప్పిరి తిరుపతి?
- ఆపరేషన్ కగార్ యుద్ధాన్ని నిరసిస్తూ 24న దేశవ్యాప్త బంద్
- మావోయిస్టు పార్టీ పిలుపు



ములుగు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు

హైదరాబాద్/చర్ల/ములుగు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వరుసగా అగ్రనేతల ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు జరుగుతున్నా.. మావోయిస్టు పార్టీ ఎప్పటికప్పుడు మీడియాకు, ప్రజలకు ప్రకటనలు విడుదల చేస్తూ తమ వైఖరిని స్పష్టం చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై పోలీసు నిఘా వర్గాలు ప్రస్తుతం ఆరా తీస్తున్నట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విడుదలవుతున్న పత్రికా ప్రకటనలను ఎవరు రాస్తున్నారు అనే దానిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. సుదీర్ఘకాలం పాటు మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ అధికార ప్రతినిధిగా కొనసాగిన మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ సోనూ.. అభయ్ పేరిట పత్రికా ప్రకటనలు విడుదల చేస్తుండేవారు. ఆయన ఇటీవల మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట భారీ సంఖ్యలో అనుచరులతో కలిసి, తుపాకులను కూడా సమర్పించి లొంగిపోయిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో మరో అగ్రనేత తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న ఛత్తీస్‌గఢ్‌లో అనుచరులతో లొంగిపోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో.. వీరిద్దరినీ విప్లవద్రోహులుగా ప్రకటిస్తూ, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పీడిత ప్రజల కోసం సాయుధపోరు కొనసాగుతుందని, దానికి కట్టుబడి ఉంటామని అభయ్ పేరిట మావోయిస్టు పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలో.. అభయ్‌గా బాధ్యతలు స్వీకరించింది ఏవరన్నదానిపై నిఘావర్గాలు ఆరా తీస్తున్నాయి. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ మరణం తర్వాత ఆ బాధ్యతలను తిప్పిరి తిరుపతి తీసుకున్నారని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో, కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగా ఆయనే వ్యవహరిస్తున్నారని, అభయ్ పేరిట ప్రకటనలు విడుదల చేస్తున్నారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరుపతి నియమితులయ్యారన్న ప్రచారంలో వాస్తవం లేకపోవచ్చునని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. తాజాగా ఆయుధాలతోసహా మావోయిస్టులు పెద్ద సంఖ్యలో లొంగిపోవడంతో ఆ పార్టీలో అంతర్మథనం జరుగుతోందని, ఇంకా లొంగుబాట్లు ఉంటాయా లేక పోరుబాట కొనసాగిస్తారా? పార్టీ పునర్నిర్మాణం చేయగలుగుతారా? అనువైన పరిస్థితులు లేనపుడు మిగతా వారి ఆలోచనలు ఏ విధంగా ఉన్నాయనే విషయాలను తెలుసుకోవడానికి నిఘావర్గాలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

24న దేశవ్యాప్త బంద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ ద్వారా మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులను హత్య చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిరసనవారాన్ని, 24న దేశవ్యాప్త బంద్ పాటించాలని మావోయిస్టు పార్టీ ప్రజలకు పిలుపునిచ్చింది. కేంద్రకమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఈ నెల 15వ తేదీన విడుదలైన ప్రకటన మంగళవారం వెలుగు చూసింది. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం జరుపుతున్న ఆపరేషన్ కగార్ యుద్ధంలో గత 22 నెలల్లో దేశవ్యాప్తంగా 700 మందిని హత్య చేశారని ఆరోపించారు. నారాయణపూర్‌లోని మాడ్, నేషనల్ పార్కు, కర్రెగుట్టలు, సుకుమా జిల్లాలో సాగుతున్న కగార్ యుద్ధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని అభయ్ లేఖలో పేర్కొన్నారు.

మావోయిస్టుల లొంగుబాటు

ములుగు జిల్లా పోలీసుల ఎదుట నలుగురు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శబరీశ్ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన మావోయిస్టు మిలీషియా కమాండర్ మడకం బండి, దళ సభ్యులు మడావి కోసి, మడావి ఎడుమే, తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన ముచకి దేవ లొంగిపోయారని తెలిపారు. వీరు కొన్నేళ్లుగా మావోయిస్టు పార్టీలో కొనసాగుతూ పలు ఘటనల్లో పాల్గొన్నారన్నారు. లొంగిపోయిన నలుగురికి తక్షణ సహాయం కింద రూ.25 వేల చొప్పున అందిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఆదివాసి ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం 'పోరు కన్నా ఊరు మిన్న-మన ఊరికి తిరిగి రండి' అనే నినాదంతో పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు ములుగు జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 84 మంది మాయిస్టులు లొంగిపోయారని, వీరిలో ముగ్గురు డీడీసీఎం, 11 మంది ఏసీఎం క్యాడర్ కాగా, 28 మంది పార్టీ సభ్యులు, 32 మంది మిలీషియా సభ్యులు, ఒకరు ఆర్పీసీ మెంబర్, ఇద్దరు డీఏకేఎవెస్/కేఏఎంఎస్ సభ్యులు, ఏడుగురు సీఎన్ఎం సభ్యులు ఉన్నారని వివరించారు.



కాలితో తొక్కిపెట్టి.. తన్ని.. వేద విద్యార్థిపై ఉపాధ్యాయుని క్రూరత్వం

- కర్ణాటకలోని చిత్రదుర్గలో ఘటన.. ఉపాధ్యాయుడి అరెస్టు

బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అవ్వతో ఫోన్‌లో మాట్లాడాడని వేద పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని వీరేశ్ హిరేమఠ్ అనే ఉపాధ్యాయుడు క్రూరంగా హింసించాడు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు ఉపాధ్యాయునిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకా నాయకనహట్టిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇక్కడి వేద అధ్యయన పాఠశాలలో ఉంటున్న తొమ్మిదేళ్ల విద్యార్థికి దీపావళి పండుగకు ముందు తన అవ్వ నుంచి ఫోన్ వచ్చింది. దీంతో అతను మాట్లాడాడు. అయితే హాస్టల్ సమీపంలో ఉన్న ఓ దుకాణం నుంచి ఆ విద్యార్థి తన అవ్వకు ఫోన్ చేశాడని భావించిన ఉపాధ్యాయుడు తోటి విద్యార్థుల సమక్షంలో ఆరా తీశాడు. తాను ఫోన్ చేయలేదని, తనకు అవ్వ ఫోన్ చేసినందుకే మాట్లాడానని ఆ విద్యార్థి తెలిపాడు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహానికి లోనైన ఉపాధ్యాయుడు వీరేశ్ హిరేమఠ్ ఆ విద్యార్థిని చితకబాదాడు. కింద పడ్డ విద్యార్థిని కాలితో విచక్షణారహితంగా తన్నాడు. తప్పించుకునే ప్రయత్నం చేయగా, ఓ కాలితో తొక్కిపట్టి మరోకాలితో తన్నాడు. ఈ దాడి దృశ్యాలు వైరల్ అయ్యాయి. దీంతో గురుతిప్పే రుద్రస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న ఈ వేద అధ్యయన పాఠశాలను స్థానికులు ముట్టడించారు. ఉపాధ్యాయుడు పరార్ అయ్యాడు. పోలీసులు గాలించి, ఆయనను మంగళవారం అరెస్టు చేశారు.

శ్రీవారి దర్శనం పేరిట వసూళ్లు

- దళారీ అరెస్టు.. ఏడాదిలో రూ.కోటికిపైగా లావాదేవీలు

తిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం, ఆర్జితసేవలు, వసతి పేరుతో భక్తులను మోసగిస్తూ తప్పించుకు తిరుగుతున్న అశోక్‌కుమార్ రెడ్డి అనే దళారీని తిరుమల పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఏడాది కాలంలో అతని బ్యాంకు ఖాతాల్లో రూ.కోటికిపైగా లావాదేవీలు జరిగినట్టు విచారణలో వెల్లడైంది. తిరుపతి జిల్లా చంద్రగిరి పాతపేటకు చెందిన బురిగాల అశోక్ అలియాస్ అశోక్‌కుమార్ రెడ్డి రాక్‌స్టార్ ఈవెంట్స్ ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన అమన్ గోయల్, గౌతమ్ గుప్తాకు వీఐపీ బ్రేక్ దర్శనం, కల్యాణోత్సవం, అభిషేకం, గదులు ఇప్పిస్తానని నమ్మించి రూ.4,16,500 నగదును విడతలవారీగా ఆన్‌లైన్ ద్వారా తన బ్యాంకు ఖాతాలో వేయించుకున్నాడు. తీరా ఆ భక్తులు తిరుమల చేరుకోగా అశోక్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో విజిలెన్స్ అధికారులను ఆశ్రయించి జరిగిన మోసాన్ని వివరించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా 16వ తేదీన తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే గోపాల్ నత్వల్ అగర్వాల్, రాధిక అనే భక్తులూ 17వ తేదీన నేరుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అశోక్‌పై ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో వన్, టూటౌన్ పోలీసులు ప్రత్యేక నిఘాతో అశోక్‌ను మంగళవారం అరెస్ట్ చేశారు. తిరుపతి రెండో కోర్టుకు తరలించారు. పోలీసుల విచారణలో అశోక్ అక్రమాలు వెలుగుచూశాయి. గడిచిన ఏడాదిలో రూ.కోటికిపైగానే బ్యాంకు లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. రాజకీయ నాయకుల పేర్లు చెప్పడంతో పాటు టీటీడీలో తనకు మంచి పరిచయాలున్నట్టు భక్తులను నమ్మించి మోసగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. కొన్నేళ్లుగా భక్తులను మోగిస్తూ లక్షల్లో వసూలు చేసినటు తేలింది. డీఎస్పీ విజయ్‌శేఖర్ మీడియాతో మాట్లాడారు. స్వామి దర్శనాలు, గదులు, సేవల పేరుతో అశోక్ భక్తులను మోగిస్తున్నాడని, భక్తుల నుంచి నగదు వసూలు చేసిన తర్వాత ఫోన్ ఆఫ్ చేసి పారిపోతున్నాడని వివరించారు. భక్తులు ఇలాంటి వ్యక్తులను నమ్మకూడదని, టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే దర్శనం, వసతి, సేవలు పొందాలని సూచించారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

వెంకీ సరసన శ్రీనిధి



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ తొలి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రంలో హీరోయిన్‌గా కన్నడ నటి శ్రీనిధి శెట్టిని ఎంపిక చేశారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఈ విషయాన్ని మంగళవారం చిత్ర నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని సంస్థ వెల్లడించింది. శ్రీనిధి నటించిన 'తెలుసు కదా' చిత్రం ఇటీవల విడుదలైన సంగతి విదితమే. వెంకటేశ్ నటించిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ రచన చేశారు. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతోంది.

సంక్రాంతికి శర్వా చిత్రం




వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలయ్యే చిత్రాల లిస్ట్‌లోకి మరో సినిమా చేరింది. శర్వానంద్ హీరోగా నటిస్తున్న 'నారీ నారీ నడుమ మురారి' చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర వెల్లడించారు. 'సామజవరగమన' చిత్ర దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి సందర్భంగా సాంప్రదాయ పంచెకట్టులో ఉన్న శర్వానంద్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసి విడుదల విషయాన్ని ప్రకటించారు నిర్మాతలు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. సాక్షి వైద్య, సంయుక్త కథానాయికలుగా నటిస్తున్నారు.

బైక్ రేసర్‌గా...



మోటార్ బైక్ రేసర్‌గా శర్వానంద్ నటిస్తున్న చిత్రానికి 'బైకర్' అనే పేరు నిర్ణయించారు. 1990- 2000 సంవత్సరాల బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకుడు. వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్‌ను, ఫస్ట్ లుక్‌ను దీపావళి సందర్భంగా విడుదల చేశారు. మాళవిక నాయర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం పూర్తి కావచ్చింది.

నవ్వుల నవాబు అస్రాని ఇకలేరు



ఉత్తరాది ప్రేక్షకులను తన నటనతో కడుపుబ్బా నవ్వించిన నవ్వుల నవాబు గోవర్ధన్ అస్రాని(84) కన్నుమూశారు. 'షోలే'లో కోట్లాది మందిని తన సహజ సిద్ధమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్న జైలర్ సాబ్ ఇక లేరు అని తెలియగానే బాలీవుడ్ విషాదంలో మునిగిపోయింది. అస్రాని నిష్క్రమణతో ఓ శకం ముగిసిందని సినీ అభిమానులు, ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య కారణాలతో నాలుగు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరిన అస్రాని, సోమవారం చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. అస్రాని చనిపోయే కొన్ని గంటల ముందు కూడా సోషల్ మీడియా వేదిక ద్వారా అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. 'నా అంత్యక్రియలకు ఎవ్వరినీ పిలిచి ఇబ్బంది పెట్టొద్దు, నేను ఒక కామన్‌మ్యాన్‌గానే వెళ్లిపోవాలి' అని భార్య మంజు అస్రానితో ఆయన చెప్పారట.

మలుపు తిప్పిన 'షోలే'

1941లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు గోవర్ధన్ అస్రాని. సినిమా నటుడు కావాలనే ఆశయంతో కెరీర్ ఆరంభంలో పలు గుజరాతీ చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించారు అస్రాని. ఆ తర్వాత ముంబైకి చేరుకుని పుణేలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నారు. 'హరే కాంచ్ కి చుడియాన్' ఆయన మొదటి హిందీ సినిమా. 'సత్యకం', 'గుడ్డి' సినిమాలు ఆయనకు నటుడిగా గుర్తింపు తెచ్చిపెట్టాయి. 'షోలే' సినిమాలో అస్రాని చేసిన జైలర్ పాత్ర ఆయన కెరీర్‌ను మలుపుతిప్పింది. ఆ సినిమాలో అస్రాని చెప్పిన పలు సంభాషణలను ప్రేక్షకులు ఇప్పటికీ గుర్తుంచుకోవడం విశేషం. ఈ జైలర్ పాత్రను హాలీవుడ్ కమెడియన్ చార్లీ చాప్లిన్ స్ఫూర్తితో తయారుచేసినట్లు ఆ చిత్ర దర్శకుడు రమేశ్ సిప్పీ ఓ సందర్భంలో తెలిపారు. 'అభిమాన్', 'ఛోటీ సీ బాత్', 'నమక్ హరామ్' వంటి చిత్రాల్లో ఆయన నటనను ప్రేక్షకులు విశేషంగా ఆదరించారు. కమెడియన్‌గా మెప్పిస్తూనే అన్ని రకాల పాత్రల్లో నటించారు. 1975లో విడుదలైన 'చైతాలి' చిత్రంలో ప్రతినాయకుడి పాత్రనూ పోషించారు. దర్శకుడు ప్రియదర్శన్‌తో ఆయన 'హేరా ఫేరీ', 'చుప్ చుప్ కే', 'గరం మసాలా' వంటి చిత్రాలు చేశారు. ప్రస్తుతం ప్రియదర్శన్ దర్శకత్వంలో అస్రాని నటిస్తున్న 'హైవాన్', 'భూత్ బంగ్లా' చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. ఆయన నటించిన ఏకైక తెలుగు చిత్రం మహేశ్‌బాబు తొలి చిత్రం 'రాజకుమారుడు' కావడం విశేషం. దర్శకుడుగా పలు సినిమాలు తెరకెక్కించారు. 1973లో 'ఆజ్ కీ తాజా' సినిమా సెట్స్‌లో సహ నటి మంజుతో ప్రేమలో పడి, ఆమెను వివాహం చేసుకున్నారు. వారికి పిల్లలు లేరు.



కె-ర్యాంప్‌ను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు

దిల్ రాజు

గతేడాది 'క' చిత్రం సక్సెస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నాను. ఇప్పుడు 'కె-ర్యాంప్' చిత్రం విజయోత్సవానికి అతిథిగా వచ్చాను. అనుభవజ్ఞులు, యువతరం కలసి పనిచేయడం, కిరణ్ లాంటి హీరో ఉండడం వల్ల ఈ సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు' అని నిర్మాత దిల్‌రాజు అన్నారు. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మక్ నిర్మించిన చిత్రమిది. ఇటీవలే విడుదల చక్కటి ఆదరణతో కొనసాగుతోన్న సందర్భంగా మంగళవారం చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'టెక్నీషియన్లందరూ ఈ సినిమాకు తమ బెస్ట్ ఇచ్చారు. నా నమ్మకాన్ని నిలబెడుతూ నా కెరీర్‌లో పెద్ద హిట్‌గా ఈ చిత్రం నిలిచింది' అన్నారు. 'కుటుంబ ప్రేక్షకులు మా చిత్రాన్ని అమితంగా ఆదరిస్తున్నారు. కిరణ్ గారితో మరిన్ని సినిమాలు చేస్తాను' అని రాజేశ్ దండా చెప్పారు.

కొత్త సింఫనీ రూపకల్పన



దీపావళి పండుగ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు, ఇసైజ్ఞాని ఇళయరాజా సరికొత్త విషయాన్ని వెల్లడించారు. 'సింఫనిక్ డ్యాన్సెస్' పేరుతో కొత్త సింఫనీని రూపొందించనున్నట్లు వెల్లడించారు. భారతీయ సంగీత ప్రతిభను ప్రపంచానికి చాటడానికి వెస్ట్రన్ క్లాసికల్ మ్యూజిక్‌లో అత్యంత క్లిష్టమైన 'సింఫనీ' రాసి దానికి 'వేలియంట్' అని నామకరణం చేసి గత మార్చి 8 న లండన్‌లోని 85 మంది సభ్యుల ప్రతిష్ఠాత్మక రాయల్ ఫిల్‌హార్మోనిక్ ఆర్కెస్ట్రాతో ప్రదర్శన ఇచ్చిన విషయం తెల్సిందే. వెస్ట్రన్ క్లాసికల్‌లో సింఫనీ రాసి లండన్‌లో ప్రదర్శన ఇచ్చిన తొలి భారతీయ సంగీత దర్శకుడిగా ఇళయరాజా చరిత్ర సృష్టించారు. ఈ నేపథ్యంలో తాజాగా 'సింఫనిక్ డ్యాన్సెస్' పేరుతో సరికొత్త సింఫనీని రాయనున్నట్టు దీపావళి పండుగ సందర్భంగా వెల్లడించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

గ్రామీణ నేపథ్యంలో



గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో సౌమ్యా చాందిని పల్లా నిర్మిస్తున్నారు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నటుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. సౌమ్యా చాందిని మాట్లాడుతూ 'నిజ జీవిత సంఘటనల ఆధారంగా 'రేలుగుంట సూరి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. గ్రామీణ జీవనశైలిని, భావోద్వేగాలను దర్శకుడు అద్భుతంగా ఆవిష్కరించారు' అని చెప్పారు. సంగీతం: సుభాశ్ ఆనంద్.

మూడేళ్ల కష్టం 'బైసన్'



'విక్రమ్ కొడుకును అవ్వడం వల్ల అన్నీ నాకు సులభంగానే దక్కాయి. ఆయనలా ప్రేక్షకుల ప్రేమను పొందేందుకు నా శాయశక్తులా కష్టపడతాను. 'బైసన్' చిత్రం కోసం మూడేళ్లు కష్టపడ్డాను. తమిళంలో ఈ సినిమాకు మంచి ఆదరణ దక్కింది. తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరించాలి' అని ధృవ్ విక్రమ్ కోరారు. ఆయన హీరోగా మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నిర్మాత వీపీ సెల్వన్ బాలాజీ ఈనెల 24న తెలుగులో విడుదల చేస్తున్నారు. చిత్ర కథానాయిక అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'మారి సెల్వరాజ్ దర్శకత్వంలో నటించాలనే కోరిక ఈ సినిమాతో తీరింది. ధృవ్‌తో కలసి నటించినందుకు గర్వంగా ఉంది' అని చెప్పారు.

దీపావళి అమ్మకాలు .. రూ.6 లక్షల కోట్లు

రికార్డు స్థాయిలో విక్రయాలు

50 లక్షల తాత్కాలిక కొలువులు: సీఏఐటీ



న్యూఢిల్లీ: ఈ ఏడాది దీపావళి రిటైల్ రంగానికి బాగానే కలిసొచ్చింది. ఈ పండగ సీజన్‌లో దేశ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో రూ.6.05 లక్షల కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.1.8 లక్షల కోట్లు ఎక్కువని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) తెలిపింది. దీనికి తోడు 50 లక్షల తాత్కాలిక కొలువులూ ఏర్పడ్డాయి. ఈ ఏడాది దీపావళికి నమోదైన రూ.6.05 లక్షల కోట్ల అమ్మకాల్లో 75 శాతం అమ్మకాలు నాన్-కార్పొరేట్, సంప్రదాయ మార్కెట్ల నుంచి నమోదైంది. మళ్లీ ఇందులో రూ.5.4 లక్షల కోట్లు వస్తువుల అమ్మకాల ద్వారా, రూ.65,000 కోట్లు సేవల ద్వారా నమోదైనట్లు సీఏఐటీ తెలిపింది. రాష్ట్రాల రాజధానులు, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని 60 ప్రధాన పంపిణీ కేంద్రాల కేంద్రాల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్టు పేర్కొంది.

జీఎస్‌టీతో బూస్ట్: ప్రభుత్వం జీఎస్‌టీ రేట్లను కుదించడం ఈ సంవత్సరం దీపావళి అమ్మకాలకు బాగా దోహదం చేసినట్టు 72 శాతం మంది వ్యాపారులు వెల్లడించటం విశేషం. జీఎస్‌టీ తగ్గింపుతో ఈ ఏడాది నిత్యావసరాలు, పాదరక్షలు, దుస్తులు, మిఠాయిలు, గృహాలంకరణ, వినియోగ వస్తువులు బాగా అమ్ముడుపోయాయి. ఈ అమ్మకాల జోరు ఈ ఏడాది చలి కాలం, పెళ్లిళ్ల సీజన్, సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి వరకు కొనసాగుతుందని సీఏఐటీ అంచనా. ఈ ఏడాది దీపావళికి నమోదైన రూ.6.05 లక్షల కోట్ల అమ్మకాల్లో 28 శాతం అమ్మకాలు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల నుంచి నమోదవడం విశేషం.

లక్ష కార్ల డెలివరీ
టాటా మోటార్స్

ఈ పండగల సీజన్ టాటా మోటార్స్‌కీ బాగానే కలిసొచ్చింది. ఈ ఏడాది దసరా నవరాత్రుల నుంచి దీపావళి వరకు లక్షకు పైగా కార్లను కొనుగోలుదారులకు డెలివరీ ఇచ్చింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 33 శాతం ఎక్కువని తెలిపింది. ఇందులో ఎస్‌యూవీలే 38,000 వరకు ఉన్నట్టు పేర్కొంది.

ఈ-కామర్స్‌దీ అదే బాట

ఈ దీపావళి ఈ-కామర్స్ దిగ్గజాలకూ బాగానే కలిసొచ్చింది. గత ఏడాది దీపావళితో పోలిస్తే ఈ ఏడాది దీపావళికి ఈ సంస్థల అమ్మకాల పరిమాణం 24 శాతం పెరిగింది. విలువపరంగా చూసినా 23 శాతం వృద్ధి రేటు నమోదైందని యూనికామర్స్ అనే సంస్థ తెలిపింది. ఇదే సమయంలో క్విక్ కామర్స్ కంపెనీల ఆర్డర్ల పరిమాణమైతే 120 శాతం పెరిగింది. బ్రాండ్ వెబ్‌సైట్ల అమ్మకాల్లోనూ 33 శాతం వృద్ధి రేటు కనిపించింది. ఈ దీపావళికి నమోదైన 15 కోట్ల ఆన్‌లైన్ ఆర్డర్లను పరిశీలించి యూనికామర్స్ సంస్థ ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది.

ఐటీలో మళ్లీ నియామకాల జోరు!

- కోలుకుంటున్న ఐటీ మార్కెట్
- హైదరాబాద్, విశాఖలపైనా కంపెనీల దృష్టి
- ఏఐ నిపుణులకు యమ గిరాకీ



ముంబై: భారత ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ (ఐటీ) రంగం క్రమంగా గాడిన పడుతోంది. నిన్న మొన్నటి వరకు అంతంత మాత్రంగా ఉన్న ప్రాజెక్టుల రాక కొద్దిగా ఊపందుకుంది. దీంతో ఐటీ కంపెనీలు మళ్లీ నియామకాలపై దృష్టి పెట్టాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలలతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి ఆరు నెలల్లో నియామకాలు 27 శాతం పెరిగాయి. కంపెనీలకు మానవ వనరుల (హెచ్ఆర్) సేవలు అందించే అడెకో ఇండియా ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో నియామకాలు మరింత జోరందుకుంటాయని ఈ సంస్థ అంచనా. ఐటీ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులు క్రమంగా పుంజుకోవడమే ఇందుకు ప్రధాన కారణం.

చిన్న నగరాలకూ వ్యాప్తి: ఐటీ కంపెనీలు గతంలో నియామకాల కోసం పెద్ద నగరాలపైనే దృష్టి పెట్టేవి. ఇప్పుడు క్రమంగా విశాఖపట్నం, ఉదయపూర్, నాగపూర్, కోయంబత్తూర్, ఇండోర్ వంటి చిన్న నగరాలపైనా దృష్టి పెడుతున్నాయి. దీంతో గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలతో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఈ చిన్న నగరాల నుంచి నియామకాలు 7 శాతం పెరిగినట్టు అడెకో ఇండియా నివేదిక తెలిపింది. అయినా కంపెనీలు ఇప్పటికీ బెంగళూరు, హైదరాబాద్, పుణె, ఢిల్లీ వంటి పెద్ద నగరాల నుంచే ఎక్కువ మందిని నియమించుకుంటున్నాయి. హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఐటీ నిపుణుల కోసం గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ).. ఐటీ కంపెనీలతో పోటీపడుతున్నాయి.

జీతాలూ పెరిగాయి: నియామకాలతో పాటు ఐటీ ఉద్యోగుల జీతాల్లోనూ ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 5 శాతం పెరుగుల కనిపించింది. ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ప్రత్యేక డొమైన్స్‌లో అవసరమైన నైపుణ్యాలు దొరకడం ఇప్పుడు కంపెనీలకు పెద్ద సమస్యగా మారింది. భారీ జీతాలు ఇస్తామన్నా సరైన నిపుణులు దొరకడం లేదు. ఈ డొమైన్లలో పట్టున్న నిపుణుల కొరత ప్రస్తుతం 45 నుంచి 50 శాతం వరకు ఉన్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు యాభై ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్టు అడెకో ఇండియా తెలిపింది.

ఫ్రెషర్లకు మంచి రోజులు

నిన్న మొన్నటి వరకు ఐటీ కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలు చాలా వరకు పక్కన పెట్టాయి. ప్రధాన కంపెనీలు కూడా ఇచ్చిన ఆఫర్లను సైతం ఏదో ఒక పేరుతో పక్కన పెట్టేవి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పరిస్థితి కొద్దిగా మారింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలలతో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలు 25 శాతం పెంచినట్టు అడెకో తెలిపింది. అయితే కంపెనీలు గతంలోలా అల్లాటప్పా కాలేజీలకు వెళ్లడం లేదు. మంచి పేరు ప్రతిష్ఠలున్న ఇంజనీరింగ్, టెక్నికల్ సంస్థలకు వెళ్లి ఫ్రెషర్లను తీసుకుంటున్నట్టు అడెకో ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప చెప్పారు. అది కూడా అన్ని విభాగాల వారికి కాకుండా కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి డొమైన్లలో ప్రాక్టికల్ నైపుణ్యాలు ఉన్న ఫ్రెషర్లకు మాత్రమే ఆఫర్ లెటర్లు ఇస్తున్నాయి. దీనికి తోడు గతంలోలా ఆఫర్ లెటర్లు ఇచ్చి శిక్షణ ఇవ్వడం కాకుండా తమకు అవసరమైన డొమైన్లలో కాలేజీల్లోనే శిక్షణఇచ్చి మరీ జాబ్స్‌లోకి తీసుకుంటున్నాయి.

తగ్గిన ఎన్ఆర్ఐ డిపాజిట్లు

ముంబై: మన బ్యాంకులకు ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) పంపే డిపాజిట్లు తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది ఏప్రిల్-జూలై మధ్య 580 కోట్ల డాలర్లుగా ఉన్న ఈ డిపాజిట్లు.. ప్రస్తుత సంవత్సరం ఇదే కాలంలో 470 కోట్ల డాలర్లకు పడిపోయాయి. దీంతో దేశంలోని బ్యాంకుల్లో ఎన్ఆర్ఐల డిపాజిట్లు గత ఏడాది జూలై నాటికి 16,823 కోట్ల డాలర్ల నుంచి ఈ ఏడాది జూలై నాటికి 16,786 కోట్ల డాలర్లకు పడిపోయినట్టు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తెలిపింది. ఎన్ఆర్ఐలు పంపించే ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (బ్యాంకు) డిపాజిట్లు తగ్గిపోవడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22న తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	553
చిత్తూరు	583	విశాఖపట్నం	545
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	126
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	115
కర్నూలు	112	నెల్లూరు	120
విశాఖపట్నం	129	అనంతపురం	120
గోదావరి	126		

టాటా ట్రస్ట్స్ ట్రస్టీగా వేణు శ్రీనివాసన్

మెహ్లీ మిస్త్రీ పునర్నియామకంపై సస్పెన్స్

న్యూఢిల్లీ: టీవీఎస్ గ్రూప్ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్.. టాటా ట్రస్ట్స్ జీవితకాల ట్రస్టీగా పునర్నియమితులయారు. ఈ నెల 17న జరిగిన సమావేశంలో టాటా ట్రస్ట్స్ దీనికి సంబంధించిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించినట్టు సమాచారం. గురువారంతో శ్రీనివాసన్ పదవీకాలం ముగుస్తుంది. టాటా ట్రస్ట్స్ ఈ లోపే ఆయన్ని మళ్లీ జీవిత కాలానికి ట్రస్టీగా పునర్నియమించడం విశేషం. ఇప్పుడు ఇక అందరి దృష్టీ షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు ప్రాతినిధ్యం వహిస్తున్న మెహ్లీ మిస్త్రీ పునర్నియామకంపై పడింది. ఈయన పదవీ కాలం ఈ నెల 28తో ముగుస్తుంది. టాటా ట్రస్ట్స్‌లో అంతర్యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

స్వల్ప లాభాలతో సంవత్ 2082కి స్వాగతం

సెన్సెక్స్ 63 పాయింట్లు. నిఫ్టీ 25 పాయింట్లు అప్

ముంబై: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన ముహూరత్ ట్రేడింగ్ మందకొడిగా సాగింది. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల నడుమ ఈక్విటీ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. సంవత్ 2082కు స్వాగతం పలుకుతూ మంగళవారం మధ్యాహ్నం 1.45 నుంచి 2.45 మధ్యలో నిర్వహించిన ప్రత్యేక ముహూరత్ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 62.97 పాయింట్ల లాభంతో 84,426.34 వద్ద ముగిసింది. ఒక దశలో సెన్సెక్స్ 84,665.44 పాయింట్ల గరిష్ఠ స్థాయిని, 84,286.40 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 25.45 పాయింట్ల లాభంతో 25,868.60 వద్ద క్లోజైంది. సంవత్ 2082 ప్రారంభమవుతున్న శుభ సమయాన ట్రేడర్లు, ఇన్వెస్టర్లు కొత్త పద్దు పుస్తకాలు తెరిచారు.

- బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.23% లాభంతో 46,787.20 వద్ద, స్మాల్‌క్యాప్ 0.91% లాభంతో 53,842.85 వద్ద ముగిశాయి. రంగాలవారీ సూచీల్లో ఇండస్ట్రియల్స్, టెలి కమ్యూనికేషన్, కమోడిటీస్, యంత్రపరికరాలు, సర్వీసెస్, మెటల్ సూచీలు లాభపడగా బ్యాంకెక్స్, రియల్టీ స్వల్పంగా నష్టపోయాయి.



ముహూరత్ ట్రేడింగ్ సందర్భంగా గంట కొట్టి ట్రేడింగ్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్

- సోమవారంతో ముగిసిన సంవత్ 2081లో సెన్సెక్స్ 4974.31 పాయింట్లు (6.26%), నిఫ్టీ 1637.8 పాయింట్లు (6.76%) లాభపడ్డాయి. సోమవారం సెన్సెక్స్ 411.18 పాయింట్లు, నిఫ్టీ 133.30 పాయింట్లు లాభపడ్డాయి.

నేడు మార్కెట్లకు సెలవు

బలిప్రతిపాద పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. ఫారెక్స్ మార్కెట్లు కూడా పని చేయవు. గురువారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

అరేబియన్ కన్‌స్ట్రక్షన్స్‌లో సింప్లీజిత్‌కు వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన సింప్లీజిత్ గ్రూప్.. అరేబియన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఏసీసీ) ఇండియా ఈక్విటీలో మెజారిటీ వాటా దక్కించుకుంది. అయితే ఎంత మొత్తంతో ఎంత ఈక్విటీ కొనుగోలు చేసిందనే విషయాన్ని మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ కొనుగోలు ద్వారా భారీ రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలవుతుందని సింప్లీజిత్ తెలిపింది. సింప్లీజిత్ గ్రూప్ ప్రస్తుతం ఫైనాన్స్, ఎగుమతుల రంగంలో ఉంది. కంపెనీ చేతిలో ప్రస్తుతం రూ.2,300 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,32,770 ▲	1,21,700 ▲	1,88,000 ▼
విజయవాడ	1,32,150 ▼	1,26,000 ▼	1,62,200 ▼
విశాఖపట్నం	1,30,850 ▼	1,19,950 ▲	1,88,000 ▼
రాజమండ్రి	1,30,580 ▼	1,19,700 ▼	1,74,000 ▼
ప్రొద్దుటూరు	1,32,200 ▼	1,21,620 ▼	1,68,000 ▼
ముంబై	1,27,633 ▼	1,16,912 ▼	1,63,050 ▼

స్పోర్ట్స్



అడిలైడ్ పిచ్‌పై యూవీ లైట్లు

ఆసీస్‌తో భారత్ రెండో వన్డేకు ముందు జాగ్రత్త చర్యలు

న్యూఢిల్లీ: ఆదివారం ఆతిథ్య ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య జరిగిన తొలి వన్డేకు వర్షం నాలుగుసార్లు అడ్డుపడింది. పెర్త్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌ను వరుణుడి కారణంగా 26 ఓవర్లకు కుదించాల్సి వచ్చింది. పదేపదే వర్షం అంతరాయంతో పచ్చికపై తేమ పెరగడం, పిచ్ పూర్తిగా బౌలర్లకు అనుకూలించడంతో ఓ దశలో టీమిండియా 45 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొనే గురువారం అడిలైడ్ ఓవల్ స్టేడియంలో జరిగే రెండో వన్డేకు అక్కడి గ్రౌండ్ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం అక్కడ కూడా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. పిచ్‌పై తేమ శాతం పెరగకుండా ఉండేందుకు అల్ట్రావైలెట్ లైట్ల (అతినీలలోహిత కాంతి)తో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక వేడితో కూడుకున్న వెలుతురు వచ్చే ఈ యూవీ లైట్లను పిచ్‌పై ఉంచుతున్నారు. ఇలా చేయడం వల్ల తేమశాతం తగ్గడమే గాకుండా పిచ్ పొడిగా ఉంటుంది. అయితే, రెండో వన్డే రోజు అక్కడ వర్షం కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ చెబుతోంది.

కెప్టెన్‌ను మళ్లీ మార్చారు

పాక్ వన్డే సారథి రిజ్వాన్‌కు ఉద్వాసన
షహీన్ షా అఫ్రిదికి పగ్గాలు



అఫ్రిది

కరాచీ: పాకిస్థాన్ క్రికెట్ సారథిని మరోసారి మార్చారు. ఈసారి వన్డే కెప్టెన్ రిజ్వాన్‌పై వేటుపడింది. వచ్చే నెల ఆరంభంలో దక్షిణాఫ్రికాతో మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌కు సీనియర్ పేసర్ షహీన్ షా అఫ్రిదికి సారథ్య బాధ్యతలు అప్పగించారు. వైట్‌బాల్ కోచ్ మైక్ హెస్సన్ సూచనల మేరకే నాయకత్వ మార్పు జరిగినట్టు తెలుస్తోంది. కోచ్‌గా హెస్సన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు మాత్రమే రిజ్వాన్‌తో కలిసి పనిచేశాడు. ఇంత తక్కువ సమయంలో కెప్టెన్‌పై హెస్సన్ ఇలాంటి అభిప్రాయానికి రావడంపై మాజీ ఆటగాళ్లు ఆశ్చర్యం వ్యక్తం చేసున్నారు. కానీ, కొందరు మాత్రం అసలు కారణాలు వేరే ఉన్నాయని చెబుతున్నారు. రిజ్వాన్‌లో మత మౌఢ్యం రోజురోజుకూ పెరిగిపోతోందని..డ్రెస్సింగ్ రూమ్‌లో ఆట గురించి కాకుండా మతపరమైన విషయాలు ఎక్కువగా మాట్లాడుతున్నాడని సమాచారం. రిజ్వాన్‌ను తప్పించాలన్న నిర్ణయం వెనుక సెలెక్షన్ కమిటీ, హైపర్ఫామెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావెద్‌తోపాటు పీసీబీ చైర్మన్, మాజీ కెప్టెన్లు మిస్బావుల్ హక్, సర్ఫరాజ్ ఖాన్‌ల ప్రమేయం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే పాలస్తీనా గురించి బహిరంగంగా మాట్లాడడం కూడా ఓ కారణం అంటున్నారు. ముఖ్యంగా బెట్టింగ్ కంపెనీలను తాను ఎండార్స్ చేయనని రిజ్వాన్ అన్నాడు. అయితే బెట్టింగ్ కంపెనీలతో ఒప్పందాలున్న పాక్ క్రికెట్ బోర్డుకు ఇది ఇబ్బంది కల్గించివుండవచ్చు.



దుబాయ్ రండి.. ట్రోఫీ ఇస్తా

తీరు మారని నఖ్వీ
పద్ధతి మార్చుకోవాలని బీసీసీఐ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఆసియా కప్ ముగిసి మూడు వారాలు దాటినా.. ట్రోఫీ మాత్రం విజేత భారత్ చెంతకు చేరలేదు. ఈ విషయంలో ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చీఫ్ మొహిసిన్ నఖ్వీని బీసీసీఐ మరోసారి తీవ్రంగా హెచ్చరించింది. ట్రోఫీని సరైన పద్ధతిలో భారత్‌కు చేర్చాలని డిమాండ్ చేస్తూ మెయిల్ చేసింది. ఇందుకు అఫ్ఘానిస్థాన్, శ్రీలంక బోర్డులు కూడా బీసీసీఐకి మద్దతుగా నిలిచాయి. అయితే, తీరు మారని నఖ్వీ.. ట్రోఫీ అప్పగిస్తానంటూనే కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. అదేంటంటే.. వచ్చేనెల 10న దుబాయ్‌లో ఓ ఈవెంట్‌ను ఏర్పాటు చేస్తామనీ, ఆ కార్యక్రమానికి భారత కెప్టెన్ సూర్యకుమార్ సహా జట్టు సభ్యులంతా రావాలని బీసీసీఐకి పంపిన లేఖలో కోరారు. ఆ ఈవెంట్‌లో తన చేతులమీదుగానే ట్రోఫీ అందిస్తానని అందులో వివరించారు. ఇదిలా ఉండగా.. వచ్చే నెలలో జరిగే ఐసీసీ సమావేశంలో నఖ్వీపై బీసీసీఐ ఫిర్యాదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఆసియా కప్ ఫైనల్లో పాక్‌ను ఓడించిన భారత్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

టాప్ లేపిన సఫారీలు

నేటి మ్యాచ్ — మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
ఆస్ట్రేలియా x ఇంగ్లండ్

- అదరగొట్టిన వొల్వార్ట్, కాప్
- 150 పరుగులతో పాక్ చిత్తు



లారా వొల్వార్ట్ (90)

కొలంబో: కెప్టెన్ లారా వొల్వార్ట్ (90) దూకుడైన ఇన్నింగ్స్‌కు మరిజానె కాప్ (68 నాటౌట్, 3/20) ఆల్‌రౌండ్ షో తోడుకావడంతో.. మహిళల వరల్డ్ కప్‌లో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసిన దక్షిణాఫ్రికా 10 పాయింట్లతో టాప్‌నకు చేరుకొంది. మంగళవారం జరిగిన వర్ష ప్రభావిత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 150 పరుగుల (డ/లూ పద్ధతి) తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ ఓటమితో పాక్ సెమీస్ ఆశలు ఆవిరయ్యాయి. వర్షం కారణంగా 40 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో తొలుత సౌతాఫ్రికా 9 వికెట్లకు 312 పరుగులు చేసింది. మెగా టోర్నీ చరిత్రలో సఫారీలకు ఇదే అత్యధిక స్కోరు. సునె లుస్ (61), డి క్లెర్క్ (41) అదరగొట్టారు. నష్రా సంధు, సాదియా చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం డక్‌వర్త్-లూయిస్ పద్ధతి ప్రకారం తొలుత పాక్ లక్ష్యాన్ని 40 ఓవర్లలో 306 పరుగులుగా నిర్ణయించారు. అయితే, పలుమార్లు వర్షం ఆటంకం కలిగించడంతో టార్గెట్‌ను 20 ఓవర్లలో 234 పరుగులకు కుదించారు. కానీ, ఓవర్లన్నీ ఆడిన పాక్ 83/7 స్కోరు మాత్రమే చేసింది.

బ్రిట్స్ విఫలం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. తన్జిమ్ బ్రిట్స్ (0) డకౌట్ అయింది. మరో ఓపెనర్ లారా, లుస్ రెండో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. ఆఖర్లో కాప్‌తోపాటు డి క్లెర్క్ మెరుపులు మెరిపించడంతో సౌతాఫ్రికా సులువుగా 300 మార్క్ దాటింది.

సంక్షిప్త స్కోర్లు: సౌతాఫ్రికా: 40 ఓవర్లలో 312/9 (లారా 90, కాప్ 68 నాటౌట్, లుస్ 61; నష్రా 3/45, సైదా 3/63); **పాకిస్థాన్:** 20 ఓవర్లలో 83/7 (సిద్రా 22 నాటౌట్, నటాలియా 20; కాప్ 3/20, షంగసె 2/19).

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
దక్షిణాఫ్రికా	6	5	1	0	10	0.276
ఆస్ట్రేలియా	5	4	0	1	9	1.818
ఇంగ్లండ్	5	4	0	1	9	1.490
భారత్	5	2	3	0	4	0.526
న్యూజిలాండ్	5	1	2	2	4	-0.245
శ్రీలంక	6	1	3	2	4	-1.035
బంగ్లాదేశ్	6	2	5	0	2	-0.578
పాకిస్థాన్	6	0	4	2	2	-2.651

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

- సోమవారం ముంబైలో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 7 పరుగులతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. తొలుత లంక 48.4 ఓవర్లలో 202 రన్స్‌కు ఆలౌటైంది. ఛేదనలో బంగ్లా ఓవర్లన్నీ ఆడి 195/9 స్కోరే చేసింది.

పంత్‌కు ఇండియా-ఎ పగ్గాలు



న్యూఢిల్లీ: స్వదేశంలో దక్షిణాఫ్రికా-ఎ జట్టుతో ఆడే రెండు 4డే మ్యాచ్‌లకు ఇండియా-ఎ బృందాన్ని బీసీసీఐ సీనియర్ సెలెక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు వికెట్‌కీపర్ రిషబ్ పంత్‌ను సారథిగా సెలెక్టర్లు నియమించారు. ఈ ఏడాది జూలైలో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా మాంచెస్టర్‌లో గాయపడిన పంత్ ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు.

కశ్మీర్ క్రికెటర్ పర్వేజ్ రసూల్ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ నుంచి ప్రాతినిధ్యం వహించిన తొలి క్రికెటర్‌గా రికార్డుకెక్కిన పర్వేజ్ రసూల్ తన కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. క్రికెట్‌లో అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్టు 36 ఏళ్ల రసూల్ ప్రకటించాడు. కుడిచేతివాటం ఆఫ్‌స్పిన్నర్‌గా 2014లో జాతీయ జట్టులో అరంగేట్రం చేసిన రసూల్ ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడాడు. బంగ్లాదేశ్‌తో ఆడిన ఆ మ్యాచ్‌లో పది ఓవర్లలో 60 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. ఇక, ఒకే ఒక టీ20ని 2017లో ఇంగ్లండ్‌తో ఆడాడు. ఆ మ్యాచ్‌లో 5 పరుగులు చేసిన అతను ఒక వికెట్ పడగొట్టాడు. ఇక, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్న రసూల్ 5,648 పరుగులు చేయడంతో పాటు 352 వికెట్లు పడగొట్టాడు. జాతీయ జట్టుకే గాకుండా ఐపీఎల్ తరఫున ప్రాతినిధ్యం వహించిన తొలి కశ్మీర్ క్రికెటర్‌గానూ రసూల్ నిలిచాడు. పుణె వారియర్స్, బెంగళూరు, సన్‌రైజర్స్ జట్లకు ఆడిన రసూల్ 11 మ్యాచుల్లో 4 వికెట్లు తీశాడు.

కేశవ్‌కు ఏడు వికెట్లు

- పాక్ 333 ఆలౌట్

రావల్పిండి: స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (7/102) విజృంభించడంతో.. దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 333 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (66) రాణించాడు. అనంతరం సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 185/4 స్కోరు చేసింది. మంగళవారం ఆట ఆఖరుకు ట్రిస్టన్ స్టబ్స్ (68), కైల్ వెరిన్నే (10) క్రీజులో ఉన్నారు. టోనీ డి జార్జ్ (55) హాఫ్ సెంచరీ సాధించాడు.

శాఫ్ క్రీడలకు వెంకట్రామ్, మోహిత్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దక్షిణాసియా అథ్లెటిక్స్ ఫెడరేషన్ (శాఫ్) పోటీల్లో తెలుగు క్రీడాకారులు వెంకట్రామ్ రెడ్డి (కర్నూలు), మోహిత్ చౌధురి (నాగర్‌కర్నూల్) భారత్ తరఫున బరిలోకి దిగుతున్నారు. గురువారం నుంచి రాంచీలో మూడ్రోజులపాటు జరిగే ఈ టోర్నీలో భారత్‌తో పాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మాల్దీవులు, అఫ్ఘానిస్థాన్ దేశాలు పోటీ పడనున్నాయి. పురుషుల 800 మీటర్ల పరుగులో వెంకట్రామ్, 5 వేల మీటర్ల పరుగు పోటీకి మోహిత్ అర్హత సాధించారు. ఇక, బహ్రెయిన్‌లో బుధవారం నుంచి జరిగే ఆసియా యూత్ గేమ్స్‌లో యశ్విత (శ్రీకాకుళం) హైజంప్‌లో భారత్ తరఫున పోటీ పడనుంది.

వెస్టిండీస్ 'సూపర్' విన్

మిర్పూర్: తొలి మ్యాచ్ నెగ్గి జోరుమీదున్న బంగ్లాదేశ్‌కు రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ ఝలకిచ్చింది. ఈ మ్యాచ్‌లో సూపర్ ఓవర్లో నెగ్గిన వెస్టిండీస్ సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. తొలుత బంగ్లాదేశ్ 7 వికెట్లకు 213 రన్స్ చేసింది. సౌమ్య సర్కార్ (45) టాప్‌స్కోరర్. మోటీ 3, అకీల్, అథనజె చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో కెప్టెన్ హోప్ (53 నాటౌట్) రాణించడంతో విండీస్ 9 వికెట్లకు 213 రన్స్ చేసి స్కోరు సమం చేసింది. దీంతో సూపర్ ఓవర్‌లో మొదట 10/1 చేసిన విండీస్.. తర్వాత బంగ్లాను 9/1కే పరిమితం చేసి పరుగు తేడాతో నెగ్గింది.

50 ఓవర్లూ స్పిన్నర్లతోనే..

ఈ మ్యాచ్‌తో వెస్టిండీస్ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో విండీస్ తరఫున బౌలింగ్ చేసిన ఐదుగురూ స్పిన్నర్లే కావడం విశేషం. ఇలా.. ఒక వన్డేలో మొత్తం 50 ఓవర్లనూ స్పిన్నర్లతోనే బౌలింగ్ చేయించిన తొలి జట్టుగా విండీస్ చరిత్ర సృష్టించింది. ఈ రికార్డు ఇంతకుముందు శ్రీలంక (1996లో 44 ఓవర్లు) పేరిట ఉండేది. మొత్తంగా ఈ మ్యాచ్‌లో 92 ఓవర్లు స్పిన్నర్లే వేశారు. దీంతో అంతకుముందు ఉన్న 78 ఓవర్ల రికార్డు చెరిగిపోయింది.

కివీస్‌కు ఇంగ్లండ్ ఝలక్

క్రైస్ట్‌చర్చ్: మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ 65 పరుగుల తేడాతో గెలిచింది. ఫిల్ సాల్ట్ (85), హ్యారీ బ్రూక్ (78) చెలరేగడంతో మొదట ఇంగ్లండ్.. 20 ఓవర్లలో 4 వికెట్లకు 236 పరుగుల భారీ స్కోరు సాధించింది. బెథెల్ (12 బంతుల్లో 24), ఆఖర్లో టామ్ బాంటమ్ (12 బంతుల్లో 29) వేగంగా ఆడారు. జేమీసన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో రషీద్ (4/32)తో పాటు మిగతా బౌలర్ల ధాటికి కివీస్ 18 ఓవర్లలో 171 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ సీఫెర్ట్ (39), శాంట్నర్ (36), చాప్‌మన్ (28) మినహా అంతా విఫలమయ్యారు. ల్యూక్ వుడ్, కార్స్, డాసన్ తలో రెండు వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా బ్రూక్ నిలిచాడు.

హరీశ్.. ఆరోపణలపై ప్రమాణం చేస్తారా?

- సిద్దిపేట వేంకటేశ్వర ఆలయానికి వెళ్దాం
- బేషరుతుగా క్షమాపణ చెప్పాలి: మంత్రి అడ్లూరి
- కవిత వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించాలని డిమాండ్



హైదరాబాద్/ధర్మపురి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం, కేబినెట్ భేటీపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఖండించారు. మంగళవారం గాంధీభవన్, సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేబినెట్ సమావేశంలో వ్యక్తిగత అంశాలు చర్చించలేదని ప్రమాణం చేస్తా. హరీశ్‌రావుకు సెంటిమెంట్‌గా భావించే సిద్దిపేట వేంకటేశ్వర ఆలయంలో ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా? నేను ప్రమాణం చేస్తా.. నీవు ఆరోపించిన విషయాలు నిజమని ప్రమాణం చేయగలవా?' అని మంత్రి అడ్లూరి మాజీ మంత్రి హరీశ్ రావుకు సవాల్ విసిరారు. కేబినెట్ భేటీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ.. మంత్రులను దండుపాళ్యం బ్యాచ్‌గా పేర్కొనడం దుర్మార్గం అని, హరీశ్‌రావు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు.. కవిత తమ నాన్న ఇంద్రుడు, చంద్రుడు అంటూనే.. దోచుకున్నారు, దాచుకున్నారని, ముంచివేశారని చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. సోమవారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఆయన మాట్లాడుతూ.. కమీషన్లకు కేరాఫ్ అడ్రస్‌గా కేసీఆర్ ఫ్యామిలీ ఉందని ఆరోపించారు.

పార్టీలో మేం వలసదారులం కాదు.. పట్టాదారులం

- ఫిరాయింపుదారులకు పదవులు కట్టబెట్టడమేంటి
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసి జీవన్‌రెడ్డి ఆవేదన

జగిత్యాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్‌లో మేము వలసదారులం కాదు. పట్టాదారులం" అని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత టీ. జీవన్‌రెడ్డి అన్నారు. దశాబ్దకాలంగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు కాకుండా వేరే పార్టీ నుంచి వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. జగిత్యాలలో ఫిరాయింపుదారులకు పదవులు కట్టబెట్టుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను జీవన్‌రెడ్డి కలిసి పలు రాజకీయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికే ప్రాధాన్యమిస్తామని అధిష్ఠానం చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదని జీవన్‌రెడ్డి ఆరోపించారు. బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి దేవస్థాన అభివృద్ధి కమిటీ పదవులను ఫిరాయింపుదారులకు కట్టబెట్టారని విమర్శించారు. కాగా, జీవన్‌రెడ్డి ఆవేదనను అధిష్ఠానానికి వివరిస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఆస్పత్రుల డైట్ బిల్లులు చెల్లించండి

- సర్కార్‌కు డైట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ లేఖ

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బోధనాస్పత్రులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో 8 నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని తెలంగాణ డైట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్యశాఖ కార్యదర్శి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, వైద్యవిద్య సంచాలకులు, టీవీవీపీ కమిషనర్‌కు లేఖలు రాసింది. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు ఒక్క డీఎంఈ పరిధిలోనే రూ.8.29 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆ లేఖలో పేర్కొంది. అలాగే టీవీవీపీ పరిధిలో మూడు నెలల డైట్ బిల్లులు ఆగిపోయాయని తెలిపింది. ఆ ఆస్పత్రుల పరిధిలో రూ.1.50 కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొంది. బిల్లులు చెల్లించకపోతే డైట్ సరఫరా చేయలేని పరిస్థితుల్లో ఉన్నట్లు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. 8 నెలలుగా ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవడంతో నిత్యావసరాలు, సరుకులు, గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే వ్యాపారులకు చెల్లింపులు ఆగిపోయాయని పేర్కొన్నారు. అప్పులు చేసి, వడ్డీలు కట్టలేక తాము ఆర్థికంగా చితికిపోయామని డైట్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ నేత శ్రీనివాస్ తెలిపారు.

బంగారం దొంగపై పి.డి.చట్టం సబబే: హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగల దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడడంతో పాటు, అడ్డు వచ్చిన వారిపై దాడులు చేస్తున్నాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడిపై ముందస్తు నిర్బంధ చట్టం (పీడీ యాక్ట్) కింద కేసు పెట్టడం సబబే అని హైకోర్టు పేర్కొంది. అతడిని ముందస్తుగా అరెస్టు చేయడం సరైనదేనని జస్టిస్ మౌషుమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌ల ధర్మాసనం తెలిపింది. పోలీసుల అదుపులో ఉన్న తన కుమారుడు నాజిమ్ అజీజ్ కొటాడియా(నిందితుడు)ను విడుదల చేసేలా ఆదేశించాలని కోరుతూ అతడి తండ్రి అజీజ్ హసన్ హైకోర్టులో దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. నిందితుడు పలు దుకాణాల్లో దోపిడీకి పాల్పడటంతో పాటు, మేడ్చల్‌లో ఓ దుకాణం యజమానిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని పోలీసుల తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే అతడిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అరెస్ట్ చేసి చర్లపల్లి కేంద్ర కారాగారానికి పంపినట్లు తెలిపారు. నిందితుడికి నేరాలు అలవాటుగా మారాయని, వాటిని నివారించడానికే గూండాగా పరిగణించి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. నిందితుడి చర్యల వల్ల సమాజంలో శాంతికి భంగం కలిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం సబబే అని పేర్కొంది.

కొల్లాపూర్ పోలీసుల థర్డ్ డిగ్రీపై విచారణకు ఆదేశం

ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన వ్యక్తిపై కొల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని నాగర్‌కర్నూల్ ఎస్పీకి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కొల్లాపూర్ మండలం మూలచింతలపల్లి గ్రామానికి చెందిన బాలరాజు అనే వ్యక్తి ఓ వివాదానికి సంబంధించి ఫిర్యాదు ఇవ్వడానికి ఆ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఎస్సై, కానిస్టేబుళ్లు తనపైనే దాడి చేశారంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు.. ఘటనపై విచారణ చేపట్టాలని ఎస్పీకి ఆదేశాలు జారీచేయడంతోపాటు సీసీటీవీ ఫుటేజ్ సమర్పించాలని స్పష్టంచేసింది. కాగా, ఓ వివాదానికి సంబంధించి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని ఆరోపిస్తూ లొంగిపోయిన నక్సలైట్ వాసం తులసమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే చట్టప్రకారం సంబంధిత మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలే తప్ప నేరుగా రిట్ పిటిషన్ దాఖలు చేయడం చెల్లదంటూ హైకోర్టు దానిని కొట్టివేసింది.

31న మెడికల్ టీచర్స్ కాంట్రాక్టు పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి ప్రభుత్వ వైద్య కళాశాలలో 48 బోధనా సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 31న వాక్ ఇన్ ఇంటర్వ్యూల ద్వారా ఆ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. అసోసియేట్ ప్రొఫెసర్లు 5, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 23, సీనియర్ రెసిడెంట్లు 14, ట్యూటర్ల పోస్టులు ఆరు ఉన్నట్లు వెల్లడించారు. కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య వాక్ ఇన్ ఇంటర్వ్యూలు జరుగుతాయని, మరిన్ని వివరాలకు అభ్యర్థులు కాలేజీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఫార్మసీలో 97 శాతం సీట్లు భర్తీ

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కోర్సుల్లో సీట్ల భర్తీకి సంబంధించిన ఎప్‌సెట్ తుది విడత కౌన్సెలింగ్ ముగిసింది. ఎంపికైన వారి జాబితాను ఎప్‌సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం విడుదల చేశారు. మొత్తం 10,960 సీట్లలో 10,595 (97%) భర్తీ కాగా 365 మిగిలాయి. మొత్తం 71,309 మంది కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు. 16,336 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరవగా, 15,192 మంది ఆప్షన్లు ఎన్నుకున్నారు. బి-ఫార్మసీలో 8,175 సీట్లు భర్తీ కాగా 348 మిగిలాయి. అలాగే ఫామ్-డిలో 1,671 సీట్లు భర్తీ కాగా 11, ఫార్మాస్యుటికల్ ఇంజనీరింగ్‌లో 116 భర్తీ కాగా 6 మిగిలాయి. బయో మెడికల్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీలో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. ఎంపికైనవారు ఈ నెల 22లోపు ఫీజు చెల్లించాలని, 23లోపు కాలేజీలో టీసీ, ఇతర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని శ్రీదేవసేన తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో భారీగా నామినేషన్లు

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలయ్యాయి. చివరిరోజైన మంగళవారం ఒక్కరోజే 160 మందికిపైగా నామినేషన్లు వేశారు. ఈ నెల 13న నామినేషన్ల స్వీకరణ మొదలవగా 18 వరకు 94 మంది అభ్యర్థులు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఆదివారం, దీపావళి పండుగతో రెండు రోజులు సెలవు దినాలు కావడంతో నామినేషన్ల స్వీకరణ జరగలేదు. చివరి రోజైన మంగళవారం అభ్యర్థులు పోటెత్తారు. పలు అంశాల విషయంలో ప్రభుత్వంపై నిరసన తెలిపే వేదికగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను వినియోగించుకుంటున్నారు. అయితే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే నామినేషన్ల దాఖలుకు



నామినేషన్‌కు ముందు ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోయిన రైతుల నిరసన

అవకాశముండటం, అభ్యర్థులు పెద్దసంఖ్యలో రావడంతో అధికారులు టోకెన్ విధానం ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసేవారికి ముందు టోకెన్ ఇచ్చి.. అనంతరం నామపత్రాలు స్వీకరించారు. 188 మందికి టోకెన్లు ఇచ్చారు. రాత్రి 12 గంటల వరకు 160 నామినేషన్లు దాఖలు కాగా, ఆ తరువాత కూడా ప్రక్రియ కొనసాగింది. దీంతో మొత్తం నామినేషన్ల సంఖ్య 250కి పైగా నమోదయ్యే అవకాశం ఉంది.

మూకుమ్మడి నామినేషన్లు..

నామినేషన్లు దాఖలు చేసిన వారిలో రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), ఫార్మాసిటీ భూనిర్వాసితులు, నిరుద్యోగులు ఉన్నారు. ఫార్మాసిటీ కారణంగా భూములు కోల్పోతున్న రైతులు ఎన్నికల కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. 11 మంది రైతులు నామినేషన్‌లు వేశారు. ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోయిన రైతులు కూడా మూకుమ్మడిగా నామినేషన్లు వేసేందుకు వచ్చారు. కాగా, ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల సంఘాల జేఏసీ నుంచి 30 మంది నామినేషన్‌లు వేశారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సమితి నుంచి 11 మంది నామినేషన్‌లు దాఖలు చేశారు. భారీగా నామినేషన్లు దాఖలు కావడం ప్రధాన పార్టీలకు వణుకు పుట్టిస్తోంది. ఎక్కువ మంది బరిలో ఉంటే.. వారికి ఏ గుర్తులు కేటాయిస్తారు, ఆ ప్రభావం ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నామినేషన్ల పరిశీలన బుధవారం జరగనుంది. 24 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశముంది. అభ్యర్థుల సంఖ్య 63 దాటితే బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం వర్గాలు పేర్కొన్నాయి. ఒక కంట్రోల్ యూనిట్ 4 బ్యాలెట్ యూనిట్లను సపోర్ట్ చేస్తుంది. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌లో 16 చొప్పున 64 మంది అభ్యర్థుల పేర్లు ఉంటాయి. నోటా మినహాయిస్తే.. 63 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశమున్న దృష్ట్యా.. అంతకంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే బ్యాలెట్ పోరు తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేతలంతా అక్కడే!

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీలతోపాటు సీనియర్లు, అనుబంధ విభాగాల నాయకులకు బాధ్యతలు అప్పగించాయి. మంగళవారం నామినేషన్‌ల దాఖలు పర్వం ముగియగా.. ఇక ప్రచారపర్వం జోరందుకోనుంది. కాంగ్రెస్ పాలనకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లిట్మస్ టెస్టుగా మారడంతో.. సీఎం రేవంత్‌రెడ్డి దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. రెండు నెలల క్రితమే మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వారికి సహకారం అందించేందుకు డివిజన్ల వారీగా వివిధ కార్పొరేషన్ల చైర్మన్లను ఇన్‌చార్జులుగా నియమించారు. రెండు నెలలుగా వారు నియోజకవర్గ ఓటర్లను కలుస్తూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నారు. వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ఇతర మంత్రులు కూడా సమయం చూసుకుని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మంత్రి సీతక్క మంగళవారం బోరబండలో ప్రచారం నిర్వహించారు. మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు తాము ప్రభావితం చేయగలిగిన ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

రంగంలోకి కేసీఆర్..!

బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగే అవకాశాలున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్‌రావు ఇప్పటికే ప్రచార పర్వాన్ని పర్యవేక్షిస్తుండగా, ఒకటి రెండు సభలకు కేసీఆర్ హాజరయ్యే అవకాశం ఉందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ వెల్లడించిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో కేసీఆర్ పేరు ఉండడం ఆసక్తికరంగా మారింది. ఈ జాబితాలో ఇంకా కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరులు కూడా ఉన్నారు. సెంటిమెంటు, సానుభూతి అంశం తమకు కలిసి వస్తుందన్న ధీమాతో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. ఇప్పటికే మూడు, నాలుగు చోట్ల బహిరంగ సభలు నిర్వహించిన పార్టీ అగ్ర నాయకులు, ఇంటింటి ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మిగతా పార్టీల కంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన బీఆర్ఎస్.. ప్రచార పర్వాన్ని కూడా అదేరీతిన కొనసాగిస్తోంది. ముఖ్యనేతలకు డివిజన్ల వారీగా, ప్రతి 6వేల ఓటర్లకు ఒక నాయకుడికి బాధ్యతను అప్పగించింది.

బీజేపీ ప్రచారానికి కేంద్ర మంత్రులు..

బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి మద్దతుగా కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, బండి సంజయ్, అర్జున్‌రాం మేఘవాల్, శ్రీనివాస వర్మ, ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, తేజస్వి సూర్య, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, ఆర్.కృష్ణయ్య, జి.నగేశ్, పురందేశ్వరి ప్రచారం చేయనున్నారు. కాగా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ ఉన్న నేపథ్యంలో ఆయన ఇప్పటికే పార్టీ క్యాడర్‌తో పలుమార్లు సమీక్షలు నిర్వహించి ప్రచారాన్ని వ్యూహాత్మకంగా కొనసాగిస్తున్నారు. ఏడుగురు ఎమ్మెల్యేలకు నియోజకవర్గంలోని ఏడు డివిజన్ల బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన పలువురు సీనియర్ నాయకులకు పోలింగ్ బూత్, శక్తి కేంద్రాల బాధ్యతలు అప్పగించారు. ప్రచార సరళికి సంబంధించి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఇప్పటికే పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేశారు. బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్, ఎంపీ రఘునందన్ రావు, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌతం రావు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఇక ప్రచారానికి రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ హాజరుకానున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

హోటళ్లు.. ఓయో రూమ్‌లు ఫుల్!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం కోసం మూడు ప్రధాన పార్టీలు తమ ముఖ్య నేతలు, కార్యకర్తలను హైదరాబాద్‌లోనే మోహరించడంతో.. నియోజకవర్గంలోని హోటళ్లు, ఓయో రూమ్‌లను గంపగుత్తగా నెల రోజులపాటు బుక్ చేసుకున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలకు ఇక్కడ నివాసాలు ఉండడంతో ప్రతి రోజూ జూబ్లీహిల్స్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. మూడు పార్టీలకు చెందిన వేలాది మంది కార్యకర్తలను రంగంలోకి దింపడంతో స్థానికంగా ఉన్న టిఫిన్ సెంటర్లు, భోజన హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం-రాత్రి భోజనాలు అందించేందుకు పలు ఫంక్షన్‌హాళ్లను ఓ పార్టీ నేతలు మాట్లాడుకున్నట్లు తెలిసింది. లేదంటే ఒక చోట వంటలు చేసి.. బూత్‌ల వారీగా ఏర్పాటు చేస్తున్న పార్టీ కార్యాలయాల వద్దకు టిఫిన్లు, భోజనాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మరో పార్టీ నేతలైతే.. వివిధ ప్రాంతాల వారీగా టిఫిన్ సెంటర్లు, హోటళ్లతో మాట్లాడుకొని అక్కడి నుంచి కార్యకర్తలకు, నేతలకు టిఫిన్లు, భోజనాలు అందించడానికి కసరత్తు చేస్తున్నారు.



బాహాబాహీకి దిగిన కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నేతల బాహాబాహీ

- ఓటరు జాబితాపై ఇద్దరు నేతల ఘర్షణ

బోరబండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా విషయంలో ఇద్దరు నేతల మధ్య చోటుచేసుకున్న వివాదం.. తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నువ్వెంత.. అంటే నువ్వెంత అంటూ ఒకరినొకరు అసభ్యపదజాలంతో దూషించుకోవడం, ఒకానొక దశలో తోపులాటతోపాటు బాహాబాహీకి దిగడంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. హైదరాబాద్ రహమత్‌నగర్ డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్ బస్తీలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఎస్పీఆర్ హిల్స్‌లోని రాజీవ్‌గాంధీనగర్, ఆరోగ్యనగర్ బస్తీల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నాయకులు ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం తర్వాత మంత్రి, అభ్యర్థి, కార్పొరేషన్ చైర్మన్లు వెళ్లిపోగా, రాజీవ్‌గాంధీనగర్ బస్తీ అధ్యక్షుడు శాంతికుమార్ నివాసంలో నాయకులు, కార్యకర్తలు భోజనాలు చేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని కొన్ని బూత్‌లకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మాదాపూర్ డివిజన్ నేత దేవావత్ నగేష్ నాయక్.. అక్కడకు రాగా.. ఓటరు జాబితా విషయంలో తనపై ఫిర్యాదు చేస్తావా? అంటూ బస్తీ నాయకుడు ఎత్తరి అంతయ్య వాగ్వాదానికి దిగారు. సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి పంపితేనే ఇక్కడ ప్రచారానికి వచ్చానని, తనతో అసభ్యంగా మాట్లాడొద్దని నగేష్ వారించినా.. అంతయ్య వినిపించుకోలేదు. నగేష్ నాయక్‌పై దాడికి ప్రయత్నించారు. ఘటనపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామంటూ నగేష్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పోలింగ్ నాడు ప్రకటనలకు అనుమతి తప్పనిసరి: సీఈవో

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా పోలింగ్ రోజు, ఆ ముందు రోజు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చే రాజకీయ పార్టీలు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ముందస్తు అనుమతి తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే, వారిని మభ్యపెట్టే ప్రకటనలను నిరోధించే ఉద్దేశంతోనే ఈ నిబంధన ప్రవేశపెట్టామని ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రకటనలను ప్రచురించడానికి కనీసం రెండు రోజుల ముందుగానే ఎంసీఎంసీకి దరఖాస్తు చేయాలని, తద్వారా సమీక్షకు తగిన సమయం ఉంటుందని పేర్కొన్నారు. ఈసీ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతివ్వండి

కోదండరాంకు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ లేఖ

బీఆర్ఎస్ ఓ దండుపాళ్యం ముఠా: చామల

హైదరాబాద్, బేగంపేట, అక్టోబరు 21(ఆంధరజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మంగళవారం లేఖ రాశారు. 22 నెలలుగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలన కొనసాగుతోందని, ఈ తరుణంలో ఉప ఎన్నిక అత్యంత కీలకంగా మారిందన్నారు. ఈ ఎన్నికలో బీఆర్ఎస్‌ను ఓడించడం కాంగ్రెస్‌ను గెలిపిచడం అందరి బాధ్యతని తెలిపారు. నవీన్ యాదవ్‌కు టీజేఎస్ తరఫున సంపూర్ణ మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాలలో సోమవారం దీపావళి వేడుకలు చేసుకున్నారు. అక్కడి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టి, వారితో కలిసి బాణసంచా కాల్చారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థి డిపాజిట్ గల్లంతవుతుందనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు గల్లీగల్లీ తిరుగుతున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గాంధీభవన్ వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడిన చామల.. బీఆర్ఎస్ ఓ దండుపాళ్యం ముఠా అని అన్నారు. బీఆర్ఎస్ విషయంలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ ర్యాలీని చూసి బీఆర్ఎస్‌కు దడ పుట్టిందన్నారు. ఇక, విష్ణువర్ధన్ ఎందుకు నామినేషన్ వేశారో బీఆర్ఎస్ నేతలు ప్రజలకు చెప్పాలని చామల డిమాండ్ చేశారు.

నవీన్‌యాదవ్‌తోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి: ఒవైసీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అభివృద్ధి ప్రాతిపదికన ఓటింగ్ జరగాలని కోరుకుంటున్నానని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మంగళవారం విలేకరులతో అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు పదేళ్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారని, కానీ ఆ పార్టీ ఎమ్మెల్యే దానిని వినియోగించుకోలేదని విమర్శించారు. పదేళ్లలో జూబ్లీహిల్స్‌లోని ఏ వార్డులోనూ అభివృద్ధి జరగలేదన్న ఒవైసీ.. ఈ సారి అభివృద్ధిని ప్రాతిపదికగా తీసుకుని ప్రజలు ఓట్లు వేయాలని ఆశిస్తున్నానని చెప్పారు. ఈ ఉప ఎన్నికలో ఎంఐఎం పోటీ చేయడం లేదని, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. నవీన్ యాదవ్ విజయంతోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమని ఆయన చెప్పారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్‌లకు బుద్ధి చెప్పాలి

- ఆ మూడు పార్టీలూ ఒక్కటే : కిషన్ రెడ్డి
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో వ్యాఖ్య
- అసదుద్దీన్ కాంగ్రెస్‌కు తమ్ముడు బీఆర్ఎస్‌కు మద్దతు : సంజయ్
- రాష్ట్రాన్ని మార్పు వైపు తీసుకెళ్లే ఈ ఎన్నిక కీలకం : రాంచందర్ రావు



నామినేషన్ ర్యాలీలో లంకల దీపక్ రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు

యూసుఫ్‌గూడ/హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు ఒక్కటేనని జూబ్లీహిల్స్ ప్రజలు ఓటుతో ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి మంగళవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ ర్యాలీ, నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్న కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ ఒక్కటేనని ఆరోపించారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మజ్లిస్ పార్టీ, అసదుద్దీన్ ఒవైసీ మద్దతు ఉందన్నారు. మజ్లిస్ కబంధ హస్తాల నుంచి హైదరాబాద్‌ను రక్షించుకోవాలన్నారు. నాడు కేసీఆర్ మజ్లిస్‌ను తన భుజాల మీద మోసారని, నేడు కాంగ్రెస్ కూడా అదే చేస్తోందని ధ్వజమెత్తారు. ఆ మూడు పార్టీలు స్వార్థం కోసమే పని చేస్తాయని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అది మూసీ నదిలో వేసినట్టేనన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌ను సింగపూర్, వాషింగ్టన్ చేస్తానని చెప్పి ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్‌లో ఓటు అడిగే హక్కు లేదన్నారు. నిత్యం ప్రజల మధ్యలో ఉండే దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అని, ఆయన నాయకత్వంలో ఉప ఎన్నికలో బీజేపీ విజయం సాధిస్తుందని అన్నారు. ఈ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి అసదుద్దీన్ మద్దతిస్తే, ఆయన తమ్ముడు బీఆర్ఎస్‌కు వత్తాసు పలుకుతున్నాడని విమర్శించారు. బీజేపీని ఓడించేందుకు దేశమంతా పోటీచేస్తున్న మజ్లిస్.. జూబ్లీహిల్స్‌లో ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. ఇక, రాష్ట్రాన్ని మార్పు వైపు తీసుకెళ్లే పాలన కోసం ఈ ఉపఎన్నిక ఎంతో కీలకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడంలో గతంలో ఏ ప్రభుత్వమూ తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని కాలనీల్లో డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు.

స్టార్ క్యాంపెయినర్ జాబితాలో 40 మంది

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారానికి బీజేపీ 40 మంది నేతలతో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ప్రకటించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, నిర్మలా సీతారామన్, బండి సంజయ్, అర్జున్‌రాం మేఘవాల్, శ్రీనివాస్ వర్మ, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్‌శర్మ, ఎంపీలు లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల, తేజస్వి సూర్య, డి. అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఆర్.కృష్ణయ్య, జి.నగేశ్, పురందేశ్వరి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిలు సునీల్ బన్సల్, అభయ్‌పాటిల్, సీనియర్ నాయకులు గరికపాటి మోహన్‌రావు, కె. అన్నామలై, బి. వెంకటేశ్ నేత, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, మురళీధర్‌రావు, బూర నర్సయ్యగౌడ్, బండ కార్తీక రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, టి. వీరేందర్‌గౌడ్, ఎన్.గౌతంరావు, వేముల అశోక్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే సుజనాచౌదరి, తెలంగాణ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీలు వెంకటనారాయణరెడ్డి, కొమురయ్య, అంజి రెడ్డి తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. ఈ జాబితాకు ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం తెలిపింది.

ఈసీ ఆఫీసులోకి కేంద్ర మంత్రులు

బీఆర్ఎస్ నాయకుల నిరసన

బంజారాహిల్స్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా ఎన్నికల అధికారి కార్యాలయం బయట స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. భారీ ర్యాలీగా వచ్చిన దీపక్ రెడ్డి నామినేషన్ వేసేందుకు ఈసీ కార్యాలయంలోకి వెళ్లారు. ఆ వెంటనే కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా లోపలికి వెళ్లారు. అయితే, తాము బయట ఎదురుచూస్తుండగా కేంద్ర మంత్రులు లోపలికి ఎలా వెళ్తారంటూ అక్కడున్న బీఆర్ఎస్ శ్రేణులు అధికారులను ప్రశ్నించారు. బీఆర్ఎస్ శ్రేణులకు స్వతంత్ర అభ్యర్థులు కూడా జతవ్వగా.. అందరూ కలిసి న్యాయం కావాలంటూ నినాదాలు చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొనగా.. బీజేపీ అభ్యర్థి ముందుగానే టోకెన్ తీసుకున్నారని పోలీసులు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తన నాలుగో సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారికి మంగళవారం సమర్పించారు. ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాధవరం కృష్ణారావు ఆమె వెంట ఉన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముగ్గురు పరిశీలకుల నియామకం

- ఎన్నికల సంఘం ఆదేశాలు
- ఫిర్యాదులపై 100 నిమిషాల్లో పరిష్కారం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ముగ్గురు సీనియర్ అధికారులను పరిశీలకులుగా నియమించింది. వీరు నిబంధనల అమలు, శాంతి భద్రతలు, అభ్యర్థుల ఖర్చులు వంటి అంశాలను పరిశీలిస్తారు. ఇందుకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులుంటే వారికి ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. సీ- విజిల్ మొబైల్ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయొచ్చని అధికారులు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో పరిష్కారం ఉంటుందని తెలిపారు.

పరిశీలకుల వివరాలు....ఫోన్ నెంబర్లు

- రంజిత్‌కుమార్‌సింగ్, ఐఏఎస్ - సాధారణ పరిశీలకుడు - 9247505728
- ఓం ప్రకాష్ త్రిపాఠి, ఐపీఎస్ - పోలీస్ పరిశీలకుడు - 9247505729
- సంజీవ్‌కుమార్ లాల్, ఐఆర్ఎస్ - వ్యయ పరిశీలకుడు - 9247505727


హుజూర్‌నగర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కాంగ్రెస్ హయాంలో 80 వేల ఉద్యోగాలు

- యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో 25న మెగా జాబ్‌మేళా
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 80 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈనెల 25న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా స్థలాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టిసారించామన్నారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని యువతీ, యువకుల కోసం హుజూర్‌నగర్‌లో 205 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటివరకు 9,500 మంది యువకులు ఉపాధి కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. సుమారు 5 వేల మందికి పైగా ఈ మేళా ద్వారా ఉపాధి పొందే అవకాశం కల్పిస్తామని, భోజన వసతి కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు.

రేపటి మంత్రివర్గ భేటీకి సిద్ధంగా ఉండాలి:సీఎస్

- శ్రీరాంసాగర్ రెండో దశకు దామోదర్‌రెడ్డి పేరు?

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించే ఎజెండాకు సంబంధించి సమగ్ర వివరాలతో సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఇటీవలే జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు అంశాలు చర్చకు రాలేదు. అవన్నీ ఇప్పుడు చర్చకు వచ్చే అవకాశం ఉండడంతో సమగ్ర వివరాలతో హాజరుకావాలని కోరారు. ఏఎమ్మార్పీ 29వ ప్యాకేజీతో పాటు చిన్న కాళేశ్వరం సవరణ అంచనాలపైనా చర్చలు జరగనున్నాయి. శ్రీరాంసాగర్ రెండో దశకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టే అంశాన్నీ మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.

ఇరిగేషన్ శాఖ విద్యుత్ బకాయి 30 వేల కోట్లు

రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు నీటి పారుదల శాఖ నుంచి రావాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలు గత సెప్టెంబరు నాటికి అక్షరాలా రూ.30,711 కోట్లు ఉన్నట్లు తేలింది. కాళేశ్వరం వంటి భారీ ఎత్తిపోతల పథకాలు, తాగునీటి సరఫరా పథకాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో ఏటేటా బకాయిలు పెరిగిపోయాయి. వివిధ ఎత్తిపోతల పథకాలకు కరెంట్ బిల్లుల రూపేణా డిస్కంలకు రూ.24,312 కోట్లు కట్టాల్సి ఉండగా.. ఇందులో రూ.15,517 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం మిగిల్చిన వాటా కాగా... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.8795 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఎత్తిపోతల పథకాలకు కరెంట్‌ను సరఫరా చేసే సబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల కోసం 4849కోట్లు, సబ్ స్టేషన్ల మెయింటెనెన్స్ పనులకు సంబంధించి మరో1550 కోట్లు కట్టాల్సి ఉందని అధికారులు గుర్తించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి 8 ఏళ్లలో కరెంటు బిల్లుల కింద 13,156 కోట్లు ఖర్చయ్యాయి. ఇందులో 3,971 కోట్లను మాత్రమే ఇప్పటిదాకా ప్రభుత్వం చెల్లించింది 2021 తర్వాత నుంచి బిల్లుల చెల్లింపులు ఆగిపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, కల్వకుర్తి ఇతర ఎత్తిపోతల పథకాలకు 12 ఏళ్లలో కరెంట్ బిల్లుల కింద 17,710 కోట్లు కాగా.. 11,285 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

బిల్లులు కట్టండి: ఇంధన శాఖ

ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్.. నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇతర ఉన్నతాధికారులతో మంగళవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. పెండింగ్ బిల్లులు భారీగా పెరిగినందునా... విద్యుత్ సంస్థల రోజువారీ నిర్వహణ ఇబ్బందికరంగా మారిందని ఈ భేటిలో మిట్టల్ గుర్తు చేశారు. డిస్కంలకు చెల్లించాల్సిన రూ.24,313 కోట్లు, ట్రాన్స్‌కో చెల్లించాల్సిన రూ.6,399 కోట్ల బకాయిల విడుదల కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'డీసీసీ అధ్యక్షుల'పై 25న తుది కసరత్తు

- నెలాఖరు కల్లా ప్రకటన వెలువడే అవకాశం

జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామక ప్రక్రియపై ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో తుది కసరత్తు జరగనుంది. ఈ నెల 25న జరగనున్న సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రి ఉత్తమ్, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి పాల్గొననున్నారు. డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం అధిష్ఠానం నియమించిన 22 మంది పరిశీలకులు అన్ని జిల్లాల్లో పర్యటించి, స్థానిక నేతలతో సమావేశమైన సంగతి తెలిసిందే. డీసీసీలు, పట్టణ కాంగ్రెస్ కమిటీలు కలుపుకొని మొత్తం 39 అధ్యక్ష పదవులకు దరఖాస్తులను స్వీకరించారు. ఒక్కో డీసీసీ నుంచి వందలాది దరఖాస్తులు రాగా.. వడపోత తర్వాత ఆరుగురి చొప్పున అర్హులైన నేతలను ఎంపిక చేశారు. ఈ మేరకు తొలుత 22 మంది పరిశీలకులతో ముఖాముఖి సమావేశం కానున్న కేసీ వేణుగోపాల్.. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి, మీనాక్షీ నటరాజన్, మహేశ్‌గౌడ్, ఉత్తమ్, వంశీచంద్ అభిప్రాయాలు తీసుకోనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ ఆమోదం తర్వాత నియామకాలు జరగనున్నాయి. ఈ నెలఖరులో గానీ, నవంబర్ మొదటి వారంలో గానీ డీసీసీలు, పట్టణ కాంగ్రెస్ కమిటీలకు అధ్యక్షులను ప్రకటించే అవకాశం ఉందని, ఈ సారి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలు, యువతకు ప్రాధాన్యం ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఇద్దరు పిల్లల రూల్‌ను ఎత్తివేసేందుకు ఆర్డినెన్స్

- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం.. ఆర్డినెన్స్ బిల్లుపై సీతక్క సంతకం
- క్యాబినెట్ ఆమోదం తర్వాత గవర్నర్‌కు

ఇద్దరికన్నా ఎక్కువ మంది పిల్లలుంటే గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు అనే నిబంధనను ఎత్తివేస్తూ ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్డినెన్స్‌కు సంబంధించిన బిల్లు పైన మంగళవారం నాడు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం అయిన తర్వాత క్యాబినెట్ ముందుకు రానుంది. ఆర్డినెన్సు బిల్లును క్యాబినెట్ ఆమోదించిన తర్వాత గవర్నర్ వద్దకు పంపనున్నారు. గవర్నర్ ఆ బిల్లును ఆమోదిస్తే... వచ్చే గ్రామీణ స్థానిక ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు కూడా పోటీ చేసేందుకు వీలు కలుగుతుంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 21(3) ప్రకారం ఇద్దరు పిల్లలకు మించి ఉన్నవారు గ్రామీణ స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులు. 1995కు ముందు ఇద్దరు మించి పిల్లలు ఉన్న వారికి మాత్రం సడలింపు ఇచ్చారు. అయితే, రాష్ట్రంలో కుటుంబ నియంత్రణ సమర్థంగా అమలవుతున్న నేపథ్యంలో ఈ ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేయాలంటూ కొంత కాలంగా స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఈ అంశంపైన చర్చించింది. ఆ నిబంధనను ఎత్తివేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. కానీ, ఈ నిర్ణయం అమల్లోకి రావాలంటే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018కు సవరణ చేసి అసెంబ్లీ ఆమోదించాల్సి ఉంటుంది. శీతాకాలం అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు ఇంకా సమయం ఉండటం, హైకోర్టు ఆదేశాల మేరకు త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో చట్ట సవరణను ఆర్డినెన్సు రూపంలో తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదిలా ఉండగా, స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించేందుకు గురువారం రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అయ్యే అవకాశం ఉంది. ఆ భేటీలో పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్సును రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించి.. గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపనుంది.

గురుకులాల్లో వస్తువులు, డైట్ టెండర్లకు బ్రేక్!

- జెమ్‌లో చేసుకున్న దరఖాస్తుల నిలిపివేత
- ఈ విద్యా సంవత్సరం ట్రంక్ పెట్టెలు, డ్రెస్సులు లేనట్లే!
- లక్షలాది మంది విద్యార్థులపై ప్రభావం

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాలు, హాస్టళ్లలోని లక్షలాది మంది విద్యార్థులకు అవసరమయ్యే వస్తువుల సరఫరా టెండర్లను ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఈ విద్యాసంవత్సరం వారికి ట్రంక్ పెట్టెలు, డ్రెస్సులు, స్కూల్ బ్యాగుల వంటి వ్యక్తిగత వస్తువులు అందించడం కష్టంగా మారింది. మరోవైపు విద్యార్థుల డైట్ (పౌష్టికాహారం) కోసం సరకుల సేకరణ టెండర్ల వ్యవహారం కూడా ఇంకా కోర్టు పరిధిలో ఉండడంతో సందిగ్ధత నెలకొంది. గురుకుల విద్యార్థులకు యూనిఫాంలు, పీటీ డ్రెస్సులు, స్కూల్ బ్యాగులు, ట్రంక్ పెట్టెలు, బెడ్ మెటీరియల్, బూట్ల వంటి వ్యక్తిగత వస్తువుల సరఫరా కోసం కేంద్రీకృత (సెంట్రలైజ్డ్) టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం గత నెలలో ప్రారంభించింది. అన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీలకు కలిపి ఒకే టెండర్ విధానాన్ని (గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్-జెమ్) తీసుకొచ్చారు. వాస్తవానికి ఈ టెండర్లు గత నెలలోనే ఖరారై, సరఫరా ఈనెల 1 నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యం జరగడం, ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావడంతో, టెండర్లను పూర్తిగా నిలిపివేశారు. జెమ్‌లో చేసుకున్న దరఖాస్తులు కూడా రద్దయ్యాయి. ఈ నిర్ణయంతో ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు వస్తువుల సరఫరా ఉండకపోవచ్చు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అందించేలా ఇప్పటినుంచే ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు గురుకుల సొసైటీ అధికారి ఒకరు చెప్పారు.

కొత్త టెండర్లు ఖరారయ్యేవరకు పాత కాంట్రాక్టర్లతోనే..

విద్యార్థులకు పౌష్టికాహారం (నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్) అందించేందుకు ఆహ్వానించిన టెండర్లు కూడా నిలిచిపోయాయి. టెండర్ల నిర్వహణకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.17ను రద్దు చేయాలని కోరుతూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో టెండర్ల ప్రక్రియ తాత్కాలికంగా ఆగిపోయింది. కొత్త కాంట్రాక్టర్ల ఎంపిక పూర్తయ్యేవరకు పాత కాంట్రాక్టర్లే సరఫరా కొనసాగించాలని అధికారులు ఆదేశించారు. కొత్త డైట్ విధానంలో ధరలు పెంచినా, ఆ పెరిగిన ధర పాత కాంట్రాక్టర్లకు ఇవ్వకపోవడంతో చాలా చోట్ల సరఫరాదారులు సరఫరా చేయడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కాగా, వ్యక్తిగత వస్తువుల టెండర్లు రద్దు కావడం, అత్యంత కీలకమైన డైట్ సరఫరా టెండర్ల వ్యవహారం కోర్టులో ఉండడంతో, ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, అవసరమైన సదుపాయాలు అందించడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. సకాలంలో సదుపాయాలు అందకపోతే పిల్లల చదువులు, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మావోయిస్టులు లొంగిపోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఒక నమ్మకం అని.. పగలు రాత్రి తేడాలేకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పనిచేస్తారని తెలిపారు. ఈ ఏడాది దేశంలో 191 మంది పోలీసులు అమరులయ్యారని, వారిలో తెలంగాణకు చెందిన ఆరుగురు పోలీసులు ఉన్నారని సీఎం వెల్లడించారు. గ్రేహౌండ్స్ కమాండోలు టి.సందీప్, వి.శ్రీధర్, ఎన్.పవన్‌కల్యాణ్, అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్‌లాల్, నల్లగొండ కానిస్టేబుల్ బి.సైదులు, తాజాగా నిజామాబాద్‌లో ప్రాణాలు కోల్పోయిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ఓదార్చారు. పోలీసు అమరుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. వీరమరణం పొందిన పోలీసులకు రాష్ట్ర ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు తెలిపారు. ప్రమోద్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియాతో పాటు 300 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి నిర్ణయించినట్లు సీఎం చెప్పారు.అదనంగా పోలీస్ సెక్యూరిటీ వెల్ఫేర్ నుంచి రూ.16 లక్షలు, పోలీస్ వెల్ఫేర్ నుంచి రూ.8 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం, పోలీస్ శాఖ అండగా ఉంటుందని చెప్పారు. 2008లో ఒడిసాలో మావోయిస్టులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన 33 మంది పోలీస్ అమరులకు గాజులరామారంలో 200 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వం కేటాయించిందని గుర్తుచేశారు.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ పోలీస్..

అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవడంతో పాటు ప్రత్యేకమైన ప్రజా సంక్షేమ విధివిధానాలను అనుసరించడంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇండియా జస్టిస్ రిపోర్టు ప్రకారం.. తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. పారదర్శకత, పాస్‌పోర్టు తనిఖీల్లో అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. ఈ విజయాలు రాష్ట్ర పోలీసుల నిరంతర కృషికి, అంకితభావానికి నిదర్శనమని అన్నారు. పోలీస్ శాఖలోనూ మహిళల భాగస్వామ్యానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. డ్రగ్స్ మహమ్మారిపై ఈగల్ (తెలంగాణ నార్కోటిక్ బ్యూరో) పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. టెక్నాలజీ అందుబాటులోకి రావడం, సోషల్‌మీడియా ప్రభావం పెరగడంతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్ణయమైనా తీసుకునేలా పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చామని చెప్పారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనే తమ లక్ష్యమని సీఎం వెల్లడించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లు చేసి నేరస్థులను పట్టుకుంటున్న తీరు, పోలీసుల కృషి అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే 16,000 మంది కానిస్టేబుళ్లు, ఎస్సైలను నియమించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. పోలీస్ విధులు, పోస్టింగ్‌ల విషయంలో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా తొలగించామని అన్నారు. వీరమరణం పొందిన పోలీసుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు ఉద్యోగం, ఇంటిస్థలం, వారి పిల్లలకు గురుకుల పాఠశాలల్లో ఉచిత విద్య, వైద్య కళాశాల్లో ప్రత్యేక సీట్లు కేటాయిస్తున్నామని తెలిపారు.


అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, అనిల్‌కుమార్

ప్రజలతోనే ఫ్రెండ్లీ పోలీసింగ్: డీజీపీ

పోలీస్ అంటే భయపెట్టేవాడు కాదని, భరోసా కల్పించేవాడని డీజీపీ బి.శివధర్‌రెడ్డి అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధిత ప్రజలతోనే తప్ప.. నేరస్థులతో కాదని స్పష్టం చేశారు. పోలీస్ శాఖలో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని, ప్రతి విభాగంలో సిబ్బంది అప్‌డేట్ అవ్వాలని సూచించారు. కాగా, మావోయిస్టులు లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవాలని నిజామాబాద్‌లో పిలుపునిచ్చారు. పోలీసుల నుంచి ఎలాంటి వేధింపులు ఉండబోవని హామీ ఇచ్చారు.

బుల్లెట్ వద్దు బ్యాలెట్టే ముద్దు

- తుది దశకు మావోయిస్టు నిర్మూలన
- కేంద్రమంత్రి బండి సంజయ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్‌ను నమ్ముకున్నోళ్లు అంతా కాలగర్భంలో కలిసిపోయారని, ఇది చరిత్ర చాటిన సత్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం న్యూఢిల్లీలోని చాణిక్యపురి నేషనల్ పోలీస్ స్మారక స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఓ ప్రకటన చేస్తూ బుల్లెట్ వద్దని, బ్యాలెటే ముద్దు అని పేర్కొన్నారు. బ్యాలెట్‌ను నమ్ముకున్న వాళ్లను ప్రజాస్వామ్య వాదులు స్వాగతించి అక్కున చేర్చుకుంటారన్నారు. బుల్లెట్ ద్వారా సాధించిందేమీ లేదన్న బండి సంజయ్.. బుల్లెట్‌కు, బ్యాలెట్‌కు మధ్య జరిగిన ప్రతిఘటనలో చివరకు బ్యాలెట్ మాత్రమే గెలిచిందని తెలిపారు. మావోయిస్టుల నిర్మూలన తుది అంకానికి చేరిందన్నారు. బుల్లెట్‌ను నమ్ముకున్న వాళ్లు పశ్చాత్తాపంతో ఆయుధాలు వదిలి జన జీవన స్రవంతిలోకి రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వచ్చే మార్చి నాటికి పూర్తిగా మావోయిస్టుల నిర్మూలన తథ్యమన్న బండి సంజయ్.. తొలి నుంచి బుల్లెట్‌ను బీజేపీ వ్యతిరేకిస్తోందని చెప్పారు. పోలీస్ అమర వీరుల త్యాగాలను దేశం ఎన్నటికీ మరువదని, వారి ధైర్య, సాహసాలు, త్యాగాల స్ఫూర్తితో ముందుకు నడుస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో పోలీసులు, సైనికుల చేతుల్లో మాత్రమే తుపాకీ ఉండాలని బండి సంజయ్ పేర్కొన్నారు.

'మద్యం' దరఖాస్తులకు సెంటిమెంట్ బ్రేక్!

- అమావాస్య, మంగళవారం ప్రభావంతో ఒక్క దరఖాస్తూ రాని తీరు
- నేడు పాడ్యమి భయం! మిగిలినది ఒక్క రోజే
- ఇప్పటివరకు 89వేలు దాటిన దరఖాస్తులు..

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం దుకాణాల దరఖాస్తులకు అమావాస్య, మంగళవారం సెంటిమెంట్ బ్రేక్ వేసింది. మంచిరోజు కాదనే ఉద్దేశంతో మద్యం వ్యాపారులు, ఔత్సాహికులు ఎవరూ ముందుకురాకపోవడంతో మంగళవారం ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. పాడ్యమి ఉన్న నేపథ్యంలో బుధవారం కూడా దరఖాస్తులు వస్తాయో, లేదోనన్న సందేహాలు ఉన్నాయి. ఈ క్రమంలో గడువు ముగిసే 23వ తేదీ గురువారం ఒక్కరోజుపైనే అధికారులు ఆశలు పెట్టుకున్నారు. మొత్తం లక్షకుపైగా దరఖాస్తులు వస్తాయని భావించినా, ఇప్పటివరకు 89,344 దరఖాస్తులే వచ్చాయి. గురువారం గడువు ముగిసేకల్లా లక్ష దరఖాస్తులు దాటుతాయని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా.. శనివారం (18వ తేదీ) రాత్రి వరకు 89,344 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఆ రోజున బీసీ బంద్ వల్ల దరఖాస్తు చేసుకోలేకపోయామన్న పలువురు వ్యాపారుల అభ్యర్థన మేరకు ఎక్సైజ్ శాఖ గడువును ఈ నెల 23 (గురువారం) వరకు పొడిగించింది. 27న డ్రా తీసి వ్యాపారులను ఎంపిక చేస్తామని తెలిపింది. గడువుపెంచినా.. అందులో ఆదివారం, సోమవారం (దీపావళి)సెలవులు కావడం, మంగళవారం అమావాస్య కలయిక ఉండటంతో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. పాడ్యమి రోజున కొత్త పనులు మొదలుపెట్టకూడదనే సెంటిమెంట్ ఉందని, ఆ రోజున కూడా మందకొడిగా దరఖాస్తులు రావొచ్చని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

శంషాబాద్‌లో అత్యధికం.. ఆసిఫాబాద్‌లో అత్యల్పం..

ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే.. రాష్ట్రంలో అత్యధికంగా శంషాబాద్ ఎక్సైజ్ డివిజన్‌లో 8,110, సరూర్‌నగర్‌లో 7,595 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా ఆసిఫాబాద్ డివిజన్‌లో 622, వనపర్తిలో 676 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ కోసం అన్ని జిల్లా కేంద్రాల్లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలతో పాటు.. గతానికి భిన్నంగా ఈసారి హైదరాబాద్‌లోని అబ్కారీ భవన్‌లో కూడా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఏ జిల్లాలోని దుకాణానికైనా ఇక్కడ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. చివరి రోజున ఏ దుకాణానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే సమాచారాన్ని ప్రతి గంటకోసారి ఎక్సైజ్‌శాఖ అధికారులు వెల్లడించనున్నారు. దీనితో ఏ దుకాణాలకు తక్కువ దరఖాస్తులు వచ్చాయనేది తెలుసుకుని.. వాటికి దరఖాస్తు చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎక్సైజ్ శాఖకు ఇప్పటివరకు 89,344 దరఖాస్తులతో రూ.2,680 కోట్ల ఆదాయం సమకూరింది. గడువు ముగిసే సరికి రూ.3వేల కోట్లపైనే ఆదాయం వస్తుందని ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు.

ఏ సమస్య ఉన్నా నేరుగా నాకే చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు వెళ్లడం, ఆ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డిలపై సురేఖ కుమార్తె సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం.. చివరికి ఆ పంచాయితీ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కోర్టుకు చేరుకోవడం తెలిసిందే. మీనాక్షీ నటరాజన్‌తో భేటీ అనంతరం.. పార్టీ పెద్దలు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని కొండా సురేఖ ప్రకటించారు కూడా. మీనాక్షీ, మహేశ్‌గౌడ్‌లతో భేటీకి ముందు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతోనూ సురేఖ భేటీ అయ్యారు. అయితే ఈ అంశంపైన సీఎం రేవంత్‌రెడ్డితో మీనాక్షీ, మహేశ్‌గౌడ్‌ల చర్చల అనంతరం సమస్య కొలిక్కి వచ్చింది. దీపావళి(సోమవారం) రోజున సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ, కొండా మురళి ఆయనతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో భట్టివిక్రమార్క, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు. తమను కావాలని కొందరు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి మీతో కలిసి నడిచామని కొండా దంపతులు సీఎం రేవంత్ రెడ్డితో చెప్పినట్లు తెలిసింది. మిమ్మల్ని నమ్ముకుని ఉన్నా తమపై కొందరు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు కుట్ర చేస్తున్నారని వివరించినట్లు సమాచారం. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సురేఖక్క తనకు తోబుట్టువు లాంటిదని, ఏ ఇబ్బంది ఉన్నా.. సమస్య ఉన్నా నేరుగా తనతోనే చెప్పుకోవాలని సూచించినట్లుగా తెలిసింది. ఈ భేటీపై మహేశ్‌గౌడ్ స్పందిస్తూ.. కొండా సురేఖ వివాదం ముగిసిపోయిందని చెప్పారు. సురేఖ తన ఇబ్బందులను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారని, తమ కూతురు సుస్మిత పొరపాటున మాట్లాడిందంటూ కొండా దంపతులు వివరణ ఇవ్వడంతో పాటు.. వాళ్లు కూడా విచారం వ్యక్తం చేశారని తెలిపారు. ఇక మీదట ఏ సమస్య ఉన్నా తనకే నేరుగా చెప్పాలని సురేఖకు సీఎం చెప్పారని వెల్లడించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని మహేశ్‌గౌడ్ స్పష్టం చేశారు. సున్నితమైన అంశాలపై స్పందించేటప్పుడు సంయమనం పాటించాలని, సీఎం రేవంత్‌కు మంత్రులందరూ సమానమేనని చెప్పారు. కాంగ్రెస్‌లో సమస్యలను పెద్ద మనసుతో పరిష్కారం చేసుకుంటామన్నారు. కాగా.. కరీంనగర్‌లో మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆయన తమ పార్టీ సీనియర్ నేత అని, ఆయన చేస్తున్న ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. ఆయనకు ఏమైనా సమస్యలుంటే స్థానిక మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పరిష్కరిస్తారని మహేశ్‌గౌడ్ చెప్పారు.


సీఎంతో మంత్రి కొండా సురేఖ దంపతులు, భట్టి విక్రమార్క, మహేశ్‌గౌడ్

పత్తి రైతులను ఆదుకుంటాం

- తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదు: పొంగులేటి
- పాలేరు సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

హైదరాబాద్, కూసుమంచి, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి) ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకుంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం గోల్‌తండలో 2025 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీసీఐ తొలి కేంద్రాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సీజన్‌లో భారీ వర్షాల వల్ల రైతులకు దిగుబడి తగ్గిపోయిందన్నారు. సీసీఐ ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. గిట్టుబాటు ధర అందించేందుకు, మద్దతు ధర పెంచేలా రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ద్వారా చర్చకు పెడతామన్నారు. తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. ప్రతి సీసీఐ కేంద్రం వద్ద వచ్చే అభ్యంతరాలను పరిష్కరించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు అన్యాయం చేయాలని చూస్తే స్థానిక కమిటీలు చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. వ్యవసాయ అధికారుల వద్ద తేమ యంత్రాలు ఉన్నాయని, రైతుల పొలాల వద్దనే తేమ శాతం పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి వద్ద ఆన్‌లైన్ బుకింగ్ ఎలా తీసుకోవాలనే దానిపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. పత్తి రైతులకు నష్టం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం గోల్ తండాలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

తొలివిడతలో 4.5లక్షల గృహాలు మంజూరు

తమ ప్రజా ప్రభుత్వం పేదలపక్షపాతిగా పని చేస్తోందని అందులో భాగంగానే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నేలపట్ల, ధర్మాతండా గ్రామాల్లో పొంగులేటి మాట్లాడుతూ పేదప్రజలకు ధైర్యం, భరోసా ఇచ్చేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మొదటి దఫాలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు సంబంధించిన నిధులను ప్రతి సోమవారం బ్యాంకుల్లో జమ చేస్తున్నామన్నారు. రైతును రాజు చేసేలా రూ.21 వేలకోట్ల రుణమాఫీ, సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చామని, ప్రస్తుత సీజన్‌కు కూడా బోనస్ ఇవ్వాలని మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందన్నారు. మరో పదిరోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిధాన్యపు గింజను సేకరిస్తామని హామీ ఇచ్చారు.

చందన మోహనరావు కన్నుమూత

- సీఎంఆర్ షాపింగ్ మాల్స్ స్థాపకుడిగా విశేష గుర్తింపు
- వ్యాపారవేత్తలు, ప్రజా ప్రతినిధుల నివాళి


చందన మోహనరావు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వస్త్ర వ్యాపారి చందన మోహనరావు సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మోహనరావు(82) విశాఖపట్నం కేఆర్ఎం కాలనీలోని ఆయన స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన మోహనరావు 1984లో విశాఖ జగదాంబ సెంటర్ వద్ద చందన బ్రదర్స్ పేరుతో వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించారు. హోల్‌సేల్ రేట్లకే రిటైల్ అమ్మకం నినాదంతో వ్యాపారంలో నూతన ఒరవడి సృష్టించారు. 1988లో హైదరాబాద్, 1989లో విజయవాడలో చందన బ్రదర్స్ దుకాణాలను ప్రారంభించారు. అదే క్రమంలో 1998లో జ్యువెలరీ రంగంలోకి ప్రవేశించి, తొలిసారిగా హాల్‌మార్క్ బంగారు ఆభరణాలను తెలుగు రాష్ట్రాలకు పరిచయం చేశారు. పొగడ్తలంటే ఇష్టపడని మోహనరావు తన పేరు మీద వ్యాపారం ప్రారంభించేందుకు విముఖత చూపేవారు. అయితే అల్లుడు మావూరి వెంకటరమణ ప్రోద్బలంతో 2002లో విశాఖలో మొదటిసారిగా సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభించారు. రెండు రాష్ట్రాల్లో ఏర్పాటుచేసిన సీఎంఆర్ మాల్స్‌తో వేల కుటుంబాలకు ఉపాధి కల్పించడమే కాక, సీఎంఆర్ చారిటబుల్ ట్రస్టును స్థాపించి అనేకమంది పేద విద్యార్థులకు విద్యా దానం చేశారు. అవసరంలో ఉన్న వారిని ఆదుకునే దాతగా పేరు తెచ్చుకున్నారు. మృదు స్వభావిగా పేరుగాంచిన మోహనరావు వేల మందికి ఆదర్శంగా నిలిచారు. మోహనరావు మృతిపై నగరంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చందన మోహనరావు అల్లుడు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సామాజిక వేత్త బూర్గుల సుమన కన్నుమూత

- బూర్గుల రామకృష్ణారావు వారసురాలు
- వైద్య కళాశాలకు భౌతికకాయం


బూర్గుల సుమన (ఫైల్)

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలు, ఎంపీటీసీ, సర్పంచ్, సామాజిక వేత్తగా ప్రజాభిమానం పొందిన హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వారసురాలు బూర్గుల సుమన(88) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. బూర్గుల రామకృష్ణారావు సోదరుని కుమార్తె అయిన సుమన.. పెళ్లి చేసుకోకుండా తన జీవితాన్ని సామాజిక సేవకే అంకితం చేశారు. హైదరాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి 1998లో పదవీ విరమణ చేసి, రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని తన స్వగ్రామం బూర్గుల వచ్చారు. తన అన్న, సాయుధ రైతాంగ పోరాట యోధుడు బూర్గుల నర్సింగరావు స్ఫూర్తితో 2006లో బూర్గుల గ్రామ ఎంపీటీసీగా, 2013లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఓ వైపు ప్రజా సేవ చేస్తూనే మరో వైపు తన పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రగతి వెల్ఫేర్ సొసైటీని స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. తాను మరణించిన కూడా తన శరీరం పదిమందికి ఉపయోగపడాలని సుమన కోరిక మేరకు.. కుటుంబసభ్యులు తన భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

సాగర్ కుడిభాగంపై సీసీటీవీ కెమెరాలు

- పిడుగుల నుంచి రక్షణకు పరికరాల ఏర్పాటు
- తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తికి కృష్ణాబోర్డు సానుకూల స్పందన

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ భద్రతకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రాజెక్టుకు కుడి వైపున ఏపీ భూభాగంలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి తెలంగాణకు అనుమతినిచ్చింది. తెలంగాణ విజ్ఞప్తి మేరకు వచ్చే డిసెంబరు 31వరకూ ఏపీ వైపు డ్యామ్‌పైకి వచ్చేందుకు ఇంజనీర్లు, సిబ్బందిని అనుమతించాలని సీఆర్‌పీఎఫ్ కమాండింగ్ అధికారికి మంగళవారం కేఆర్ఎంబీ లేఖ రాసింది. దీంతో జలాశయానికి పిడుగుల నుంచి రక్షణకు లైటెనింగ్ అరెస్టర్లు, సర్జ్ ప్రొటెక్షన్ పరికరాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తర్వాత ఏపీ నిర్వహణ కిందకు శ్రీశైలం, తెలంగాణ పర్యవేక్షణలోకి నాగార్జున సాగర్ వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఒక రోజు ముందు 2023 నవంబరు 29వ తేదీన నాగార్జున సాగర్ కుడి భాగాన్ని ఏపీ సర్కారు తన ఆధీనంలోకి తీసుకుంది. సాగర్ కుడి భాగంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను ఏపీ పోలీసులు ధ్వంసం చేయడంతో ప్రాజెక్టు నిర్వహణను కృష్ణా బోర్డు తన పర్యవేక్షణలోకి తీసుకోగా, సీఆర్‌పీఎఫ్‌కు రక్షణ బాధ్యత అప్పగించారు.

జల విద్యుత్తుతో జెన్‌కోకు 2 వేల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అర్ధరాత్రి నాటికి 5 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసింది. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రికార్డు స్థాయిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6831 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి జరగ్గా.. ఆ రికార్డును ప్రస్తుత సంవత్సరంలో దాటే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో తొమ్మిది ప్రాజెక్టుల వద్ద 2441.8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జలవిద్యుత్కేంద్రాలు ఉండగా.. అందులో కృష్ణా నదిపై 2371.6 మెగావాట్ల కేంద్రాలు ఉన్నాయి. గోదావరిపై 70.2 మెగావాట్ల కేంద్రాలున్నాయి. కృష్ణా బేసిన్‌లో ప్రతి నీటి చుక్క కాసులు కురిపిస్తోంది.

రికార్డుల దిశగా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2019-20లో 3963 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేయగా.. 2020-21లో 3667 మిలియన్ యూనిట్ల (శ్రీశైలం ప్రమాదంతో)ను, 2021-22లో అత్యధికంగా 5655 మిలియన్ యూనిట్ల కరెంట్‌ను ఉత్పత్తి చేశారు. 2022-23లో ఏకంగా 6831 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశారు. 2020 ఆగస్టు 20న శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్కేంద్రంలో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఆ కేంద్రంలోని ఒక యూనిట్ ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్‌లో ఐదేళ్లుగా ఉత్పత్తి నిలిచిపోవడంతో 2 వేల మిలియన్ యూనిట్లకు పైగా ఉత్పత్తిపై ప్రభావం పడినట్లయింది. కాగా, రాష్ట్రంలో ఈ నెల 20 నాటికి జల, థర్మల్ విద్యుత్తు కలిపి 20 వేల మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. దీంతో సీజన్ ముగిసేనాటికి జలవిద్యుత్తు ఉత్పాదన కొత్త రికార్డులు సృష్టిస్తుందని అంచనా వేస్తున్నారు.

రియాజ్ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

సారంగాపూర్ ప్రాంతంలో పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. పోలీసులకు దొరకకుండా పారిపోయే ప్రయత్నంలో అతడిని పట్టుకోవడానికి యత్నించిన ఆసిఫ్ అనే వ్యక్తిపై రియాజ్ కత్తితో దాడి చేయగా, ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో రియాజ్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రియాజ్‌ను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలోని నాలుగో అంతస్తులో ఖైదీలను ఉంచే రూమ్ నంబర్ 407లో ఉంచారు. కాగా, సోమవారం ఆస్పత్రి గదిలో అద్దాలు పగులగొట్టి, డోర్‌ను కొడుతూ గొడవ చేస్తుండడంతో విధుల్లో ఉన్న ఆస్పత్రి సిబ్బంది, ఏఆర్ కానిస్టేబుళ్లు రియాజ్‌ను బెడ్‌పై పడుకోబెట్టే ప్రయత్నం చేశారని కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. ఈ క్రమంలో రియాజ్ కానిస్టేబుల్ వద్ద ఉన్న తుపాకీని లాక్కుని ట్రిగ్గర్ నొక్కే ప్రయత్నం చేయగా.. తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు కాల్పులు జరిపారని, దీంతో రియాజ్ మృతి చెందాడని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం రియాజ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. పోలీసు కాల్పుల్లో రియాజ్ మరణించిన విషయాన్ని డీజీపీ శివధర్‌రెడ్డి ప్రకటించారు. కాగా, రియాజ్ మృతిపై జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్లు తెలుస్తోంది. రియాజ్ మృతి పట్ల కానిస్టేబుల్ కుటుంబం సంతోషం వ్యక్తం చేశారు.

ప్రమోద్ కుటుంబానికి కోటి ఎక్స్‌గ్రేషియా..

రియాజ్ చేతిలో హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. పోలీసు భద్రత వెల్ఫేర్ బోర్డుల నుంచి రూ.24 లక్షలతో పాటు ప్రమోద్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం, ఉద్యోగ విరమణ కాలం వరకు పూర్తిస్థాయి వేతనం అందించనున్నట్లు తెలిపారు. కాగా, కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని డీజీపీ శివధర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం పరామర్శించారు. ప్రమోద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మరోవైపు నిందితుడు రియాజ్‌ను పట్టుకునే క్రమంలో కత్తిపోట్లకు గురైన సయ్యద్ ఆసిఫ్‌ను అబిడ్స్‌లోని మల్లారెడ్డి ఆస్పత్రిలో డీజీపీ శివధర్‌రెడ్డి, శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ మహేష్ భగవత్, హైదరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం పరామర్శించారు. కత్తిపోట్లతో చేతికి తీవ్రగాయాలు కావడంతో అత్యంత క్రిటికల్ పరిస్థితుల్లో ఆసిఫ్ ఆస్పత్రికి వచ్చాడని, చేతి ఎముక మాత్రమే కనిపిస్తోందని, వైద్యులు ఆపరేషన్ చేసి చేతిని మళ్లీ యథా రూపానికి తీసుకొచ్చారని చెప్పారు. ఆసిఫ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆయన చికిత్సకు అయ్యే ఖర్చునంతా ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు. నేరగాడి చేతిలో కత్తి ఉన్నప్పటికీ ధైర్యంగా అతడ్ని పట్టుకోవడానికి ఆసిఫ్ చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. ఆసిఫ్ కోలుకోవడానికి రెండు, మూడు నెలలు పట్టవచ్చని తెలిపారు. అప్పటివరకు, ఆ తర్వాత కూడా ఆసిఫ్ కుటుంబాన్ని ఆదుకుంటామని డీజీపీ హామీ ఇచ్చారు. రియాజ్‌పై ప్రకటించిన రూ.50 వేల రివార్డును ఆసిఫ్ కుటుంబానికి అందజేశారు. కాగా, రియాజ్ ఎన్‌కౌంటర్ విషయమై మానవ హక్కుల సంఘం నోటీసులిచ్చిన విషయాన్ని ప్రస్తావించగా.. కేసు విచారణలో ఉండగా మాట్లాడడం సరికాదన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సయ్యద్ ఆసిఫ్‌ను పరామర్శిస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి, తదితరులు

డాన్ అవ్వాలనుకొని..!

పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన రియాజ్ చిన్నచిన్న దొంగతనాలతో తన నేర ప్రవృత్తిని ప్రారంభించాడు. అవసరాలకు దొంగతనం చేసే స్థాయి నుంచి పెద్దపెద్ద నేరాలు చేసే స్థాయికి ఎదిగాడు. డాన్ కావాలనుకుని.. నేరాలు చేసి పోలీసుల చేతిలో హతమయ్యాడు. రియాజ్ తొలుత గత ఏడాది ఎడపల్లి వద్ద హత్య గురైన పాత నేరస్థుడు ఆరిఫ్‌కు అనుచరుడిగా ఉన్నాడు. ఆరిఫ్ మరణం తర్వాత సమద్ గ్యాంగ్‌లో చేరాడు. రియాజ్‌పై 61 కేసులు ఉన్నట్లు, వీటిలో 41 కేసుల విచారణకు అతడు హాజరైనట్లు తెలుస్తోంది. మరో 20 కేసులకు సంబంధించి రియాజ్ కోసం పోలీసులు కొద్దిరోజులుగా గాలిస్తున్నారు. మొత్తం కేసుల్లో 50 కేసులు బైకులు, బుల్లెట్ వాహనాల దొంగతనానికి సంబంధించినవి కాగా, ఐదు చైన్ స్నాచింగ్ కేసులు, రెండు దోపిడీ కేసులు, మూడు హత్యాయత్నం కేసులు, ఒక హత్య కేసు ఉన్నాయి. మహారాష్ట్రలో మరో 6 కేసులు రియాజ్‌పై నమోదయ్యాయి. రియాజ్ ముఖ్యంగా బైకులు, బుల్లెట్ వాహనాలను చోరీ చేసి.. వాటి ఇంజన్ నంబర్లు మార్చి మహారాష్ట్రలో అమ్మేవాడు. కాగా, రియాజ్‌ను సీసీఎస్ పోలీసులు గతంలో పోలీసుస్టేషన్‌లో ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిసింది. దీంతో మళ్లీ ఇబ్బందులకు గురిచేస్తారనే భయంతో కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచి పరారైనట్లు ప్రచారం జరుగుతోంది.


నాగలక్ష్మి, అవంతిక, పవన్‌సాయి(ఫైల్)

ఫోన్ మాట్లాడి.. చెప్పకుండా వెళ్లిపోయాడని..

- భర్తపై భార్య కినుక
- ఇద్దరు పిల్లల్ని గొంతు నులిమి చంపేసి ఉరివేసుకొని ఆత్మహత్య
- నల్లగొండ జిల్లాలో పండుగ పూట విషాదం

కొండమల్లేపల్లి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఫోన్ మాట్లాడిన భర్త.. అడిగినా చెప్పకుండా ఆదరబాదరాగా ఇంట్లోంచి వెళ్లిపోవడం, వెతికినా అతడి ఆచూకీ దొరక్కపోవడంతో మనస్తాపానికి గురైన భార్య.. ఇద్దరు పిల్లలను చంపి, తాను ఆత్మహత్య చేసుకుంది. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో దీపావళి రోజే ఈ విషాదం జరిగింది. కుంచాల రమేశ్, నాగలక్ష్మి(27) దంపతుల స్వస్థలం ఏపీలోని బాపట్ల జిల్లా జనకవరం. వీరికి పిల్లలు అవంతిక (10), పవన్‌సాయి (8) ఉన్నారు. నాలుగేళ్ల క్రితం రమేశ్ తన కుటుంబంతో కొండమల్లేపల్లికి వచ్చి తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇటీవల కొత్తగా పెయింటింగ్ దుకాణం కూడా పెట్టాడు. ఆదివారం సాయంత్రం రమేశ్‌కు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్‌చేసింది ఎవరు? అని భర్తను నాగలక్ష్మి ప్రశ్నించగా.. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపంతో రమేశ్ ఇంట్లోంచి వెళ్లిపోయి..ఫోన్ స్విచాఫ్ చేశాడు. భర్త కోసం నాగలక్ష్మి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆందోళనకు గురైన నాగలక్ష్మి రాత్రి 9:20గంటలకు డయల్ 100కు ఫోన్ చేసి విషయం చెప్పింది. పోలీసులు నాగలక్ష్మి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి అతడి గురించి వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలోనే నాగలక్ష్మి అదే రోజు రాత్రి తన ఇద్దరు పిల్లలను గొంతునులిమి చంపి.. తాను ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా రమేశ్‌కు గతంలో వేరే మహిళతో వివాహం జరిగింది. మనస్పర్థల కారణంగా ఆమెతో విడాకులు తీసుకున్నాడు. ఆ మహిళతో రమేశ్‌కు ఓ కూతురు ఉంది. ఆ పాప.. రమేశ్ స్వగ్రామంలో నాయనమ్మ వద్ద ఉంటోంది. ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన రమేశ్ అదే రోజు రాత్రి జనకవరానికి వెళ్లిపోయాడు. భార్య, పిల్లలు చనిపోయారానే విషయాన్ని తెలుసుకొని బంధువుల వెంట సోమవారం రాత్రి కొండమల్లేపల్లికి వచ్చాడు. విగతజీవులుగా ఉన్న ఇద్దరు పిల్లలు, భార్యను చూసి బోరున విలపించాడు.

నదుల అనుసంధానానికి షరతులతో తెలంగాణ అంగీకారం

- వెల్లడించిన ఎన్‌డబ్ల్యూడీఏ

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇచ్చంపల్లి వద్ద నిర్మించే రిజర్వాయర్ నుంచి గోదావరి-కావేరి అనుసంధానం కోసం నీటి తరలింపునకు తెలంగాణ ప్రభుత్వం షరతులతో అంగీకరించిందని జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) తెలిపింది. అక్టోబరు ఒకటో తేదీన జరిగిన పాలక మండలి సమావేశ మినిట్స్‌ను మంగళవారం ఎన్‌డబ్ల్యూడీఏ విడుదల చేసింది. దేవాదుల కింద 38 టీఎంసీలు, సీతారామ ఎత్తిపోతల ద్వారా 67 టీఎంసీలు, సమ్మక్క సాగర్ (తుపాకుల గూడెం) కింద 47టీఎంసీలు వాడుకున్నాకే.. వాటిపై సిమ్యులేషన్ అధ్యయనాలను పరిశీలించిన తర్వాతే ముందుకెళ్లాలని తెలంగాణ నివేదించింది. ఇచ్చంపల్లి నిర్మించిన తర్వాత 200 టీఎంసీల వరద జలాలను వాడుకునేందుకు అవకాశం ఇవ్వాలని తెలిపింది. గోదావరి-కావేరీ అనుసంధానంలో 50 % వాటాను తమకే కేటాయించాలని.. ఆ నీటిని రాష్ట్రంలో ఎక్కడైనా వాడుకునే స్వేచ్ఛనివ్వాలని తెలంగాణ కోరింది. ఈ వాటా జలాల వినియోగానికి కేంద్ర నిధులతో 2 రిజర్వాయర్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరిపై 968 టీఎంసీల వినియోగానికి చేపట్టిన ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు ఇవ్వాలని తెలిపింది. ఇచ్చంపల్లి నుంచి సాగర్ వరకు నీటిని తరలించే కన్వేయర్ సిస్టమ్‌పై సంయుక్త అధ్యయనాలు చేసి సాధ్యమైనంత మేరకు ముంపు తగ్గించాలని కోరింది. ఇచ్చంపల్లి నుంచి తరలించే జలాలను నాగార్జున సాగర్‌లోకి కాకుండా దిగువన 7 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన టెయిల్‌పాండ్‌కు మళ్లించాలని సూచించింది. దీంతో కర్ణాటకకు కేటాయించిన 16 టీఎంసీలను ఆల్మట్టిలో వాడుకుంటే దాని ప్రభావం జూరాలపై పడుతుందని, ఈ విషయమై పునరాలోచన చేయాలని తెలంగాణ డిమాండ్ చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా ఏపీ ప్రతిపాదించిన 4 ఇంట్రాలింక్ కాన్సెప్ట్ నోట్‌లను పరిగణనలోకి తీసుకుని డీపీఆర్ తయారు చేయాలని ఎన్‌డబ్ల్యూడీఏ కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. అనుసంధాన ప్రాజెక్టుపై అందరి సమ్మతి తెలిపే మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్‌పై సంతకాలు చేయడానికి తొందరేం లేదని పేర్కొన్నది.

ఆయన భారత్‌ను ఎంచుకున్నారు!

- అన్నాడీఎంకే, డీఎంకే లడాయిపై లోకేశ్

అమరావతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రలో గూగుల్ పెట్టుబడి తమిళనాట అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ రగడకు కారణమయింది. తమిళ మూలాలు ఉన్న వ్యక్తి సీఈఓగా ఉన్న కంపెనీ ఆయన స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టకపోవడం డీఎంకే ప్రభుత్వ వైఫల్యమేనంటూ మాజీ సీఎం ఎడప్పాడి ఎక్స్ వేదికగా విమర్శలకు దిగారు. దానిపై డీఎంకే ప్రభుత్వంలోని పరిశ్రమల మంత్రి టీఆర్‌బీ రాజా ప్రతిస్పందించారు. తమిళనాట చెలరేగిన ఈ రాజకీయ హోరుపై ఓ టీవీ చానల్ ప్రసారం చేసిన వార్త స్క్రీన్ షాట్‌ను ఎక్స్ ఖాతాలో పంచుకున్న మంత్రి లోకేశ్... మూడంటే మూడే పదాలతో స్పందించారు. 'ఆయన భారత్‌ను ఎంచుకున్నారు' అని పేర్కొన్నారు.

ప్రజారోగ్యానికి 'వాయు'గండం!

దీపావళి రోజున కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి.. -హైదరాబాద్‌లో 386కు చేరిన 'ఏక్యూఐ'

- నాలుగేళ్లలో అక్టోబరులో ఇదే తొలిసారి
- గాలిలో ధూళికణాల (పీఎం2.5) స్థాయి 37ఎంజీ నుంచి 69ఎంజీకి పెరుగుదల
- గత ఏడాది కంటే తగ్గిన ధ్వని కాలుష్యం
- ఉదయం 64.03, రాత్రి 60.68 డెసిబుల్స్



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దీపావళి టపాసులతో వాయు కాలుష్యం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఒక్కరోజులోనే ప్రమాదకర స్థాయికి చేరింది. ఇప్పటికే హైదరాబాద్‌తో సహ తెలంగాణలోని ముఖ్య నగరాల్లో వాయు కాలుష్యం పెరుగుతూ వస్తోంది. పారిశ్రామిక, రద్దీ ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్- ఏక్యూఐ) ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. దీపావళినాడు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఏక్యూఐ 386 మార్కును దాటింది. కేవలం కొద్ది గంటల్లోనే ఆ స్థాయికి చేరింది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఏక్యూఐ 105 ఉండగా.. రాత్రి 9 గంటలకు 386కు పెరిగింది. హైదరాబాద్‌లో గత నాలుగేళ్లలో అక్టోబరు నెలలో వాయు కాలుష్య తీవ్రత ఈ స్థాయిలో లేదని గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది అక్టోబరులో ఏక్యూఐ ఒక్కసారి కూడా 100 దాటలేదు. ఇదే నెలలో గత నాలుగేళ్లల్లో ఒక్కసారీ 150 దాటలేదు. కానీ ఈ ఏడాది ఈ నెల 6వ తేదీ నుంచి ప్రతీ రోజూ భాగ్యనగరంలో ఏక్యూఐ 100-150కు మధ్య నమోదవుతూ వస్తోంది. దీపావళి రోజు ఏకంగా అత్యధికంగా స్థాయిలో 386కు పెరగడం ఆందోళనకు గురిచేస్తోందని పర్యావరణవేత్తలు అంటున్నారు. ఏక్యూఐ.. 50లోపు ఉండాలి. ఈ సంఖ్య పెరిగిన కొద్దీ వివిధ క్యాటగిరీలుగా విభజించారు. 301 నుంచి 400 మధ్య ఉంటే పర్పుల్ అలెర్ట్ జారీ చేసి.. ప్రభావం తీవ్రంగా ఉంటుందని పరిగణిస్తారు. ఆరోగ్యవంతులకూ శ్వాసకోశ సమస్యలు రావచ్చు. గుండె జబ్బులు ఉన్నవారిపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. దీపావళి రోజున హైదరాబాద్‌లో గాలిలో ధూళి కణాల స్థాయి (పీఎం 2.5) క్యూబిక్ మీటరుకు 69 మైక్రో గ్రాములకు పెరిగింది. ఇది సాధారణ రోజుల్లో 37 ఎంజీ ఉంటుంది. పీఎం10 కణాల స్థాయి సాధారణ రోజుల్లో 91 ఎంజీ ఉండగా, దీపావళినాడు 153 ఎంజీకి చేరింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఈ గణాంకాలను విడుదల చేసింది. అయితే గత ఏడాది దీపావళి రోజుతో పోలిస్తే ఈ ఏడాది పీఎం2.5 ధూళి కణాల స్థాయి 15 ఎంజీ, పీఎం10 కణాల స్థాయి 31 ఎంజీ తక్కువగా నమోదైందని వెల్లడించింది.

అవగాహన పెరిగింది.. , ధ్వని కాలుష్యం తగ్గింది

ధ్వని కాలుష్యంపై హైదరాబాద్ వాసుల్లో అవగాహన పెరిగిందా అంటే.. ఔననే అంటోంది కాలుష్య నియంత్రణ మండలి. రెండేళ్లుగా దీపావళి రోజున ధ్వని కాలుష్యం ఉదయం వేళ కంటే, రాత్రి వేళ తక్కువగా నమోదు కావడమే నిదర్శనమని చెబుతోంది. టీజీపీసీబీ తాజా నివేదిక మేరకు 2024 దీపావళి రోజున నివాస ప్రాంతాల్లో ధ్వని కాలుష్యం ఉదయం 68.89 డెసిబుల్స్ ఉండగా, రాత్రి వేళ 65.68గా నమోదైంది. ఈ ఏడాది దీపావళి నాడు ఉదయం 64.03కు తగ్గగా, రాత్రివేళ మరింత తగ్గి 60.68 నమోదైంది. దీనిపై జేఎన్‌టీయూ పర్యావరణ నిపుణులు స్పందిస్తూ.. హైదరాబాద్ ప్రజలు అధిక ధ్వనిని సృష్టించే బాణసంచా వైపు మొగ్గు చూపలేదన్నారు. గతంలో అర్ధరాత్రి దాటాక ఒంటిగంట వరకు బాణసంచా కాల్చేవారని, ఈ ఏడాది రాత్రి 11 గంటల్లోపే శబ్దాలు ఆగిపోయాయని వివరించారు.

ఏ పార్టీలో ఉన్నాడో చెప్పలేని దానం.. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినరా?!

- దమ్ముంటే రాజీనామా చేసి.. ఉప ఎన్నికలో గెలవాలి: కేటీఆర్
- రేవంత్..నయా నరకాసురుడు: హరీశ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఏ పార్టీలో ఉన్నాడో చెప్పలేని దానం నాగేందర్‌ను స్టార్ క్యాంపెయినర్‌గా పెట్టుకోవడం కాంగ్రెస్ దిక్కుమాలిన రాజకీయాలకు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేను స్టార్ క్యాంపెయినర్‌గా ఎలా నియమిస్తారని కాంగ్రెస్‌ను నిలదీశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు దమ్ముంటే పదవికి రాజీనామా చేసి.. కాంగ్రెస్ తరఫున నిలబడి గెలవాలని సవాల్ విసిరారు. బస్తీ దవాఖానల నిర్వాహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజారోగ్యాన్ని విస్మరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖానను ఆయన సందర్శించి, రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికైనా నిద్ర మత్తు వదిలి బస్తీ దవాఖానాల్లో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్లు కూల్చడం తప్ప చేసిందేమీ లేదని, ఇది ఆగాలంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నయా నరకాసురుడి అవతారమెత్తారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్ పాలకుల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. కాగా, హరీశ్ రావు పర్యటన జరుగుతుండగానే మాజీ కార్పొరేటర్ కొమిరెశెట్టి సాయిబాబా అర్ధంతరంగా వెళ్లిపోయారు. తనను కాదని, ఇతర నియోజకవర్గాల నేతలకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆయన మనస్తాపానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న హరీశ్.. ఆయనకు ఫోన్ చేసి బుజ్జగించారు. ఇలాంటివి జరగకుండా చూసుకుంటానని భరోసా ఇచ్చినట్లు తెలిసింది.


బస్తీ దవాఖానలో డాక్టర్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

40 మంది స్టార్ క్యాంపెయినర్లు

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం కోసం 40 మందితో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను బీఆర్ఎస్ విడుదల చేసింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల, సబితా ఇంద్రారెడ్డి తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.